Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 158 మేడ్చల్ మల్కాజ్‌గిరి 29 జూన్ 2023 గురువారం పేజీలు : 4

## సిద్ధరామయ్యపై డీకే శివ కుమార్ సంచలన వ్యాఖ్యలు

బెంగళూరు : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2017లో హెబ్బల్ స్టీల్ ఫ్లైఓవర్ విషయంలో నిరసనలకు సిద్ధరామయ్య భయప డిపోయా రని, తాను అయి ఉంటే నిరసనలకు భయపడి ఉండేవా డిని కాదని అన్నారు. బెంగళూరు జిల్లా వ్యవస్థాపకుడు నాదప్రభు కెంపెగౌడ 514వ జయంత్యుత్సవాలు కర్ణాటక విధాన సభలో జరిగాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కెంపెగౌడకు నివాళులర్పించారు. బెంగళూరు అభివృద్ధికి కారణం కెంపెగౌడ దార్శనికత అని తెలిపారు. ఆయన గొప్ప పరిపాలకుడని కొనియాడారు. కెంపెగౌడకు నివాళులర్పించిన అనంతరం డీకే శివ కుమార్ మాట్లాడుతూ, 2017లో అప్పటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, అప్పటి బెంగళూరు నగర అభివృద్ధి శాఖ మంత్రి కేజే జార్జి నగరంలో స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి వెనుకంజ వేశారని చెప్పారు. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ జరిగిన నిరసనలకు వీరిద్దరూ భయపడిపోయారని అన్నారు.

అదే తాను అయి ఉంటే, నిరసనకారులు చేసే తాటాకు చప్పుళ్లకు లొంగిపోయేవాడిని కాదన్నారు.



## శ్రావణ మాసం ఆరంభంలోనే....

# 'సీట్ల ప్రకటన'

హైదరాబాద్ : తెలంగాణలో మరో నాలుగైదు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. అధికార బీఆర్ఎస్ పెద్ద సంఖ్యలో అభ్యర్థుల జాబితాను విడుదల చేయనుందనే ఊహాగానాలు వస్తున్నా యి. అంటే దాదాపు 80 శాతం అభ్యర్థులను ఆషాఢం ముగియగానే ప్రకటిస్తుందని అంచనాలు వస్తున్నాయి. ప్రతిపక్షాలు కాలూ చేయీ కూడదీసుకునేలోపే దూసుకెళ్లాలనేది బీఆర్ఎస్ వ్యూహం. ఎలాగూ విపక్షాలు ఈ విషయంలో కాస్త వెనుకబడి ఉంటాయి. వారికంటే మనం ముందుంటే రేసులో ఎదురుండదని.. ఎన్నికల ప్రధాన ఘట్టం నాటికి తిరుగే ఉండదని గులాబీ పార్టీ లెక్క. ఇంతవరకు బాగానే ఉ న్నా.. సిటింగ్ లందరికీ టికెట్లు ఇస్తారా సీఎం కేసీఆర్? అనేది చర్చనీ యాంశంగా మారింది. గతంలో పలుసార్లు భారీ తప్పిదాలు చేస్తే తప్ప సిటింగ్ లకు టికెట్ నిరాకరణ ఉండదని కేసీఆరే ప్రకటించారు. ఇప్పుడు కూడా అదే మాట మీద ఉన్నారని చెబుతున్నారు.

**ఎమ్మెల్యేలకే కాదు.. మంత్రులకూ టికట్? :** ఏ పార్టీ అయినా సిటింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించడం మోస్తరు సంచలనం అవుతుంది. అధికారంలో ఉన్న పార్టీ మంత్రులకు టికెట్ ఇవ్వకపోడం అంటే మరింత సంచలనమే. పదవి కోసం ఎమ్మెల్యేల నుంచి తీవ్ర ఒత్తిడి ఉ న్నా.. అందులోంచి ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు అంటేనే.. అనేక సమీకరణాలు విశ్వసనీయత సమర్థత అంచనా వేసి తీసుకుంటా రు. అలాంటిది వారికే ఎన్నికల్లో టికెట్ నిరాకరించడం అంటే చర్చనీ యాంశమే. కాగా తెలంగాణ ఎన్నికల్లో 12 మంది ఎమ్మెల్యేలకు ఈసారి టి "కట్" అని ప్రచారం జరుగుతోంది. అయితే మరో ఐదుగురు మంత్రులకూ కేసీఆర్ టికెట్ నిరాకరించనున్నారని తెలుస్తోంది.

**అందులోనూ ఇద్దరు సన్నిహితులు..** కేసీఆర్ టికెట్ ఇవ్వబోరనే మంత్రుల జాబితాలో తొలి పేరు కార్మిక శాఖ చూస్తున్న చామకూర మల్లారెడ్డి. మిగతావారు వరుసగా నిరంజన్ రెడ్డి జగదీశ్ రెడ్డి గంగుల కమలాకర్ కొప్పుల ఈశ్వర్. వీరిలో మల్లారెడ్డి విద్యా సంస్థలపై గతంలో ఎన్నో ఆరోపణలు వచ్చాయి. ఇటీవల ఈడీ దాడుల్లో రూ.4 కోట్లకు పైగా దొరికాయి. మల్లారెడ్డి వ్యక్తిగతంగానూ తన వ్యాఖ్యల ద్వారా చర్చనీయాంశం అయ్యారు.

## ఆ ఐదుగురు అమాత్యులకు 'సీట్లు' సిరుగుడేనా...?

నిరంజన్ రెడ్డి పేరు ఫాంహౌస్ వ్యవహారంలో బయటకు వచ్చింది. జగదీశ్ రెడ్డి ఎటువంటి వివాదాల్లోనూ లేరు. గంగుల కొప్పుల ఇద్దరూ కరీంనగర్ జిల్లాకు చెందినవారు.

**రాజకీయ కారణాలేనా? :** ఐదుగురు మంత్రుల్లో మల్లారెడ్డి మినహా నలుగురికి రాజకీయ కారణాలతోనే కేసీఆర్ టికెట్ నిరాకరిస్తున్నట్లుగా కథనాలు వస్తున్నాయి. బీఆర్ఎస్ కు ఆయువుపట్టయిన ఉమ్మడి కరీంనగర్ లో బీజేపీ ఎదుగుదలను ఈటల రాజేందర్ ను ఎదుర్కొనలేకపోయారనేది గంగుల కొప్పుల మీద ఉన్న ప్రధాన ఆరోపణ. దీనిని వైఫల్యంగా చూస్తున్న పార్టీ అధిష్ఠానం టికెట్ ఇవ్వబోవడం లేదంటున్నారు. ఇక పీసీసీ చీఫ్ రేవంత రెడ్డి సొంత జిల్లా అయిన ఉమ్మడి మహబూబ్ నగర్ లో కాంగ్రెస్ పుంజుకోవడం నిరంజన్ రెడ్డికి చేటు చేసింది. ఇదే అంశం ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రి జగదీశ్ రెడ్డికీ వర్తించనుంది. అయితే వీరిద్దరూ సీఎం కేసీఆర్ కు ఆప్తులు. తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచీ ఉన్నవారు. కొప్పుల ఈశ్వర్ సైతం అంతే. ఒకవేళ ఊహాగానాలే నిజమై వీరికి టికెట్ నిరాకరిస్తే మాత్రం అది పెద్ద సంచలనమే.

## కాంగ్రెస్‌పైన నమ్మకం పెరుగుతోందా ?

హైదరాబాద్ : తెలంగాణా కాంగ్రెస్ నేతల్లో ను ఇతర పార్టీల నుండి రాదలచుకున్న పార్టీ నేతల్లో నమ్మకం కలిగేట్లుగా కర్నాటక కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకుంటోంది. ఇంతకీ విషయం ఏమిటంటే కాంగ్రెస్ తరపున మొన్నటి ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన మాజీ ముఖ్యమంత్రి జగదీష్ షెట్టర్ కు ఎంఎల్సీ సీటు ఖాయమైంది. బీజేపీ లో సీనియర్ నేతైన జగదీష్ సరిగ్గా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ లో చేరేటప్పుడే ఎంఎల్ఏగా టికెట్‌మంత్రివర్గం లో చోటు హామీ ఇచ్చింది. అయితే లింగాయత్ వర్గంలో పట్టున్నప్పటికీ జగదీష్ ఓడిపోయారు. హుబ్బలి ధార్వాడ్ స్థానం నుండి పోటీ చేసిన జగదీష్ కొద్దిపాటి తేడాతో ఓడిపోయారు.

అలాంటి నేత కు అనూహ్యంగా ఎంఎల్సీ పదవి ఖాయమైపో యింది. ఇదెలా జరిగిందంటే బీజేపీ సీనియర్ నేతలైన లక్ష్మణ్ సవాది బాపూరావు చియాంచన్ సూర్ ఆర్ శంకర్ కు అగ్రనేతలు ఎంఎల్ఏ టికెట్లివ్వ లేదు. వీళ్ళు ముగ్గురు ఎంఎల్సీలు అయినా ఎంఎల్ఏ టికెట్ల కోసం పట్టుపట్టారు. టికెట్లు దక్కకపోవటం తో వీళ్ళు సవాది కాంగ్రెస్ లో చేరారు. బీజేపీ మీద కోపంతో వీళ్ళ ముగ్గురు తమ ఎంఎల్సీ పదవులకు రాజీనామాలు చేశారు.

దాంతో సడెన్ గా మూడు స్థానాలు ఖాళీ అయ్యాయి. వీటిని ఇపుడు కాంగ్రెస్ నేతల తో భర్తీ చేస్తున్నారు. భర్తీ చేయబోయే మూడుస్థానాల్లోనే జగదీష్ కు అవకాశం ఇచ్చారు. ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే ఎన్నికల ముందు కాంగ్రెస్ లో చేరిన



ఇతర పార్టీ నేతల కు అధిష్టానం హామీ ఇవ్వటం మామూలే. అయితే ఎన్నికల తర్వాత హామీ నిలుపుకుంటుందా లేదా అన్నది తేలాలి. కానీ ఇపుడు జగదీష్ విషయం లో అధిష్టానం చూపిస్తున్న చొరవ తెలంగాణా కాంగ్రెస్ మీద నమ్మకం పెంచుతుందనటంలో సందేహంలేదు. ఇక్కడ కూడా ఇతర పార్టీల్లో నుండి గట్టి నేతలను ఆకర్షిస్తున్నారు. కుదిరితే ఎంఎల్ఏ టికెట్ లేకపోతే అధికారం లోకి రాగానే కీలకమైన పదవి అని హామీ ఇస్తున్నది అధిష్టానం.

ఇపుడు జగదీష్ వ్యవహారంతో తెలంగాణా లో నేతల కు కూడా కాంగ్రెస్ అధిష్టానం మీద నమ్మకం పెరుగుతుంది కాబట్టి ఇతరపార్టీల్లోని నేతలు హస్తం పార్టీలో చేరటానికి ముందుకొస్తారు.

## జూలై 12 న తెలంగాణకు ప్రధాని రాక!

### – కాజీపేటలో పిఓహెచ్ కు శంకుస్థాపన



హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జులై 12న రాష్ట్రానికి వచ్చే అవకాశముందని భాజపా వర్గాలు తెలిపాయి. రైల్వే శాఖ ఆధ్వర్యంలో కాజీపేటలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్‌ల పీరియాడిక్ ఓవర్ హాలింగ్ (పీఓహెచ్) కేంద్రానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. భాజపా మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఈ నెలాఖరు లోపు ప్ర ధాని రాష్ట్రానికి రావాల్సి ఉండగా కార్యక్రమం వాయిదా పడిందని, జులై 12న వస్తారని పార్టీ ముఖ్య నేతలు తెలిపారు. అదే రోజు వరంగల్‌లో సభ నిర్వహించేం దుకు చర్చిస్తున్నామని, రెండు రోజుల్లో ప్రధాని పర్యటన ఖరారు అవుతుందన్నారు.

**జులై 8న భాజపా నేతల కీలక సమావేశం :** హైదరాబాద్ వేదిక గా జులై 8న 11 రాష్ట్రాల భాజపా అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కా ర్యదర్శులతో సమావే శం నిర్వ హించనున్నారు. రాష్ట్రం లో ఈ ఏడాదే శాసనసభ ఎన్నిక లు జర గనున్న నేపథ్యంలో... ఈ కీలక స మావేశం పార్టీపై సానుకూల ప్రభా వం చూపుతుందని భాజ పా నాయ కత్వం భావిస్తోంది. అం దుకే వివిధ రాష్ట్రాల పార్టీ బాధ్యుల తో కీలక సమావేశానికి హైదరా బాద్‌ను వేదిక చేసుకున్నట్లు తెలిసింది.

## తెలంగాణా బీజేపీ రూటు మారుతుందా?

# కింకర్తవ్యం!!





హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ మూడవసారి అధికారంలోకి రావాలని బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూ బి ఆర్ ఎస్ దూకుడుగా ముందుకు వెళు తుంది. వచ్చే ఎన్నికలలో ఎలాగైనా విజయం సాధించి రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేయాలని ప్లాన్ చేసుకున్న బీజేపీ మాత్రం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి బాలారిష్టాలు వచ్చిపడుతున్నాయి. ఒకటి వదిలితే మరొకటి అన్నట్టు బీజేపీని ఇటీవల కాలంలో సమస్యలు వేధిస్తున్నాయి. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తొలినాళ్లలో దూకుడుగా అడుగులు వేసిన బిజెపి ఏకతాటి మీద నడుస్తున్నట్టు కనిపించింది. క్రమంగా బిజెపిలో వర్గ పోరు, అంతర్గత కలహాలు పెరుగుతున్నట్లుగా అనేక వార్తలు రావడంతో, అందుకు తగ్గట్టు బిజెపిలో ఉన్న నాయకులు కూడా చేస్తున్న వ్యాఖ్యలతో బిజెపి అసలు లక్ష్యాన్ని వదిలి పార్టీ దిద్దుబాటుపై ఫోకస్ పెట్టాల్సి వస్తోంది.

### కాలం కలిసి రావట్లే!!

ఇక ఇదే సమయంలో ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి చేరికలు జరుగుతాయని భావిస్తే, అవి జరగకపోగా, బీజేపీలో ఉన్న నాయకులు ఇతర పార్టీలకు పెడతారన్న ప్రచారం కూడా బిజెపికి పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టడం, అంతర్గతంగా పార్టీ నేతల మధ్య సఖ్యత కోసం పని చేయడం ప్రస్తుతం బీజేపీ ప్రధాన కర్తవ్యంగా మారింది. ఒకపక్క బీఆర్ఎస్ పార్టీ లోనూ జిల్లాలలో నేతల మధ్య సమన్వయం లేకపోయినా, సీఎం కేసీఆర్ మాత్రం వ్యూహాత్మకంగా ప్రతి జిల్లాలోనూ పార్టీని ముందుకు నడిపించడానికి పని చేస్తున్నారు. ఉమ్మడి అజెండాతో అన్ని జిల్లాల్లోనూ కార్యాచరణ ఇచ్చి అమలయ్యేలా చేస్తున్నారు. అన్ని విషయాల లోనూ వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీ ముందుకు వెళుతుంటే, బిజెపి గందరగోళ పరిస్థితులు ఎదుర్కొంటుంది. డీలా పడొద్దు.. దూకుడే ముఖ్యం.. అందుకే తెలంగాణా బీజేపీ బడా వ్యూహం!! బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి, కెసిఆర్ కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి, ప్రజల మద్దతుతో అధికారంలోకి రావాలని భావించిన బీజేపీ, ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఉన్న అనేక సమస్యలపై గట్టిగా పోరాటం చేయలేకపోతోంది. అందుకు కారణం సొంత పార్టీలోని నేతలపైనే పార్టీ మారతారని రకరకాల ఊహాగానాలు ప్రచారం కావడం. ఈ క్రమంలో బిజెపి అసలు లక్ష్యాన్ని విడిచిపెట్టి, సంస్థాగతంగా బలోపేతం కావడానికి, సమైక్యం గా పని చేయడానికి ఫోకస్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతోనే బిజెపి రూటు మారిందని ప్రజలలో జోరుగా చర్చ జరుగుతోంది. నిజంగానే బీజేపీలో ఉన్న అంతర్గత కలహాలు ఇందుకు కారణమా? లేక బీజేపీపై ప్రజలలో విశ్వాసం తగ్గించడం కోసం సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారమా? అన్నది కూడా ఆలోచించవలసిన అంశమే. ఏది ఏమైనప్పటికీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో బిజెపి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే రెట్టించిన ఉత్సాహంతో పార్టీ శ్రేణులన్నీ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పార్టీ అధినాయకత్వం పదే పదే చెబుతోంది. బీజేపీ శ్రేణులు కూడా అదే భావిస్తున్నారు. ఆధిపత్య పోరు, ఇగోలు పక్కనపెట్టి బీజేపీ నేతలంతా కలిసికట్టుగా పని చెయ్యాలని భావిస్తున్నారు. మరి తెలంగాణ బీజేపీ నేతలు ఆ పని చేస్తారా? లేదా? అనేది తెలియాల్సి ఉంది.

# సంపాదకీయం

## ఈ దేశానికి ఎమర్జెన్సీ అవసరం మళ్ళీ ఉందా...?

భారత దేశం సువిశాలమైన దేశం భిన్న మతాలు అభిమతాలు ఎన్నో కులాలు ఇలా కనుక చూస్తే భిన్నత్వంలో ఏకత్వం ఈ దేశం నీతి రీతి. అలాంటి భారతదేశం స్వాతంత్రం వచ్చాక గడచిన ఏడున్నర దశాబ్దాల కాలంలో ఎంతో ప్రగతి సాధించింది. అదే టైం లో చూస్తే ఈ దేశంలో అవినీతి ఉంది. రెడ్ టేపిజం ఉంది ఇప్పటికి కూడా భారత్ అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉంది. ఇంతటి దేశంలో అందరినీ ఒకే త్రాటి మీద నడిపించడం అంటే కత్తి మీద సాము లాంటి వ్యవహారమే. ఏ డెసిషన్ అయినా తుచ తప్పకుండా కోట్లాది మంది ప్రజలు పాటించేలా చూడడం బహు కష్టమైన వ్యవహారమే. ఈ దేశానికి సంబంధించి రెండు ముఖ్యమైన చారిత్రాత్మక ఘట్టాలను తలచుకుంటారు. చరిత్ర పుటలలో అవి ఎప్పటికీ పదిలంగా ఉంటాయి. అందులో ఒకటి 1947 ఆగస్టు 15న దేశానికి వచ్చిన స్వాతంత్రం. అది ఆనందకరమైన వేడుకగా చూస్తారు. మరో సందర్భం ఏంటి అంటే 1975 జూన్ 25 తేదీ. ఈ రోజును చేదు జ్ఞాపకంగా ప్రజాస్వామిక ప్రియులు చెబుతారు. ఆ రోజున ఎమర్జెన్సీ దేశంలో విధించబడింది. అలా భారత రాజ్యాంగంలోని 352 (1) అధికరణంలో ఉన్న అంతర్గత అత్యవసర స్థితిని వినియోగించుకుని అప్పటి భారత రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ద్వారా నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ 1975 జూన్ 25 అర్థరాత్రి 11.45 నిమిషాలకు అధికారికంగా విధింపజేశారు. అది దేశంలో పెద్ద ఎత్తున అలజడికి కారణం అయింది. మొత్తం వ్యవస్థలు అన్నీ కేంద్రం గుప్పిట్లోకి వెళ్ళిపోయాయి. ఏకంగా 21 నెలల పాటు దేశంలో ఎమర్జెన్సీ కొనసాగింది. అది స్వయంగా ఇందిరా గాంధీయే ప్రధానిగా 1977 మార్చి 21లో ఉపసంహరించే వరకూ కొనసాగింది. దీంతో దేశంలో మొదటిసారిగా అయిదేళ్ళకు దేశంలో ఎన్నికలు జరగాల్సినది దానికి బదులుగా ఆరేళ్ళకు జరిగాయి. అంటే ఒక ఏడాది ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ద్వారా అన్ని హక్కులు ఉపయోగించుకుని దేశానికి ప్రధానిగా పనిచేశారన్న మాట. ఆ టైం లో ఇందిరా గాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైలుపాలు చేశారు. అలాగే దేశ వ్యాప్తంగా ఉన్న పత్రికలను సెన్సార్ చేశారు. ప్రధానమంత్రి కుమారుడు హోదాలో సంజయ్ గాంధీ అసలైన ప్రధాని తానే అన్నట్లుగా వ్యవహరించారు. ఇలా దేశమంతా విపక్షాల గొంతు వినబడకుండా చేశారు అన్న అపఖ్యాతిని ఇందిరాగాంధీ మూటకట్టుకున్నారు. అయితే ఇందిరా గాంధీ ఎమెర్జెన్సీకి ఒక వైపు చేటు జరిగిందని అనుకున్నా మరో వైపు మేలు కూడా జరిగింది. అదెలా అంటే అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగులు ఠంచనుగా కార్యాలయాలకు హాజరయ్యేవారు. అవినీతి లంచాల ఆరోపణలు ఉంటే నేరుగా డిస్మిస్ చేయడమే. దాంతో ప్రభుత్వ కార్యాలయాల్లో చకచకా పనులు సాగాయి. ఇది ఒక విధంగా మేలు అయిన నిర్ణయంగా కొంతమంది మేధవులు చెబుతారు అదే టైం లో అతి పెద్ద కుటుంబ నియంత్రణ డ్రైవ్ దేశంలో జరిగింది అపుడే. ఆనాటికే జనాభా బాగా విస్తరిస్తున్న నేపథ్యం ఉంది. దాదాపుగా అరవై కోట్లకు చేరువ అవుతున్న జనాభాను కంట్రోల్ చేయడానికి బలవంతపు ఆపరేషన్లు చేయించారు. ఆ తరువాత కాలంలో అంత పెద్ద ఎత్తున కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగిన దాఖలాలు అయితే లేవు. అది కూడా దేశానికి ఒక విధంగా మేలు చేసేదే. ఇక మీడియా కంట్రోల్ అని అంటున్నారు అయితే మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక వార్తలు కనిపించకూడదు అన్న ఆజ్ఞలు ఉన్నాయి. అదే టైంలో ఊహాగానాలకు తప్పుడు వార్తలకు అసలు ఆస్కారం లేదు. ఇక ప్రతీ దానికీ ఆందోళలను చేయడం రోడ్ల మీదకు వచ్చి జన జీవనాన్ని స్థంభింపచేయడం అన్న వాటికి ఎమర్జెన్సీలో గట్టిగా అణచేశారు. ఇలా కనుక ఆలోచిస్తే ఎమర్జెన్సీని నియంతృత్వ పోకడలుగా చెప్పేవారు ఉన్నారు. దారి తప్పిన ప్రజాస్వామ్యాన్ని ఇందిరాగాంధీ గాటిన పెట్టారని సపోర్ట్ చేసేవారూ ఉన్నారు. ఈ దేశంలో ఒక పని కావాలన్నా ఒక నిర్ణయం ఆమోదం పొందాలన్నా ఒక పట్టాన కుదరదు. అలాంటి దేశంలో 21 నెలల పాటు ఒక త్రాటి మీద అంతా సాగిపోయింది. ఇందులో మంచి చెడూ రెండూ ఉన్నా భారత్ లాంటి దేశంలో ఒక మంచి పని జరగాలన్నా అపుడే జరిగింది. అదే టైం లో పార్లమెంట్ కూడా నడవడం ద్వారా ప్రజాస్వామ్యం లేదు అన్న వారికి అక్కడే సరైన సమాధానం కూడా లభించింది. ఇందిరాగాంధీ భక్తులు కాంగ్రెస్ వారి మాటలలో చూస్తే ఆ సమయానికి ఎమర్జెన్సీ అవసరం అన్న భావన ఉంది. ఇక విపక్షాలు అయితే తమను జైలులో నిర్బంధించారు అని అంటారు. అయితే దేశంలో అరాచకం రాజ్యమేలుతున్న వేళ అంతర్యుద్ధం వచ్చే అవకాశం ఉన్న వేళ విపక్షాలు రెచ్చగొడుతూ దూకుడు చేస్తున్న వేళ ఉక్కు మహిళగా ఇందిరాగాంధీ కఠిన నిర్ణయం తీసుకున్నారు అని అంటారు. ఇక ఇపుడు చూస్తే దేశంలో 142 కోట్లకు పై దాటి జనాభా ఉంది. ఎక్కడా జనాభా కంట్రోల్ లేదు. అందుకే చైనాను అధిగమించేశాం దాంతో పాటుగా పేదరికాన్ని తెచ్చుకున్నారు ప్రజలు. ఇక దేశంలో మితిమీరిన స్వేచ్చ ఉంది. అది కూడా చేటు తెస్తోంది అన్న వారూ ఉన్నారు. ఇక ఏమి చేయాలన్నా సవాలక్ష అడ్డులు అడ్డంకులు దాంతో మంచి నిర్ణయాల అమలుకు ఎంతో సమయం పడుతోంది. అలాగే కొన్ని నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి ఉంది. అందువల్ల ఆనాటి అనుభవాలను చూసిన వారు తమదైన విశ్లేషణ చేస్తూ ఎమెర్జెన్సీ ఈ దేశానికి అవసరమే అని వాదించే సందర్భాలు ఉన్నాయి. ఇపుడు ఏకంగా పాలకులను సోషల్ మీడియా వేదికగా దూషించే యుగం ఉంది. అలాగే ప్రభుత్వ ఆఫీసులలో పనులు సకాలంలో అవుతున్నాయా అంటే జవాబు లేదు. ఎక్కడా భయం లేదు. వ్యవస్థలు అన్నీ కూడా అతి స్వేచ్చతో నడుస్తున్న కాలంలో చైతన్యం ఎక్కువ వికృత చేష్టలకు పోతున్న నేపథ్యంలో ఎమర్జెన్సీని ఇంకా చీకటి రోజులుగా అనుకునే వారు ఉన్నారా అంటే దేశం కోసం కఠినమైన కట్టుబాటు ఉండాల్సిందే అని వాదించే వారూ ఉన్నరు. ఈ దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అందరినీ ఏకత్రాటిపైన నడిపించాలంటే ఎమర్జెన్సీ కాదు కానీ అలాంటి వ్యవస్థ ఒకటి ఉండాలన్న వాదనకూ విలువ అయితే పెరుగుతోంది.

# విస్తరణ రెండు వరుసలే..



ఆదిలాబాద్ : జిల్లాలో కొత్తగా నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి తొలుత ఆమోదం లభించినా దిల్లీలోని అధికారులు వాహనాల రాకపోకలను పరిగణనలోకి తీసుకొని ప్రస్తుతమున్న రెండు వరుసల దారినే మరికాస్త విస్తరించేందుకు మొగ్గుచూపారు. ప్రస్తుతం ఉన్న జైనథ్, బేల రోడ్డు మీదుగా వెళుతున్న ఈ జాతీయ రహదారి వెడల్పు పెరగనుండటంతో వాహనదారులకు కాస్త ఊరటనివ్వనుంది. బేల మండల కేంద్రంలో మాత్రం బైపాస్‌రోడ్డు నిర్మాణానికే మొగ్గుచూపారు.

జిల్లాలో జైనథ్ మండలం భోరజ్ నుంచి జైనథ్, బేల మండల కేంద్రాల మీదుగా మహారాష్ట్ర సరిహద్దున ఉన్న శంకర్‌గూడ వరకు మొత్తం 33 కిలోమీటర్ల పొడవులో ఉన్న జాతీయ రహదారి నం.353బీ నాలుగు వరుసలుగా విస్తరించేందుకు బడ్జెట్‌లో నిధులు సైతం కేంద్రం కేటాయించింది. ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న ఈ దారిని నాలుగు వరుసలుగా మార్చాలంటే భూసేకరణ అవసరం. దీనిపై సర్వేచేసి నివేదికలిచ్చారు. ఈ నేపథ్యంలోనే పంచాయతీ అధికారులు రోడ్లపక్కన హరితహారం మొక్కలు నాటుతుండటంతో తాము నాలుగు వరుసల దారి నిర్మించనున్నామని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆపాలంటూ జాతీయ రహదారుల కార్యాలయ అధికారులు జిల్లా పాలనాధికారికి లేఖ పంపించారు. దీంతో నాలుగు వరుసల దారి నిర్మాణం మొదలవుతుందని అందరూ సంతోషపడ్డారు.

**మొగ్గుచూపని దిల్లీ అధికారులు..**

జిల్లాలోని అధికారులు తయారుచేసిన ప్రతిపాదనలపై దిల్లీలోని 'అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) సౌత్ జోన్' కార్యాలయంలో చర్చించారు. వాహనాల రాకపోకల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే ఉన్న రోడ్డు సరిపోతుందని నిర్ణయించారు. కాకపోతే బీటీ నిర్మాణ విస్తరణను పెంచనున్నారు. గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు నిర్మించనున్నారు. మధ్యలో ఎక్కడైనా అవసరమనుకుంటే మాత్రం అక్కడక్కడా భూసేకరణ చేపడతారని అధికారులు పేర్కొన్నారు.

**7 మీటర్ల నుంచి 10 మీటర్లకు బీటీ..**

ప్రస్తుతమున్న రహదారి 33 మీటర్ల విస్తరణలో ఉంటుంది. ఇందులో బీటీ (తారు) నిర్మాణం మాత్రం 7 మీటర్ల వెడల్పు (21 అడుగుల)తో చేపట్టారు. ఈ బీటీకి ఇరువైపులా మరో 1.5 మీటర్ల చొప్పున బీటీని విస్తరిస్తారు. తద్వారా తారురోడ్డు మొత్తం 10 మీటర్ల(30 అడుగులు)కు పెరగనుంది. రోడ్డు మధ్యలో ఎటువంటి డివైడర్స్ నిర్మాణాలు మాత్రం చేపట్టరు.

**తర్ణం వద్ద కొత్త వంతెన!**

జైనథ్ మండలం తర్ణం వద్ద ఉన్న వంతెన పక్కన మరో కొత్తదాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్నదాని కంటే రెండు మీటర్ల ఎత్తులో ఇది ఉండనుంది. అప్పటివరకు పాత వంతెనే ఉపయోగించనున్నారు. గతంలో ఈ వంతెనపై నుంచి నీరు ప్రవహించడం, నిర్మించి మూడు నాలుగు దశాబ్దాలు కావడంతోనే ఇక్కడ కొత్త వంతెనకు ప్రతిపాదించారు.

**భోరజ్ వద్ద మరో వీయూపీ..**

జైనథ్ మండలం భోరజ్ మీదుగా నాలుగు వరుసల రహదారి (నం.44) వెళుతుంది. ప్రస్తుత జాతీయ రహదారి నం.353బీ అక్కడ కలుస్తుంది. రెండు దారులు కలవడంతో అక్కడ వీయూపీ (వెహికిల్ అండర్ పాస్) సరిపోదని అధికారులు అంచనాకొచ్చారు. కొత్తగా మరో వీయూపీ నిర్మించనున్నారు. అయితే కొత్త వీయూపీ నాలుగు వరుసల రహదారి కిందనే నిర్మించనున్నా నిధులు మాత్రం జాతీయ రహదారుల అధికారులు కేటాయించనున్నారు.

లి ఈ విషయమై నిర్మల్‌లోని జాతీయ రహదారుల కార్యాలయ డీఈ సుభాష్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. జాతీయ రహదారి నం. 353బీని నాలుగు వరుసల దారిగా మార్చేందుకు ఉన్నతాధికారులు మొగ్గుచూపలేదన్నారు. భవిష్యత్తులో వాహనాల రద్దీ పెరిగితే నాలుగు వరుసలుగా మార్చవచ్చని పేర్కొన్నారు.

**ఒక్కచోటే బైపాస్!**

తొలుత జైనథ్, బేల మండల కేంద్రాల్లో బైపాస్ రోడ్లు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. అయితే బేల మండల కేంద్రంలో మాత్రమే బైపాస్ అవసరమని ఉన్నతాధికారులు సూచించారు. దీంతో అక్కడ మాత్రం నాలుగు కిలోమీటర్ల మేర భూసేకరణ చేపట్టనున్నారు. కాకపోతే కుడివైపు బైపాస్ నిర్మించాలా? ఎడమవైపున నిర్మించాలనేది మాత్రం ఇంకా ఖరారు కాలేదు.

# అందుబాటులోకి డిజిటల్ సేవలు



నిర్మల్ : కొంతకాలంగా ఆధునిక పోకడలను అందిపుచ్చుకుంటూ ప్రజలకు మరింత చేరువయ్యే ప్రయత్నం చేస్తున్న ఆర్టీసీ సంస్థ తాజాగా మరో ముందడుగు వేసింది. బస్సుల్లోనూ డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పించే చర్యలను ప్రారంభించింది. టికెట్టుకు సరిపడా చిల్లర ఇవ్వండి, కండక్టరుకు సహకరించండి.. బస్సుల్లో, ప్రయాణప్రాంగణాల్లో మనం సాధారణంగా చూసే నినాదమిది. టిక్కెట్టు తీసుకునే సమయంలో సరైన చెల్లింపుల్లేక అటు ప్రయాణికులు, ఇటు సంస్థ సిబ్బంది ఇబ్బందులు పడటం చూస్తూనే ఉన్నాం. ఈ సమస్యకు పరిష్కారంగా నూతన విధానం అందుబాటులోకి తీసుకొచ్చింది. నిర్మల్ డిపో పరిధిలో నుంచి సేవలు అందుబాటులోకి వచ్చాయి.

**కాలానుగుణంగా..**

ముందస్తు టికెట్లు రిజర్వు చేసుకున్నవారి సంగతి పక్కనపెడితే.. బస్సులో టికెట్ పొందేవారు విధిగా కావాల్సినంత చిల్లర ఇవ్వాల్సిందే. ప్రతీ ప్రయాణికుడి వద్ద విధిగా చిల్లర ఉంటుందన్న గ్యారెంటీ లేదు. అదే సమయంలో కండక్టరు వద్దా అందుబాటులో ఉండకపోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో మిగతా చిల్లరను సక్రమంగా ప్రయాణికుడికి అప్పగించడం కండక్టరు, డ్రైవరుకు ఇబ్బందికరంగా ఉండేది. ఇద్దరు, ముగ్గురికి కలిపి డబ్బులు ఇవ్వాల్సి వచ్చేది. దీనికి స్వస్తి పలుకుతూ ఆర్టీసీ సైతం యూపీఐ సేవలను అందుబాటులోకి తెచ్చింది.

**కోడ్‌ను స్కాన్ చేసి..**

ప్రస్తుతం చాలాచోట్ల యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) సేవలు అందుబాటులోకి వచ్చాయి. దాదాపుగా డిజిటల్ విధానంలోనే చెల్లింపులు జరుగుతున్నాయి. ఆర్టీసీలోనూ ఈ విధానం అందుబాటులోకి వచ్చింది. ప్రతీ బస్సులో కండక్టరు, డ్రైవరు వద్ద నూతన డిజిటల్ పరికరాన్ని అందుబాటులో ఉంచనున్నారు. మనవద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్ సాయంతో స్కాన్ చేసి డబ్బులు చెల్లించవచ్చు. దీనివల్ల కావాల్సిన మొత్తమే చెల్లిస్తాం. ఫలితంగా చిల్లర ఇక్కట్లు దూరం కానున్నాయి.

**సద్వినియోగం చేసుకోవాలి**

**సాయన్న, డిపో మేనేజరు, నిర్మల్**

ప్రయాణికుల అవసరాలు, ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా సంస్థలోనూ మార్పులు చేస్తున్నాం. ఇందులో భాగంగా దూరప్రాంత బస్సుల్లో ముందుగా డిజిటల్ చెల్లింపుల విధానం అందుబాటులోకి తీసుకొచ్చాం. విడతలవారీగా అన్ని బస్సుల్లోనూ అమలుచేస్తాం. టికెట్ ధర ఎంత ఉంటుందో అంతే డబ్బులను నేరుగా డిజిటల్ విధానంలో చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. టికెట్ సైతం ఇందులోనే వస్తుంది. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

# అటకెక్కిన కల్లం..!

ఆదిలాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పండించిన వరి ధాన్యం ఆరబోసేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో వరి కల్లాల నిర్మాణం చేయాలని నిర్ణయించింది. దీనికోసం రైతులకు చెందిన ఖాళీ భూములను గుర్తించి ఉపాధి కూలీలతో కల్లాలను నిర్మాణం చేయనుంది. రైతుల్లో సరైన అవగాహన లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు ఆసక్తి చూపడంలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం, యాసంగిలో ధాన్యం ఆరబోసేందుకు సరైన స్థలం లేకపోవడంతో అనేక మంది రైతులు రహదారులు, పంట పొలాల్లోనే పరదాలు వేసి ఆరబోస్తున్నారు. దీంతో ధాన్యం సకాలంలో ఆరడం లేదు. తేమశాతం తగ్గడం లేదు. కొనుగోలులో జాప్యమేర్పడుతుంది. దీనివల్ల అకాల వర్షాలు కురిస్తే ధాన్యం మరోసారి తడిసిపోయి తీవ్రమైన నష్టం కలుగుతుంది.

**నిర్మాణం తీరిలా..**

రైతులకు అవసరమైన రీతిలో 50, 65, 75 మీ.పొడవు, వెడల్పుతో కూడిన మూడు రకాలైన కల్లాలను నిర్మించనున్నారు. ఒక్కో దానికి రూ.50 వేలు, రూ.65, రూ.75వేలు చెల్లించనున్నారు. కల్లం నిర్మించేందుకు మొదటగా రైతు పెట్టుబడి పెట్టి నిర్మించిన అనంతరం ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుంది. దీనికోసం క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి కల్లాలను నిర్మించేలా చర్యలు తీసుకుంటారు. ముందే పెట్టుబడి పెట్టాలనే నిబంధనతో అనేక మంది రైతులు కల్లాలు అవసరమైనప్పటికీ వాటిని నిర్మించేందుకు ఆసక్తి చూపడం లేదు. దీనిపై రైతులకు ఉపాధి అధికారులు అవగాహన కల్పించాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆసక్తి చూపడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**అవగాహన కల్పించి పనులు పూర్తిచేస్తున్నాం**

**శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, మంచిర్యాల.**

గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఎంతో ఉపయోగపడేరీతిలో వరి కల్లాలను నిర్మించాలని నిర్ణయించాం. దీనికోసం రైతులకు అవగాహన కల్పించి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. కొంతమేరకు రైతులు అనాసక్తి చూపినప్పటికీ కల్లాల ప్రాధాన్యతపై పలు సూచనలు చేయడంతో వాటిని నిర్మించేందుకు ముందుకు వస్తున్నారు. జిల్లాలో లక్ష్యం మేరకు కల్లాలను నిర్మించేందుకు ముమ్మరంగా కృషి చేస్తున్నాం.

# నిధుల జోరు.. పనులు తారుమారు

మిర్యాలగూడ : సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు.. డబ్బులకు కొదవలేదు. ఆదర్శంగా ఉండాల్సిన పనులను అస్తవ్యస్తంగా చేస్తున్నారు. ఇదీ తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామం నుంచి కొండాపురం వరకు విస్తరిస్తున్న రెండు వరుసల రహదారి తీరు. ఈ రోడ్డుకు ఇరువైపులా పోసిన మట్టి కోతకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత తీసుకొన్న వాసాలమర్రి గ్రామం నుంచి కొండాపురం వరకు గతంలో ఉన్న సింగిల్ రోడ్డు దెబ్బతింది. దీంతో నాలుగున్నర కిలోమీటర్ల మేర రహదారిని రెండు వరుసలుగా విస్తరించాలని సీఎం ఆదేశించారు. ఇందుకు రూ.10కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇంజినీరింగ్ అధికారులు రహదారిని చాలా ఎత్తు పెంచి నిర్మిస్తున్నారు. గుత్తేదారుడి నిర్లక్ష్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతింది. ఇరువైపులా రాతి కట్టడాలు(రివిట్‌మెంట్) లేకుండానే మట్టి పోయడంతో ఎక్కడికక్కడ కోతకు గురవుతోంది. అక్కడక్కడ రివిట్‌మెంట్ ఏర్పాటుచేసినా.. వర్షాలకు కొట్టుకుపోతోంది. మరో వాహనం వచ్చినప్పుడు వాహనదారులు బీటీ రోడ్డు దిగాలంటే భయపడుతున్నారు. కోతకు గురైన ప్రదేశంలో వాహనాలు దిగబడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. దెబ్బతింటున్న దారిని తక్షణమే బాగు చేయాలని, కోతకు గురి కాకుండా రివిట్‌మెంట్



కట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**ఎక్కలేం.. దిగలేం..** వాసాలమర్రి నుంచి కొండాపురం వరకు నిర్మిస్తున్న రహదారి మార్గ మధ్యలో ఉన్న రాంశెట్టిపల్లి గ్రామస్థులకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. రోడ్డును చాలా ఎత్తు పెంచి నిర్మిస్తుండటంతో తమ గ్రామంలోకి వెళ్లేందుకు నానాఅవస్థలు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. బీటీరోడ్డు కంటే అంతర్గత రహదారి లోయ మాదిరిగా కనిపిస్తోందని, దిగే క్రమంలో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి కింద పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎత్తయిన రోడ్డుని ఎక్కడానికి, దిగడానికి ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

**మరమ్మతులు చేపడుతాం - రవికుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈ**

రెండు వరుసల రహదారి కోతకు గురవుతున్నందున మరమ్మతులు చేయిస్తాం. ఇరువైపులా రాతి కట్టడాలు నిర్మించి కోతకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. రాంశెట్టిపల్లి గ్రామస్థుల సమస్య పరిష్కారం ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది.

# అధికారి ఆవేదన.. ముందుకొచ్చిన దాతలు

జనగామ : ఇటీవల జనగామ జిల్లా చౌడారం కస్తూర్బా గాంధీ బాలికల ఆవాస పాఠశాలకు బాలికా విద్య ప్రత్యేకాధికారిణి గౌసియాబేగం విధి నిర్వహణలో భాగంగా సందర్శనగా వెళ్లారు. వసతులు, భోజనం తదితర అంశాలు పరిశీలించిన ఆమె విద్యా విషయాలపై దృష్టి సారించారు. వృత్తి విద్య బోధకురాలు కుట్లు అల్లికలు దుస్తులు ఎలా కత్తిరించాలో బాలికలకు బోధిస్తున్నారు. కుట్టుమిషన్ లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆమె గమనించారు. బయట కుట్టించుకుంటే డబ్బులు చెల్లించాల్సి వస్తుందని బాలికలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

**కుట్టు మిషన్ల సరఫరాకు హామీ..**

గతంలో జనగామ సహా మరో రెండు, మూడు కేజీబీవీలకు ప్రభుత్వం కుట్టుమిషన్లు అందించినా.. అవి ప్రస్తుతం పని చేయడంలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనలో సమాజ భాగస్వామ్యాన్ని చొప్పించాలన్న ప్రభుత్వ పిలుపు మేరకు గంటా రవీందర్ నేతృత్వంలోని మహాత్మాగాంధీ హ్యాండ్స్‌ను గౌసియాబేగం సంప్రదించారు. ఆయనతోపాటు రాష్ట్రంలోని వివిధ హోదాలో ఉన్న వ్యక్తులు స్పందించి కుట్టు మిషన్లను అందిస్తామని, మరికొందరు డబ్బులు పంపిస్తామని ముందుకొచ్చారు. గురువారం ఉదయం వరకు పద్దెనిమిది కుట్టుమిషన్ల సరఫరాకు



హామీతోపాటు, కొంతమేర ఆర్థిక సహాయం చేశారు. ప్రస్తుతానికి ప్రతి కస్తూర్బా పాఠశాలకు ఒక్కో కుట్టుమిషన్ అందించి లభించిన నగదుతో మూలన పడ్డ మిషన్లు మరమ్మతు చేయిస్తామని రవీందర్ తెలిపారు. ప్రస్తుతానికి ఈ విరాళాలు సరిపోతాయని మరోసారి ఇతరుల విరాళాలు స్వీకరిస్తామని మనవి చేశారు.

లి జిల్లాలో 12 కస్తూర్బాగాంధీ పాఠశాలలున్నాయి. ఎక్కువ మంది బాలికలున్న 5 పాఠశాలలకు రెండు మిషన్ల చొప్పున, తక్కువ మంది బాలికలున్న ఏడు కేజీబీవీలకు ఒక్కోటి చొప్పున మొత్తం 17 మిషన్లను అందించనున్నారు. మరికొంత నగదుతో పనికిరాకుండా ఉన్న వాటిని వినియోగంలోకి తెస్తారు.

# ప్రజలకు చేరువగా ఆర్టీసీ సేవలు

వరంగల్ : ఆర్థిక పరిపుష్టిని సాధించడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ఆర్టీసీ వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా బస్ డిపోల పరిధిలో కొత్తగా విలేజ్ బస్ ఆఫీసర్ల(వీబీవో)ను నియమించింది. ప్రస్తుతం సంస్థలో పని చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికే అదనపు బాధ్యత లను అప్పగించింది. ఇప్పటికే వీరికి విధులు, బాధ్యత లపై శిక్షణ ఇచ్చి.. టీషర్టులు, బ్యాగులు, గుర్తింపు కార్డుల ను అందజేశారు. బస్ ఆఫీసర్లు ఆయా మండలాల్లో విధుల్లో చేరారు. గ్రామీణ, పట్టణ మహిళలు, వయో వృద్ధులకు బస్సు ప్రయాణాల్లో ఆర్థిక భారం తగ్గించేందుకు ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ సిటీ బస్సుల్లో అమలు చేస్తున్న తరహాలో తొలిసారిగా జిల్లా పరిధిలో పల్లె వెలుగు బస్సుల్లో టీ-9 టికెట్‌ను అందుబా టులోకి తెచ్చింది. ఈ నెల 18 నుంచి ఈ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. మహిళలు, వృద్ధులు 60 కిలో మీటర్ల దూరం వరకు రాయితీపై పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించారు.

బస్ ఆఫీసర్ల విధులు, బాధ్యతలు...

ఉమ్మడి వరంగల్ రీజియన్ పరిధిలోని 9 బస్సు డిపో ల పరిధిలో మొత్తం 165 మంది విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించగా, జనగామ జిల్లాకు తొలి విడతగా 18 మందిని నియమించారు. వీరు ఆయా ప్రాంతాల ప్రజల తో నెలకు కనీసం రెండుసార్లు సమావేశమై బస్సుల రాకపోకల సమయం, నూతన సర్వీసులు, సమస్యలను తెలుసుకోవడంతో పాటు దివ్యాంగులు, వృద్ధులు, విద్యా ర్థులు, ప్రజలకు ఆర్టీసీ సంస్థ అందించే వివిధ రాయితీ పథకాలు, బస్ పాసుల వివరాలను వివరిస్తూ విస్తృత ప్రచారం చేస్తారు. ప్రజల వినతులు, ఫిర్యాదులను స్వీక రించి బస్ సర్వీసులు అవసరమైన రూట్లను గుర్తించి అధికారులకు సమాచారం చేరవేస్తారు. అదేవి?ధంగా గ్రామాల్లో జరిగే వివాహాలు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్సుల్లో తీసుకువెళ్లేందుకు అవగాహన కల్పించి ఆర్టీసీ బస్సులను బుక్ చేస్తారు. ఇటు ప్రయాణీకులకు – అటు ఆర్టీసీ అధికారులకు అనుసంధానకర్తగా పనిచేస్తారు. గతంలో బస్సులకు సంబంధించిన సమస్యలు ఉన్నా, కొత్త సర్వీసు కావాలన్నా, అద్దెకు బస్సులను తీసుకోవాలన్నా గ్రామీణ ప్రజలు డిపో మేనేజర్లను సంప్రదించాల్సి వచ్చేది. ఒక్కోసారి డిపోకు వెళ్లలేక, ఫోన్ నంబర్లు అందుబా టులో లేక ప్రజలు ప్రైవేట్ బస్సు సర్వీసులను ఆశ్రయిం చేవారు. ఇపుడు బస్ ?అధికారు ల నియా మకంతో సమస్యలు తొలగి ప్రజ లకు ఆర్టీసీ మరింత చేరువవు తుందని అధికారులు భావిస్తున్నారు.

గ్రామీణ ప్రయాణికులకు టీ-9 టికెట్...

14 ఏళ్లు పైబడిన బాలికల నుంచి మహిళలతో పాటు వయో వృద్ధుల (ఆడ, మగ)కు రా యితీపై టీ-9 టికెట్‌ల ను అమ ల్లోకి తీసుకువచ్చా రు. వీరు 60 కిలోమీటర్ల దూరం వరకు పల్లె వెలుగు బస్సుల్లో ప్ర యాణించేందుకు రాయితీని కల్పిం చారు. మహిళలు, వయో వృద్ధులు రూ.100లతో టీ -9 టికెట్ కొనుగోలు చేస్తే పల్లె వెలుగు బస్సుల్లో 60 కిలో మీటర్ల దూరం వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రాను, పోను ప్రయాణించవచ్చు. ఈ టికెట్ ద్వారా ఒక్కొ క్కరికి రూ.20ల నుంచి రూ.40ల వరకు ఆదా అవుతుం ది. 60 ఏళ్లు నిండిన వారు తమ ఆధార్ కార్డును కండక్ట ర్‌కు చూపించి టీ-9 టికెట్ పొందవచ్చు. ఈ టికెట్లను ఆర్టీసీ బస్ కండక్టర్ల ద్వారా లేదా ఆయా బస్సు డిపోల్లో కూడా విక్రయిస్తారు.

జిల్లాలో ఇలా...

జిల్లా కేంద్రం నుంచి హనుమకొండ, సూర్యాపేట, సిద్ధిపేట, ఉప్పల్, జగద్గిరి గుట్ట తదితర ప్రాంతాలకు సుమారు 60 పల్లె వెలుగు బస్సులు నడుస్తున్నాయి. అలాగే హనుమకొండ, వరంగల్, తదితర డిపోల నుంచి కూ డా వివిధ పట్ట ణ, పల్లె ప్రాంతాల కు పల్లెవెలుగు బస్సులు నడు స్తున్నాయి. సా?ధా రణంగా ఈ బస్సు ల్లో 60 కిలో మీట ర్ల దూరం వరకు రూ.120ల నుంచి రూ. 140ల వరకు చార్జీలు ఉ ంటా యి. టీ-9 టికెట్ తీసుకుంటే రూ.20ల నుంచి రూ.40ల వరకు ఆదా అవుతుంది.

ప్రజలు వినియోగించుకోవాలి..: వి.జ్యోత్స్న, డీఎం, జనగామ

ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు గ్రామాల్లో బస్ ఆఫీసర్లను నియమిం చాం. రాయితీపై టీ-9 టికెట్లను అమల్లోకి తీసుకొచ్చాం. జిల్లాలో 10 మంది బస్ ఆఫీసర్లను నియమించాం. వీరు గ్రామాల్లో గ్రామీణ ప్రజలకు ఆర్టీసీ అందించే సేవలను వివరి స్తారు. రాయితీపై బస్సు పాసులు, సీజనల్ టికెట్స్‌తో పాటు వివాహాది శుభకార్యాలకు, విజ్ఞాన విహార యాత్ర లకు బస్సులను బుక్ చేస్తారు. ప్రజలకు – ఆర్టీసీకి అనుసంధానంగా పని చేస్తారు. అలాగే టీ-9 టికెట్ సేవలు ఈనెల 18 నుంచి అమల్లోకి వచ్చాయి. ప్రజలు, మహిళలు, వృద్ధులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి.

# రసాయన ఎరువుల వైపే రైతుల చూపు

మంచిర్యాల : రైతులను అప్పుల ఊబిలోకి లాగుతున్న వాటిలో రసాయనిక ఎరువులు ప్రధానమైనవి. ఈ పరిస్థితి గమనించి వ్యవసాయాధికారులు సేంద్రియ సాగు ద్వారా మేలు చేకూరుతుందని చెబుతున్నారు. వ్యవసాయాధికారుల ప్రచారానికి ఎక్కడోకొంతమంది రైతుల్లో మాత్రమే మార్పు కనబడుతోంది. కానీ ఆశించిన స్థాయిలో రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపటడం లేదని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అవగాహణ కరువు..ప్రస్తుత వానాకాలం సీజన్ రైతులు సాగు మొదలెడు తున్నారు. పత్తి, కంది, సోయ పంటలను సాగుచేస్తున్నారు. వీటి సాగులో సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టి సారించటంలేదు. మండలం లోని అన్ని గ్రామాల్లో ఇంకా రసాయనిక ఎరువులతో సాగుచేసే రైతుల సంఖ్య ఎక్కువగా ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రసాయానిక ఎరువులతో పంటలు సాగు చేయటంతో పెట్టుబడులు పెరిగి ఆశించిన దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారు. దీని నుంచి బయట పడేందుకు సేంద్రియ ఎరువులు వినయోగం ఒక్కటే మార్గం. కాని సేంద్రీయ ఎరువుల తయారీ విధానం, వినియోగం వల్లే కలిగే ప్రయోజనాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహణ రాలేదు.

రసాయన ఎరువులతో నష్టం..

రసాయనికి ఎరువుల వాడకంతో చేనుల్లో భూసారం తగ్గిపోతోంది. పంట సరైన దిగుబడి రాదు. ముఖ్యంగా రైతుకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయి. భూమి తన సాంద్రతను కొల్పోతుంది. క్రిమికీటకాల సంహారానికి వినియో గించే మందులతో పర్యావరణానికి హాని కలుగుతుంది. రసాయన ఎరువులు వాడిన మొక్కలను పశువులు తింటే అనారోగ్యానికి గురవుతున్నాయి. రసాయానిక ఎరువులతో పండిన పంటలు ప్రజలు తిని అనారోగ్యాల బారిన పడుతున్న సంఘటనలు అనేకంగాఉన్నాయి.

సేంద్రియంతో మేలు..సేంద్రియ ఎరువుల వాడకంతో పంటలకు చీడ, పీడల బెడద తగ్గుతుంది. మంచి దిగుబడులు సాధించవచ్చు. తక్కువ ఖర్చులతో ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉంది. పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. భూమి సత్తువ పెరుగుతుంది. పర్యావరణానికి ఎలాంటి హాని కలుగదు. సేంద్రియ ఎరువులు ఆరుతడి పంటలకు, కూరగాయాలకు ఎంతో ఉపయోగపడుతాయి.

# ‘స్టాండింగ్’లేని పాలన!

మహబూబాబాద్ : గ్రామాల సమగ్రాభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు గ్రామ పంచా యతీ పాలక మండలికి అనుబంధంగా ఏర్పాటు చేసిన స్థాయీ సంఘాలు(స్టాండింగ్ కమిటీలు) జాడలేకుండా పోయాయి. 2014లో రాష్ట్ర ఆవిర్భావం తొలినాళ్లలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన అందించేందు కు ప్రజల సమస్యలను నేరుగా గ్రామపంచాయతీ పాలక మండలికి తెలిపేందుకు అట్టహాసంగా నియమించారు. గ్రామంలోని క్షేత్రస్థాయిలో సమస్యలు, లోపాలను ఎప్పటికప్పుడు ప్రజల తరపున పాలకమండలి దృష్టికి తీసుకువెళ్లినప్పుడే గ్రామపరిపాలన మెరుగైనస్థాయిలో కొనసాగుతుంది. ఇందుకోసం గ్రామపంచాయతీలకు స్థా యీ సంఘాలను నూతన పంచాయతీరాజ్ చట్టం%--% 2018లోని 49(1) నిబంధన ప్రకారం ఏర్పాటు చేశారు. ఈ నిబంధన ప్రకారం ప్రతీ గ్రామపంచాయతీకి స్టాండింగ్ కమిటీని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

పాలకమండలికి అనుబంధంగా...

గ్రామపంచాయతీ పాలకమండలికి అనుబంధంగా ఏర్పాటు చేసిన స్థాయీ సంఘాలు ప్రముఖులు, గతంలో పంచాయతీ పాలనలో పనిచేసిన అనుభవం ఉన్నవారు, కో%--%ఆప్షన్ సభ్యులతో కూడి ఉంటుంది. పారిశుధ్యం, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక కోసం స్టాండింగ్ కమిటీ, వీధిదీపాల నిర్వహణ కోసం ఒక కమిటీ, మొక్కల పెంపకం, పచ్చదనం నిర్వహణ కోసం ఒక కమిటీ, పనుల నిర్వహణ కోసం ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఇలా ప్రతీ గ్రామపంచాయతీకి నాలుగు చొప్పున మహ బూబాబాద్ జిల్లాలోని 461 గ్రామ పంచాయతీలు, 1,844 స్టాండింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతీ కమిటీలో సర్పంచ్, పంచా యతీ కార్యదర్శితోపాటు 15 నుంచి 30 మంది వరకు గ్రామపంచాయతీ జనాభాను బట్టి సభ్యులు ఉ ంటా రు. ఇందులో సగం మహిళలకు కేటాయించారు. ఇలా జిల్లావ్యాప్తంగా గ్రామపంచాయతీ ల్లో సుమారు 15వేల మంది స్థాయీ సంఘాల్లో సభ్యులున్నారు.

స్టాడింగ్ కమిటీ చేయాల్సిన పనులు..గ్రామపంచాయతీ పాలకమం డలికి అనుబంధంగా స్థాయీ సంఘాల పనితీరు ఉంటుంది. ఒక్కో కమిటీ ఒక్కో పనికి ఉద్దేశించింది. పారిశుధ్యం, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక నిర్వహణలో సలహాలు, సూచనలను పాలకమండలికి ఇవ్వాల్సి ఉంటుంది. శ్మశాన వాటిక మౌలిక సదుపాయాల్లో ఇబ్బందులు ఏర్పడితే, మురికికాల్వలు, చెత్తాచెదారం పేరుకుపోతే వెంటనే గ్రామపంచాయతీ పాలకులకు సమాచారం అందించి సమ స్యను పరిష్కరించేందుకు సహకరించాలి. స్థాయీ సంఘాల సభ్యులు తమ బజా రులోని వీధిదీపాలను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు విద్యుత్ పొదుపు చర్యలకు సహకరించాలి. ఎక్కడైనా వీధి దీపాలు వెలగకపోతే గ్రామపం చాయతీకి సమాచారం అందివ్వాలి. నర్సరీల నిర్వహణకు సూచనలి వ్వాలి. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, పచ్చదనం పెంపొందించడం ప్లాంటేషన్ కమిటీ బాధ్యత. ప్రజాపనులు, అంగడికి సంబంధించిన పర్యవేక్షణ, సూచనలు చేయడం పనుల కమిటీకి సంబంధించిన అంశం.

తూతూ మంత్రంగా స్థాయీ సంఘాలు..

స్థాయీ సంఘాలకు పంచాయతీ రాజ్ చట్టంలో ప్రాధాన్యతనిస్తూ నియమనిబందనలను రూపొం దించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఈ సంఘాలకు అంతగా ప్రాధాన్యతనివ్వడంలేదని విమర్శలు వస్తున్నాయి. స్థాయీ సంఘాల్లోని సభ్యులు స్వచ్ఛందంగా పనిచేయాలి. ఎలాంటి గౌరవ వేతనం ఉండదు. ఉప సర్పంచ్ ఎన్నికల్లోను ఎలాంటి ఓటు హక్కు వీరికి ఉండదు. అయినప్పటికీ గ్రామాభివృద్ధికి వీరి సలహా లు, సూచనలే కీలకం. అయితే కనీసం వారిని పాలకవర్గాలు గ్రామసభలకు కూడా ఆహ్వా నించడంలేదని పలు గ్రామాల నుంచి పలువురు చెబుతున్నారు. చాలా మంది కమిటీ సభ్యులకు తమ విధులు ఏమిటో కూడా తెలియదనే విమర్శలు వస్తున్నాయి. ఏదో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కమిటీలను తూతూ మంత్రంగా వేసి కాగితాల్లో కమిటీల పేర్లను ఉన్నతాధికారులకు పంపి చేతులు దులుపుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మరో వైపు చాలా గ్రామాల్లో గ్రామపంచాయతీ పాలకులు, జిల్లా అధికారులు కూడా స్థాయీ సంఘాలనేవి ఉన్నాయనే విషయాన్ని మర్చినట్లు ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికైనా స్థాయీ సంఘాల తో ప్రతీనెల సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి వాటి పనితీరును మెరుగుపరిస్తే గ్రామాల్లో సౌకర్యాలు మరింత మెరుగుపడుతాయని పలువురు కోరుతున్నారు.

స్థాయీ సంఘాలను విస్మరించారు..

%--% తుంపిళ్ల వెంకన్న, వార్డు సభ్యుడు, కేసముద్రం విలేజి

గ్రామపంచాయతీలకు అనుబం ధంగా ఏర్పాటు చేసిన స్థాయీ సంఘాలను పాలకులు ఎప్పుడో విస్మరించారు. అసలు ఈ సంఘాలు న్నట్లు కూడా పాలకులకు, అధికారు లకు గుర్తులేదు. స్థాయీ సంఘాల తో నెలకోసారి సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి.

స్థాయీ సంఘాలకు ప్రాధాన్యమివ్వాలి

%--% చిట్యాల వీరన్న , కేసముద్రం స్టేషన్

గ్రామపంచాయతీ పాలకమండలికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే స్థాయీ సంఘాలకు ప్రాధాన్యతనివ్వాలి. క్షేత్రస్థాయిలోని సమస్యలు స్థాయీ సంఘాలకు తెలుస్తాయి. వీటి పరిష్కారానికి సంఘాల ప్రతినిధులు సలహాలు, సూచనలిస్తారు. ఈ సంఘాలకు ప్రాధాన్యతనిస్తే గ్రామ అభివృద్ధి మెరుగ్గా ఉంటుంది.

కమిటీలతో సమీక్షలు నిర్వహించాలి%--% ఇట్టె మహేందర్‌రెడ్డి , తొర్రూరు మండలం పత్తేపురంగ్రామాల్లోని స్టాండింగ్ కమిటీతో నెలకోసారి సమీక్షా సమావేశాలు నిర్వహించాలి. గ్రామాల్లోని పారిశు ధ్యం, తాగునీరు, శ్మశాన వాటిక, మొక్కల పెంపకం తదితర అంశాలపై క్షేత్రస్థాయి సమస్యలు ఈ కమిటీలకు అవగాహన ఉంటుంది. ఈ కమిటీలతో గ్రామపాలకమండలి సమన్వయం చేసుకొని పనిచేయాలి.

# ఆలయాలకు మహర్దశ




వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరికొన్ని దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుబోతున్నాయి. ఇన్నాళ్లు కనీసం ఆదాయం లేక ఇక్కట్లు పడుతున్న ఈ ఆలయాల అర్చకులకు ఆర్థిక అండ లభించనున్నది. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవం రోజున కొత్తగా నియమితులైన డీడీఎన్ అర్చకులకు దేవాదాయశాఖ అధికారులు నియామకపత్రాలను అందచేశారు. హనుమకొండలోని వేయిస్తంభాల గుడి ఆవరణలో జరిగిన ఉత్సవంలో నియామక ధృవపత్రాలను ప్రదానం చేసింది తెలిసిందే. మిగతావారికి ఆయా జిల్లా కేంద్రాల్లో అందచేశారు. అయితే ఉమ్మడి జిల్లాలో ఆలనాపాలనా లేక పూర్తిగా జీర్ణావస్థకు చేరిన మరో 50కి పైగా దేవాలయాలు ఉన్నాయి. వాటిని కూడా గుర్తించి ధూప, దీప నైవేద్యం పథకం కిందకు తీసుకురావలసిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ధూప, దీప నైవేద్యం (డీడీఎన్) పథకం కింద కొత్తగా మరో 168 గ్రామీణ దేవాలయాలు ఎంపికయ్యాయి. జనగామ జిల్లాలో 42, హనుమకొండ జిల్లాలో 30, వరంగల్ జిల్లాలో 20 మహబూబాబాద్ జిల్లాలో 30, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 33, ములుగు జిల్లాలో 13 ఆలయాలను ఎంపిక చేశారు. గతంలో మొదటి విడత కింద 421 దేవాలయాలు ఈ పథకం కిందకు వచ్చాయి. దీనితో డీడీఎన్ కింద ఎంపికైన మొత్తం గుళ్ల సంఖ్య 589కి చేరింది. రెండో విడత డీడీఎన్ చేర్చిన గుళ్లను కలుపుకొంటే జనగామ జిల్లాలో మొత్తం 147, హనుమకొండ జిల్లాలో 99, వరంగల్ జిల్లాలో 107, మహబూబాబాద్ జిల్లాలో 106, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 92, ములుగు జిల్లాలో 38 ఈ పథకం కిందకు వచ్చినట్లయింది.

అర్చకులకు ఆసరా..

పురాతన కాలం నుంచి, ఆ తర్వాత వెలిసిన ఆలయాల్లో నిత్యం ఆ దేవుడికి ధూప దీప నైవేద్యాలను సమర్పించేందుకుగాను అర్చకులు ఇబ్బందులు పడడం గుర్తించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ధూప, దీప నైవేద్య పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టారు. అప్పుడు ధూప, దీప నైవేద్యం కోసం రూ.1000. అర్చకుడికి వేతనంగా రూ.1500 మొత్తం రూ.2500 ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ 6వేలకు పెంచి అమలు చేస్తోంది. ఈ మొత్తంలో ధూప, దీప నైవేద్యానికి రూ 2వేలు, అర్చకుడికి రూ 4వేలు వేతనం ఇస్తున్నారు.

రూ.10వేలకు పెంపు

ఇటీవల హైదరాబాద్‌లో బ్రాహ్మణ భవన్ ప్రారంభోత్సవం సందర్భంగా డీడీఎన్ కింద ఇస్తున్న మొత్తాన్ని రూ.10వేలకు పెంచుతున్నట్టు సీఎం ప్రకటించారు. ఈ పథకాన్ని మరికొన్ని దేవాలయాలకు కూడా వర్తింపచేస్తామని సీఎం చేసిన ప్రకటన మేరకు ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఈ 168 దేవాలయాలను గుర్తించారు. భృతిని పొందే అర్హత వయసు 75 ఏళ్ల వయసు పరిమితిని 65 ఏళ్లకు తగ్గిస్తున్నట్టు తెలిపారు. డీడీఎన్ పథకం కింద దేవాలయాల ఎరికకు చాలా దరఖాస్తులు వచ్చాయి. అయితే రిజిస్ట్రేషన్ లేని ఆలయాలు, భూములు కలిగిన గుళ్లను ఈ పథకం కింద ఎంపిక చేయలేదు.

పారదర్శకంగా ఎంపిక

దేవాలయాల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. దరఖాస్తు కోసం ఒక ఫార్మాట్‌ను రూపొందించింది. అందులో దేవాలయం పేరు, చిరునామా, సెక్షన్ 6, 43, దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30/87 కింద వివరాలు, ఆలయానికి ఉన్న ఆస్తులు, ఆదాయం, అర్చకుడి వివరాలు అర్చకుడు ఏ ఆగమం ప్రకారం చేస్తున్నది.. ఆలయ చరిత్ర, మండల కేంద్రం నుంచి గుడి వరకు దూరం.. తదితర సమాచారాన్ని అందులో ఆడిగారు. ఈ ఫారాన్ని పూర్తి చేసి సమర్పించిన తర్వాత క్షేత్ర స్థాయి విచారణ అనంతరం ఆలయాలను ఎంపిక చేశారు.

చెల్లింపులో జాప్యం

ధూప, దీప నైవేద్యం కింద అర్చకులకు గౌరవ భృతిని చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఈ పథకం కింద ఇచ్చే డబ్బులను ఏ నెలకానెల విడుదల చేయకపోవడంతో అర్చకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు ఇచ్చే గౌరవ వేతనమే కాకుండా ధూప, దీప వైద్యాలను సమర్పించేందుకు అప్పులు చేసి నూనె, తదితర పూజా సామగ్రిని కొనుగోలు చేయాల్సి వస్తోందని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతన కాలం నుంచి ఆ తర్వాత వెలిసిన ఆలయాల్లో నిత్యం ఆ దేవుడికి ధూప, దీప నైవేద్యాలను సమర్పించేందుకుగాను అర్చకులు డబ్బుల కోసం కటకటపడాల్సి వస్తోంది. రెండేళ్ల కిందటి వరకు ప్రతి నెలా అర్చకుల ఖాతాలో డబ్బులను జమ చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు రెండు మూడు మాసాలకోసారి ఇస్తోంది. చివరగా గత ఏడాది సెప్టెంబర్ నెల వరకు మాత్రమే డబ్బులను ప్రభుత్వం అర్చకుల ఖాతాలో వేసింది. ప్రభుత్వం ఆ తర్వాత నుంచి డబ్బులు వేయడం లేదు. ఇటీవలే కొంత మేరకు జమ అయినట్టు తెలిసింది.

ఎంపిక కావడం ఆనందంగా ఉంది..

కలకుంట్ల సత్యనారాయణాచార్యులు, బొల్లోనిపల్లి గ్రామం, బీమదేవరపల్లి మండలం (హనుమకొండ జిల్లా)

ధూప, దీప నైవేద్యం పథకం కింద అర్చకుడిగా ఎంపికయ్యాను. గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. ఈ పథకం కింద ఎంపికైనందుకు ఆనందంగా ఉంది. ఈ పథకం మంజూరు వల్ల గ్రామంలో ఆలనాపాలనా లేని మా సీతారామ చంద్రస్వామి దేవాలయానికి కొత్తకల వచ్చినట్లయింది. డీడీఎన్ కింద ఎంపిక చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, దేవాదాయ కమిషనర్ కు అర్చక సమాఖ్య నాయకుడు గంగు ఉపేంద్రశర్మకు ధన్యవాదాలు. ఈ పథకం కింద ఇచ్చే భృతి నా కుటుంబ పోషణకు ఎందో ఆసరాగా ఉంటుంది.

# "పోడు"కు పట్టాలు...

మంచిర్యాల : పోడు భూముల సమస్యలు పరిష్క రించి, అర్హులకు పట్టాలు అందజేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీ ఎట్టకేలకు నెరవేరబో తోంది. పట్టాల కోసం ఆదివాసీలు ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తున్నారు. అటవీ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి హక్కు పత్రాలు అందజేయడం ద్వారా శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అర్హులైన గిరిజనులు, ఆదివాసీలకు హక్కు పత్రాలు జారీ చేసేందుకు పంచాయతీ, రెవెన్యూ, అటవీ, ఐటీడీఏ అధికారుల సమన్వయంతో అవసరమైన మార్గదర్శకాలు రూపొందిం చారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో అటవీ హక్కుల కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అనంతరం అర్హులను గుర్తించి హక్కులు కల్పించనున్నట్లు అధికారులు ప్రకటించారు. దశాబ్దాలుగా నెలకొన్న సమస్యకు పరిష్కారం లభిస్తుండటంతో ఆదివాసీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్వోఎఫ్ఆర్ ప్రాతిపదికన

అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్వోఎఫ్ఆర్) ప్రాతిపదికన అర్హులైన వారికి పోడు భూములకు హక్కు పత్రాలు జారీ చేయాలని నిర్ణయిం చారు. 29 డిసెంబరు 2006 నుంచి ఆర్వోఎఫ్ఆర్ చట్టం అమల్లోకి రాగా 1930 నుంచి సాగు చేస్తున్న గిరిజనేతరులు, 2005కు ముందు నుంచి సాగులో ఉన్న గిరిజనులకు హక్కు పత్రాలు పొందే వెసలుబాటు ఉంది. ఈ చట్టం ప్రకారం గతంలో ఉమ్మడి జిల్లాలో పలువురు అర్హుల కు పట్టాలు అందజేశారు. ఆ తరువాత దశల వారీగా పోడు భూములకు హక్కు పత్రాల కోసం ఆందోళనలు జరుగుతున్నప్పటికీ సరైన ఆధారాలు లేక ప్రభుత్వం పట్టాల జారీ ప్రక్రియకు పూనుకోలేదు. పోడు సమస్యను పరిష్కరించి 2005 నాటికి సాగులో ఉన్నవారిని గుర్తించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పోడు భూములు పెద్ద మొత్తంలో గిరిజనేతరులు, బడా నాయకుల చేతుల్లో ఉండటం, తప్పుడు పత్రాలతో రెవెన్యూ రికార్డుల్లో నమోదు కావడంతో



అర్హులను గుర్తించేం దుకు అధికారులు సర్వేలు జరిపారు. జిల్లాలోని 14 మండలా ల్లోని 93 గ్రామాల్లో మొత్తం 33,418.19 ఎకరాల పోడు భూములున్నాయి. వీటిలో గిరిజనులకు చెందినవి 13,587.37 ఎకరాలు కాగా మిగతా 19,830.22 ఎకరాల్లో గిరిజనేతరులు సాగు చేసుకుంటున్నారు. పోడు భూముల్లో సాగులో ఉ న్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. గతేడాది నవంబరు 8న దరఖాస్తు ప్రారంభం కాగా అదే నెల 20న ముగిసింది. గడువు ముగిసే సమయానికి జిల్లా వ్యాప్తంగా మొత్తం 11,774 దరఖాస్తులు రాగా, దరఖాస్తుదారుల్లో 4460 మంది గిరిజనులు, 7314 మంది గిరిజనేతరులు ఉన్నారు.

జాబితాల్లో కానరాని గ్రామాలు

పోడు రైతులను గుర్తించేందుకు అటవీ, రెవెన్యూ అధికారులు తయారు చేసిన జాబితాల్లో కొన్ని గ్రామాలు లేకపోవడంపై ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2021 నవంబరు, డిసెంబరులో సర్వే జరిపిన అధికారులు పోడు గ్రామాలను గుర్తించి, జాబితాలు తయారు చేశారు. మరికొన్ని చోట్ల ఆర్వోఎఫ్ఆర్ కమిటీలు కూడా వేయలేదని పోడు రైతులు ఆరోపిస్తున్నారు. ఆర్వోఎఫ్ఆర్ కమిటీలు వేస్తే భూములు ఇవ్వాల్సి ఉంటుందనే ఉద్దేశ్యంతో కావాలనే తప్పించినట్లు ఆరోపణలున్నాయి. జిల్లా వ్యాప్తంగా పోడు సాగులో ఉన్న 30 నుంచి 40 గ్రామాలను గుర్తించకపోవడమే దీనికి నిదర్శనం. నెన్నెల మండలం చిన్న వెంకటాపూర్, పొట్యాల, కుశ్నపల్లి, వేమనపల్లి మండలం భుయ్యారం, జిల్లెడ, చెన్నూరు మండలం సంకారం, బుద్దారం, లింగంపల్లి, అక్కెపల్లి గ్రామాల్లో పోడు వ్యవసాయం ఉన్నప్పటికీ వాటిని ఎంపిక చేయలేదు. లింగంపల్లిలో 2008 సర్వేలో ఆర్వోఎఫ్ఆర్ కమిటీ ఉంది. గ్రామస్థులు సాగులో ఉన్నారని ఆర్వోఎఫ్ఆర్ కమిటీతోపాటు అటవీ, రెవెన్యూ అధికారులు తీర్మానం అయినా ఆ గ్రామం పేరు ప్రస్తుత జాబితాలో లేకపోవడం గమనార్హం. తమ గ్రామాన్ని పోడు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ గ్రామానికి చెందిన ఆదివాసీలు అక్టోబర్ 21న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.

అటవీ చట్టానికి తూటు

అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనేతర కుటుంబాలకు పదెకరాల వరకే అనుమతులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. గిరిజనేతరులు మూడు తరాలు (కనీసం 75 ఏళ్లు) సాగులో ఉంటేనే పత్రాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సదరు కుటుంబాలు 2005కు ముందు ఎన్ని ఎకరాలు సాగులో ఉన్నా వారు ఇక మీదట పదెకరాలు మాత్రమే వినియోగించుకోవాలనే నిబంధన విధించింది. అంతకంటే ఎక్కువ సంఖ్యలో ఉన్న వారి వద్ద మిగిలిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుంది. ప్రస్తుత సర్వేలో కేవలం ఒకే చోట సర్వే జరుపుతూ మూడెకరాలకు పరిమితం చేస్తున్నారని ఆదివాసీలు వాపోతున్నారు.

జిల్లాలో 1847 మంది ఎంపిక

పోడు పట్టాలు జారీ చేసేందుకు అర్హులైన లబ్ధిదారుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. మొత్తం 11,777 దరఖాస్తుదారుల్లో ఫేజ్-1 కింద 1847 మందిని అర్హులుగా గుర్తించారు. ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు మొత్తం 3821 ఎకరాల భూమిని గుర్తించారు. అయితే ప్రస్తుతం ఎంపిక చేసిన వారి సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 30న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించ నున్నందున అదే రోజు పోడు పట్టాల పంపిణీని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సీఎం ప్రారంభించిన రోజే మిగతా ప్రాంతాల్లో లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# మాతా శిశు మరణాల నియంత్రణపై దృష్టి సారించాలి

ఆసిఫాబాద్ : జిల్లాలో మాతాశిశు మరణాల నియంత్రణపై వైద్యాధి కారులు ప్రత్యేకదృష్టి సారించాలని అదనపుకలెక్టర్ చాహత్‌బాజ్ పాయి అన్నారు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధి కారులతో మాతాశిశు మరణాల నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు మరణాల నియంత్రణపై అధికారులు ప్రత్యేకదృష్టి సారించా లని తెలిపారు. మారుమూల గ్రామాల్లో వర్షాకాలం కారణంగా రాకపోక లకు ఇబ్బంది ఎదురయ్యే నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఉండే గర్భిణుల కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. హైరిస్క్ ఉన్న గర్భిణులను ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలంలో రోడ్లు తెగిపోయి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడి బాహ్యప్రపంచానికి దూరంగా ఉండే గ్రామాలకు సంబంధించి ప్రతినెల 3వశనివారం మండలపరిషత్ అభివృద్ధి అధికారులతో జరిగే సమావేశా నికి సర్పంచ్‌లు, ఎంపీపీలు హాజరవుతా రని, గ్రామాల్లో వివరాలను సేక రించి అవసరమైన చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదేశించారు. మాతాశిశు మరణాలు సంభవిం చకుండా క్రమంతప్పకుండా గర్భిణు లకు అవసరమైన పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం లో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

జిల్లాలో సికిల్‌సెల్ నిర్మూలనకు సంబంధిత అధికారుల సమన్వయం తో ప్రత్యేకచర్యలు తీసుకుంటామని అదనపుకలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, వైద్యాధికారులతో సికిల్‌సెల్ నిర్మూలనపై సమీక్ష సమా వేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధలోని ఆశ్రమ, గురుకుల, గిరిజన, ప్రాథమిక పాఠశాలల్లో బాలికలకు సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలికల పేర్లు, ఆధార్ నంబర్లు వివరాలను సేకరించి ఈనెల 27వతేదీ నుంచి ప్రారం భమయ్యే సికిల్ సెల్ నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు.

# నిధులున్నా పూర్తికాని హల్దీవాగు సుందరీకరణ

సంగారెడ్డి : జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం వద్ద హల్దీ వాగు సుందరీకరణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడంలేదు. అధికారుల లోపమా? ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమా? తెలియడంలేదు. సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవ డంపై ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెలువెత్తుతున్నాయి. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని వర్గల్ మండలంలో నాచగిరి క్షేత్రం ఉంది. ఈ క్షేత్రాన్ని రెండో యాదాద్రిగా పిలుస్తారు. హైదరాబాద్ నగరానికి దగ్గరగా ఉండడంతో ఈ క్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు జంటనగరాల నుంచి వస్తుంటారు. ప్రస్తుతం ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటు కాకపోవడంతో సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల నిర్వాహణలో కొనసాగుతుంది.



రూ.7.48 కోట్లు విడుదల చేసిన సీఎం

2018 జనవరి 17న సీఎం కేసీఆర్ ఫాంహౌస్ పట్టణంలో నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం రోడ్డు మార్గంలో గజ్వేల్‌కు వెళ్తూ నాచగిరి క్షేత్రం వద్ద కొద్దిసేపు ఆగారు. ఆలయ పరిసరాలను తిలకించారు. హల్దీ వాగు (హరిద్ర నది)లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని, ప్రశాంతతను పంచే విధంగా సుందరీకరణ పనులు చేపట్టాలని, ఏడాది పొడవునా వాగులో నీరుండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అప్పటికప్పుడు రూ.7.48 కోట్ల నిధులు కూడా మంజూరు చేశారు. నిధులు మంజూరై ఐదు సంవత్సరాలు దాటిన హల్దీవాగు సుందరీకరణ పనులు మాత్రం పూర్తి కాలేదు. హల్దీవాగులో స్నానపు ఘాట్ల ఏర్పాటు, నిరంతరం ప్రవహించే వాగును 600 మీటర్ల వెడల్పుతో విస్తరణ, రాళ్లు, చెట్ల పొదల తొలగింపు తదితర పనులు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ ఆ పనుల జోలికే వెళ్లలేదు. వాగు మధ్యలో చెక్ డ్యాంను మాత్రం నిర్మించి వదిలేశారు. వాగు సుందరీకరణలో 40 శాతం పనులు కూడా ఇప్పటి వరకు పూర్తి కాలేదు.

# తగ్గేదేలే..!

వరంగల్ : ఎన్నికలు దగ్గర పడుతున్నాయి.. రాజకీయాలు ఊపందుకున్నాయి. పార్టీలు ఢీ అంటే ఢీ అంటున్నాయి. వ్యూహప్రతివ్యూహాలకు పదును పెడుతున్నాయి. నేతలు ఇప్పటి నుంచే తమదైన శైలిలో ప్రచారానికి తెర తీశారు. ఆయా నియోజకర్గాల్లో ముద్ర వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకరిపై ఒకరు మాటల తూటాలు పేల్చుతున్నారు. ప్రజలకు దగ్గర కావడానికి పోటీ పడుతున్నారు. ఎన్నికలన్నప్పుడు రాజకీయ పార్టీల మ?ధ్య ఇది సహజమే. అయితే.. అది వేర్వేరు పార్టీల మ?ధ్య ఉండటం మామూలు విషయమే అయినప్పటికీ భూపాలపల్లి నియోజకవర్గంలో ఒకే పార్టీలో ఇద్దరు నేతల మధ్య చోటుచేసుకున్న 'పోటీ' సర్వత్రా ఆసక్తి రేపుతోంది.భూపాలపల్లి బీఆర్ఎస్‌లో ఇద్దరు నేతల మధ్య పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు మరో నాలుగైదు నెలల గడువే ఉండటంతో టికెట్ కోసం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిరికొండ మ?ధుసూదనాచారి మధ్య లాబీయింగ్ షురూ అయ్యింది. ఇటీవల భూపాలపల్లిలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభలో సిట్టింగ్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికే టికెట్ అని కేటీఆర్ పరోక్షంగా ప్రకటించారు. అయినప్పటికీ భూపాలపల్లి నుంచి మరోసారి పోటీకి మధుసూదనాచారి రెడీ అవుతున్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలు, ప్రభుత్వం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలకు దూరంగానే ఉన్న ఆయన.. శుభ, అశుభ కార్యక్రమాలకు తన అనుచరవర్గంతో కలిసి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. గులాబీ శ్రేణుల్లో ఇది చర్చనీయాంశమైంది.

మరోసారి పోటీ చేస్తానంటున్న చారి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సిరికొండ మధుసూదనాచారి 2014లో భూపాలపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తనకు ఉద్యమంలో కుడి భుజంగా వ్యవహరించిన ఆయన్ను తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్‌గా కేసీఆర్ ఎంపిక చేశారు. కేసీఆర్ తొలి ప్రభుత్వంలో మధుసూదనాచారికి అత్యంత గౌరవమైన పదవి దక్కిన క్రమంలోనే భూపాలపల్లి కేంద్రంగా ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేశారు. అభివృద్ధి పరంగా కేసీఆర్ చేయూతనందించారు. అయితే.. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మధుసూదనాచారి భూపాలపల్లి నుంచి తిరిగి పోటీ చేసి ఘోర పరాజయం పొందారు. ఆ ఎన్నికల్లో ఆయన మూడో స్థానానికి పరిమితం కావడంతో గులాబీ శ్రేణులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇదేక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన గండ్ర వెంకటరమణారెడ్డి 2019 ఫిబ్రవరిలో పది మంది ఆ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి భూపాలపల్లి నియోజకవర్గంపై సిట్టింగ్ ఎమ్మెల్యేగా గండ్ర వెంకటరమణారెడ్డిదే పైచేయిగా కొనసాగుతోంది. ఈ క్రమంలో కొద్ది కాలంపాటు మధుసూదనాచారి నియోజకవర్గ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే.. కేసీఆర్‌తో ఉన్న సత్సంబంధాల మూలంగా గవర్నర్ కోటాలో 2021 డిసెంబర్‌లో ఎమ్మెల్సీగా ఆయన అవకాశం లభించింది. ప్రస్తుతం ఆ పదవిలో కొనసాగుతున్న చారి భూపాలపల్లి నుంచి మరోసారి పోటీ చేసేందుకు ఉవిళ్లూరుతున్నారు.

**టికెట్‌పై ఇద్దరికీ ఆశ**భూపాలపల్లి నియోజకర్గం నుంచి మరోసారి సిట్టింగ్ ఎమ్మెల్యే గ ం్డ్ర వెంకటరమణారెడ్డినే అసెంబ్లీకి పంపాలని మంత్రి కేటీఆర్ బహిరంగ సభలో సిరికొండ మధుసూదనాచారి సమక్షంలోనే పేర్కొన్నారు. ఫిబ్రవరి 23న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన భారీ బహిరంగ సభలో సిరికొండ, గండ్ర వర్గీయులు పరస్పర నినాదాల మధ్య కేటీఆర్ మాట్లాడారు. సిట్టింగ్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని అసెంబ్లీకి పంపాలని, మధుసూదనాచారికి మరో ఐదేళ్లు ఎమ్మెల్సీగా కొనసాగే అవకాశం ఉందని అన్నారు. ఒకరు అసెంబ్లీలో, మరొకరు శాసన మండలిలో భూపాలపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని కేటీఆర్ స్పష్టంగా చెప్పారు. దీంతో గండ్ర వర్గీయుల్లో ఉత్సాహం ఉరకలేయగా సిరికొండ వర్గీయులంతా ఢీలా పడ్డారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే గండ్ర తన వర్గాన్ని మరింత పటిష్టం చేసుకుంటున్నారు. పార్టీ పరంగా ఏ కార్యక్రమం నిర్వహించినా ఎమ్మెల్యేతో కలిసి ఆయన సతీమణి గండ్ర జ్యోతి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలి హోదాలో పాల్గొంటున్నారు. కార్యకర్తల మధ్య ఏమైనా గ్యాప్ ఉంటే పూడ్చే పనిలో పడ్డారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇదే క్రమంలో సిరికొండ మళ్లీ తన పర్యటనలతో దూకుడు పెంచారు. తమ వర్గీయుల్లో మళ్లీ ఉత్సాహాన్ని నింపుతున్నారు. భూపాలపల్లిలో తాను ఎంతో అభివృద్ధి చేశానని గుర్తుచేస్తున్నారు. తనకు, తన అనుచరులకు సరైన గౌరవం దక్కడం లేదని ఆయన మనస్తాపంతో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇటీవల టీబీజీకేఎస్ కార్యాలయ భవనం ప్రారంభోత్సవంలో జరిగిన రగడపై సిరికొండ మనోవేదనకు గురైనట్టు సమాచారం. కార్యాలయంలో కనీసం తన ఫొటో కూడా లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేసినుట్ట ప్రచారం జరుగుతోంది. ఇదే క్రమంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పోటీకి ఆయన రెడీ అవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. అయితే.. ప్రభుత్వ కార్యక్రమాలకు సైతం సిరికొండ ఎమ్మెల్సీ హోదాలో కూడా హాజరు కావడం లేదు. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల్లోను మధుసూదనాచారి ఎక్కడ కూడా కనిపించలేదు. అంతేకాకుండా బీఆర్ఎస్ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో కూడా ఎక్కడా పాల్గొన లేదు. అయితే... పార్టీ నుంచి ఆహ్వానం లేకపోవడం వల్లే ఆయన పాల్గొనడం లేదని అనుచరులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ప్రైవేటు కార్యక్రమాల్లో మాత్రం సిరికొండ చురుగ్గా పాల్గొంటున్నారు. అధిష్ఠానం ఆశీస్సులు తనకే ఉన్నాయని, టికెట్ తనకే వస్తుందని ప్రజలకు, తన అనుచర వర్గానికి భరోసా ఇస్తున్నట్టు తెలుస్తోంది.

# మూడొంతులు మింగేశారు..



ఖమ్మం : మట్టి చదును చేసి మమ అనిపించేశారు. క్రీడా ప్రాంగణాలంటూ బోర్డులు పెట్టి బురిడీ కొట్టించారు. అనువు గాని స్థలాల్లో ఐరన పోల్స్ పాతి.. మైదానాల కోసం స్థలాలను చదును చేసి రూ.కోట్లు కొట్టేశారు. తామేం చేసినా అడిగేవారు లేరనుకు న్నారేమో.. ఎంత నొక్కేసినా లెక్కలు అడగరనుకున్నారేమో.. అనువుకాక పోయినా అందినకాడికి దోచేయొచ్చనుకున్నారేమో.. నిబంధనలతో పనిలేకుండా ఇష్టారీతిన పనులు చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని పక్కదారి పట్టించేశారు. ఇదంతా జరిగింది ఊరుచివర కనిపించే క్రీడా ప్రాంగణాల్లో. క్రీడలపై ఆసక్తి ఉన్నవారి సౌలభ్యం కోసం పల్లె ప్రగతి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రగతి ద్వారా మునిసిపల్ పట్టణాల్లో డివిజన్లలోని ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఈ క్రమంలో ఒక్కో ప్రాంగణానికి గాను కాంట్రాక్టర్లు రూ.లక్షల్లో నిధులిచ్చింది. ఆ సొమ్ములతో స్థలాలను చదునుచేసి.. ఓ బోర్డు, రెండు, నాలుగు ఐరన పోల్స్ పాతి మమ అనిపించారు. దీంతో అవి ప్రస్తుతం పనికిరాని ప్రాంగణా లుగా మిగిలిపోయాయి. అయితే ఈ ప్రాంగణాల ఏర్పాటుకు చేయాల్సిన ఖర్చులో మూడొం తులు మింగేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనువుగాని స్థలాల్లో ఏర్పాటు

క్రీడా ప్రాంగణాల ఏర్పాటు బాధ్యతలను రెవెన్యూ, డీఆర్‌డీవోలకు అప్పగించారు. పెద్ద గ్రామ పంచాయతీల్లో ఎకరం, చిన్నగ్రామ పంచా యతీల్లో అర ఎకరం తగ్గకుండా ఉండేలా మైదానాన్ని ఏర్పాటు చేసి వాటిల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, లాంగ్ జంప్ కోసం కోర్టులను నిర్మించాలని నిర్ణయించారు. అందుకుగాను ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.4.16లక్షల నుంచి రూ. 5లక్షల వరకు వెచ్చించేలా ఉత్తర్వులిచ్చారు. ఆ నిధులతో స్థలాలను చదును చేయడం, అవసరమైన చోట మట్టితో నింపడం, చుట్టుపక్కల మొక్కలు నాటడం లాంటి కార్యక్రమాలు చేయాలి. అయితే చాలా చోట్ల క్రీడా ప్రాంగణాలకు అనువుగాని స్థలాలను అప్పగించారన్న ఆరోపణలు ఉండగా.. అధికారులు కూడా ఏదో ఒక స్థలం సేకరించి అప్పగిస్తే తమ పని అయిపోతుందన్న రీతిలో వ్యవహరించారన్న విమర్శలున్నాయి. చెరువు శిఖం భూములు, రాళ్లు, రప్పలతో కనీసం నడవడానికి కూడా సరైన దారి లేని స్థలాలను అప్పగించారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రాంగణాల్లో తూతూమంత్రంగా ఏర్పాటు చేసినవే అధికంగా కనిపిస్తున్నాయి. ఓ స్థలాన్ని చదును చేసి.. తెలంగాణ క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డు పెట్టి అందులో రెండు, నాలుగు ఐరన పోల్స్ పాతారని ఇదంతా చేసినందుకు రూ.లక్ష కూడా ఖర్చుచేయలేదని.. మిగిలిన వాటిని కాజేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఖమ్మం జిల్లాలో ఇదీ పరిస్థితి

అధికారిక లెక్కల ప్రకారం ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 754క్రీడా ప్రాంగణాలకుగాను 480 ప్రాంగణాలకు స్థలాలను సేకరించారు. వాటిల్లో 460 పూర్తిచేయగా... దానికిగాను రూ. 26.16 కోట్లు ఖర్చు చేశారు. వాటితోపాటు ఖమ్మం నగరం, ఇతర పట్టణాల్లో కూడా ఇదే తరహాలో నిధులు వెచ్చించారు. ఖమ్మం నగరంలో మొత్తం 60డివిజన్లలో 49 ప్రాంగణాలు నిర్మించాలని భావించగా.. వాటిల్లో 44పూర్తి చేసి.. ఒక్కో ప్రాంగణానికి రూ.4.50లక్షల వరకు ఖర్చు చేశారు. మిగిలిన పట్టణాల్లోనూ ఇదే తరహాలో ప్రాంగణాలు నిర్మించగా.. ఆయా ప్రాంగణాలకు ఖర్చు చేశామని చూపిస్తున్న లెక్కల్లో మూడొంతుల నిధులు మింగేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే నిర్వహణ, పర్యవేక్షణ లోపం కారణంగా చాలా క్రీడా ప్రాంగణాలు అసాం?ఘిక కార్య కలాపాలకు అడ్డాగా మారాయి. కొన్ని అయితే చెత్తకుప్పలు.. ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి.

ఖమ్మం జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఇలా..

లక్ష్యం స్థలాల పూర్తయిన ఖర్చు చేసినవి
సేకరణ మైదానాలు
మధిర 138 104 101 రూ.41.83లక్షలు
పాలేరు 182 109 108 48.70
సత్తుపల్లి 186 121 116 86.64
వైరా 217 106 104 57.80
ఖమ్మం
(రఘునాథపాలెం) 50 36 27 13.50
మొత్తం 773 476 456 248.47

భద్రాద్రి జిల్లాలో భూ సమస్య
సగానికిపైగా క్రీడా ప్రాంగణాలకు జాగా కరువు
నిర్మించినవీ నిరుపయోగంగానే..

భద్రాద్రి జిల్లాలో క్రీడాప్రాంగణాల లక్ష్యం నెరవేరలేదు. సగానికి పైగా స్థలం దొరక్క నిర్మించని పరిస్థితి ఉంది. కొన్ని చోట్ల బోర్డులకు మాత్రమే పరిమిత మయ్యాయి. జిల్లాలోని 481 గ్రామపంచాయతీల్లోని 799 శివారు గ్రామాల్లో 1280 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఒక్కో మైదానానికి రూ.3.80 లక్షల నుంచి రూ.5.50లక్షల వరకు నిధులు కేటాయించింది. కానీ ఇప్పటి వరకు 451పంచాయతీల్లో 219హ్యాబిటేషన్లలో 670 ప్రాంగణాలకు స్థలాన్ని గుర్తించి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇంకా 30 పంచాయతీల్లో 580 హ్యాబిటేషన్లలో 610 క్రీడా ప్రాంగణాలకు భూమి దొరకలేదు. చేపట్టిన వాటిలో 596 క్రీడా ప్రాంగణాలు పూర్తయినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నా అవి ఆటలకు అనువుగా లేవని తెలుస్తోంది. వాటిలో కేవలం బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారని, అనేక ప్రాంతాల్లో స్థలాన్ని కూడా చదును చేయకుండా వదిలేశారన్న అపవాదును మూటగట్టుకున్నారు.

భద్రాద్రి జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఇలా..

నియోజకవర్గం లక్ష్యం భూసేకరణ పూర్తయినవి జరిగినవి
కొత్తగూడెం 168 99 87
భద్రాచలం 181 99 90
ఇల్లెందు 278 127 127
పినపాక 313 187 148
అశ్వారావుపేట 321 162 148 మొత్తం 1261 674 600

# బిల్లులివ్వకపోతే భోజనమెలా?

ఖమ్మం : అనారోగ్య కారణాలతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరే రోగులకు పోషకాలతో ఉన్న భోజనాన్ని అందించాలన్నది ప్రభుత్వ ధ్యేయం. కానీ ఈ ప్రక్రియకు బిల్లుల మంజూరులో జరుగుతున్న జాప్యంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. నెలల తరబడి పెట్టిన 'డైట్'కు బిల్లులు చెల్లించలేకపోవడంతో తాము అప్పులు తెచ్చి మరీ వండి పెడుతున్నామని, ఇకపై తమ వల్ల కాదని తెగేసి చెబుతున్నారు. కరోనా లాంటి క్లిష్ట సమయంలోనూ కోడికూరతో భోజనాన్ని అందించామని, వాటి బిల్లులు కూడా ఇప్పటికీ చెల్లించలేదని, అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. ఖమ్మం జిల్లాలో వైద్య విధాన పరిషత కింద ఖమ్మం ప్రధాన ఆస్పత్రితో పాటు సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, మధిర, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఆస్పత్రులున్నాయి. జిల్లా ఆస్పత్రిలో 570 పడకల సామర్థ్యం ఉండగా ఇక్కడ నిత్యం 450 నుంచి 700మంది రోగులు వారి సహాయకులకు భోజనాలు అందిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో భోజనానికి రూ.80 చెల్లిస్తుంది. గత డిసెంబరు నుంచి ఇప్పటి వరకు ఆ బిల్లులు చెల్లించలేదు. అలాగే సత్తుపల్లిలో 100 పడకలు, పెనుబల్లిలో 50, మధిరలో 100, కల్లూరులో 30, నేలకొండపల్లిలో 30, తిరుమలాయపాలెంలో 30 పడకల సామర్థ్యం ఉండగా అక్కడ కూడా భోజనబిల్లులు రాక కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. ఇవన్నీ కలిపి దాదాపు రూ.కోటికి పైగానే బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది.

రోగులకు భోజనాలు అందిస్తున్నారిలా..

జనరల్ ఆస్పత్రిలో ఇనపేషంట్లతో పాటు టీబీ, క్యాన్సర్, ఆరోగ్యశ్రీ వార్డులు, మగ, ఆడ, జనరల్ వార్డుల్లో ఉన్న రోగులకు షౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి పూట భోజజనం, గర్భిణులు, బాలింతలకు విటమిన్స్ అందేలా, రక్త శాతం పెంపునకు దోహదపడేలా పల్లీపట్టీలు, యాపిల్స్ లాంటి పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఈ క్రమంలో రోగులకు నాణ్యమైన పోషకాలతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గతేడాది మెనూ చార్జీలను రెండింతలు పెంచింది. ఈ భోజనాలను సాధారణ రకం, ఆరోగ్యశ్రీ, జేఎసవై (జననీ సురక్షా యోజన) విభాగాలుగా అందిస్తున్నారు. సాధారణ విభాగంలో నిత్యం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి కూర, పప్పు, గుడ్డు అరటిపండును అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీలో వీటితో పాటు రెండు పూటలా రెండు కూరలు, అందనంగా గుడ్లు, అరటిపండ్లు అందిస్తున్నారు. ప్రభుత్వం ఆస్పత్రిలోని ఇనపేషంట్‌కు



రూ.80కి, క్షయ, మానసిక, క్యాన్సర్ రోగులకు రూ.112ను కేటాయించింది. విధుల్లో ఉండే వైద్యులకు రూ.160 కేటాయిస్తోంది. ఇక భోజనంతోపాటు మినరల్ వాటర్ బాటిల్ ఉదయం, సాయంత్రం ఒకటి అందచేస్తున్నారు.

కొవిడ్ నాటి బిల్లులు రూ.40లక్షల పైమాటే

కరోనా లాంటి కష్టకాలంలో వైద్య ఆరోగ్యశాఖ నిపుణుల సూచనల మేరకు బాధితులకు పోషకాహారం అందించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు పలు ఆసుపత్రుల్లోని కరోనా వార్డుల్లో ఉన్న రోగులతో పాటు, జనరల్ వార్డుల్లో ఉన్నపేషంట్లకు కూడా షౌష్టికాహారాన్ని అందించారు. ఉదయానే గోరువెచ్చటి తాగునీరు, అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి పూట భోజనాన్ని అందించారు. అలాంటి సమయంలో అందజేసిన ఆహారానికి సంబంధించిన బిల్లులను నేటికీ ప్రభుత్వం ఇవ్వలేదు. ఈ క్రమంలో రూ.40లక్షల బిల్లులు బకాయి పడింది. వాటికోసం కాంట్రాక్టర్లు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో కమిషనర్‌ను కలవాలంటూ ఆస్పత్రి అధికారులు.. ఆసుపత్రి అధికారులను అడగాలంటూ కమిషనరేట్ అధికారులు తప్పించుకుంటున్నారని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వార్డుల్లో అందించే ఆహారం ఇదీ..

ఉదయం 6గంటలకు టీ, ఉదయం 7నుంచి 8గంటల లోపు కిచిడీ, ఉప్మా, టోమాటో బాత, ఇడ్లీల్లో ఏదైనా ఒకటి, మ?ధ్యాహ్నం 1 గంట నుంచి 2లోపు అన్నం , ఏదైనా ఆకుకూరతో పప్పు, ఒక కూర, సాంబారు, పెరుగు, ఉడకబెట్టిన ఒక కోడిగుడ్డు, ఒక అరటిపండు. (ప్రతీ ఆదివారం 100 గ్రాముల చికెన), రాత్రి భోజనంలో అన్నం, పప్పు, కర్రీ, మజ్జిగ, ఒక ఉడకబెట్టిన కోడిగుడ్డు ఇస్తున్నారు.

# నిరీక్షణే!

సంగారెడ్డి: ప్రభుత్వ భూముల్లో నివాసాలు నిర్మించుకున్నవారు క్రమబద్ధీకరణ కోసం నిరీక్షిస్తున్నారు. జీవో 58, 59 కింద దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారు. కటాఫ్ తేదీ పొడిగింపుతో జిన్నారం మండలంలో కొత్తగా 1,250 దరఖాస్తులు వచ్చాయి. రెండునెలలు కొనసాగిన దరఖాస్తుల స్వీకరణ గడువు మే 31తో ముగియడంతో క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం లబ్ధిదారులు వేచిచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2015, 2022లో నివాసాల క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చింది. తెలంగాణ ఏర్పడిన 2014 జూన్ 2వ తేదీని కటాఫగా తేదీగా నిర్ణయించింది. అంతకుముందే నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు అవకాశం కల్పించింది. మొదటి విడతలో రెండో విడతల్లో 2,887 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల కటాఫ్ తేదీని 2020 జూన్ 2 వరకు పొడిగించిన ప్రభుత్వం మరోసారి దరఖాస్తులకు అవకాశం కల్పించింది. దీంతో కొత్తగా 1,250 అర్జీలు వచ్చాయి. అన్ని విడతలు కలిపి జిన్నారం మండలంలో 3,500కు పైగా దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన చేయాల్సి ఉన్నది.

జిల్లాలోనే అత్యధిక దరఖాస్తులు

ప్రభుత్వ భూములలో నివాసాలు నిర్మించుకున్న వారికి క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం అవకాశం కల్పించింది. 125 గజాల లోపు ఉన్న నిర్మాణాలను ఉచితంగా, ఆపై ఉన్నవాటిని మార్కెట్ ధర ప్రకారం రుసుం చెల్లించి క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఇందు కోసం జీవో 58, 59ను తీసుకువచ్చింది. జిల్లాలో మొత్తం 11,402 దరఖా



స్తులు వచ్చాయి. వీటిలో అత్యధికంగా జిన్నారం మండలం నుంచి ఉన్నాయి. మొదటి విడతలో 2,500 దరఖాస్తులు రాగా.. రెండో దఫాలో 2,887 దరఖాస్తులు అందాయి. గడువు పొడిగించిన అనంతరం మూడో విడతలో 1,250 దరఖాస్తులు వచ్చాయి.

రెండో విడతలో క్రమబద్ధీకరించినవి 161..జీవో 58, 59 కింద మొదటి విడతలో 2,500 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 1,250 దరఖాస్తులను పరిశీలించి క్రమబద్ధీకరించారు. రెండో విడతలో అందిన 2,887 దరఖాస్తుల పరిశీలన కోసం జిల్లా అధికారులు నియమించిన బృందాలు ఆయా క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. వీటిలో రెగ్యులరైజేషన్‌కు అర్హత ఉన్న 161 నివాసాలను క్రమబద్ధీకరించారు. బొల్లారం, మాదారం గ్రామాలకు చెందిన 150 నివాసాలను జీవో 59 కింద క్రమబద్ధీకరించారు. జీవో 58 కింద 11 నివాసాలను క్రమబద్ధీకరించి, వారందరికీ రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఇంకా 2,650కి పైగా దరఖాస్తుల పరిస్థితిపై ఎటువంటి సమాచారం అధికారవర్గాలు వెల్లడించడం లేదు. అలాగే కొత్తగా వచ్చిన 1,250 దరఖాస్తులనూ పరిశీలించాల్సి ఉన్నది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దరఖాస్తుల పరిశీలన, క్రమబద్ధీకరణ ప్రక్రియపై సందేహాలు నెలకొన్నాయి.

# గాలి వీచిందా... అంతే..!

బెజ్జూరు : అసలే వర్షాకాలం...ఆపై తరచూ విద్యుత్‌కో తలు.. దీంతో మండల ప్రజలకు తప్పని ఇబ్బందులు. 24గంటలు విద్యుత్‌సరఫరా చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా సిర్పూర్ నియోజకవర్గంలో మాత్రం తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండటంతో వినియోగదారులు తీవ్రఅవస్థలు పడుతున్నారు. నియోజక వర్గంలో గత నాలుగేళ్లుగా ఈ కష్టాలు తప్పడం లేదు. విద్యుత్ సరఫరా కోసం గతంలో పలుమార్లు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన కార్యక్రమాలు కూడా చేపట్టారు. ప్రస్తుతం వర్షాలు కూడా కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫ రాకు అంతరాయం ఏర్పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..సిర్పూర్ నియోజకవర్గంలోని సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూరు, చింతలమానేపల్లి మండలాలకు ఈస్గాం 132/33విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్‌సరఫరా అవుతోంది. అక్కడి నుంచి ఆయా మండలాల్లోని గ్రామాలకు సుమారు 170కిలోమీటర్ల దూరంలో విద్యుత్‌సరఫరా అవుతోంది. అటవీప్రాంతాల నుంచి సరఫరా అవుతుం డటంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. ఆయా మండలాల పరిధిలో ఏ చిన్నపాటి సమస్య తలెత్తినా నాలుగు మండలాలకు విద్యుత్ సౌకర్యం పూర్తిగా నిలిచిపోతోంది. ఇటీవల రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం గంటల తరబడి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతోంది. ఇక బెజ్జూరు మండలంలో ప్రతినిత్యం విద్యుత్ అంతరాయం కారణంగా మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ అంతరాయం కారణంగా వినియోగదా రులు ఏమైందోనని ఫోన్‌లు చేస్తే విద్యుత్‌సిబ్బంది నుంచి ఎలాంటి సమాధానం రావడం లేదు. ముఖ్యంగా వర్షాకాలం కావడంతో దోమల వ్యాప్తి పెరగడంతో రాత్రిళ్లు నిద్రలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నాళ్లు ఈ కష్టాలంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆయా మండలాలకు ఈస్గాం 132/33విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సిర్పూర్(టి) మీదుగా కౌటాల, చింతలమానేపల్లి మండలాల మీదుగా బెజ్జూరుకు సరఫరా అవుతోంది. సిర్పూర్(టి) అటవీ ప్రాంతం కావడంతో ఏ చిన్నపాటి గాలి వీచినా దిగువన ఉన్న మండలాలకు విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కౌటాల మండల కేంద్రంలో 132/33విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఈ ప్రాంత ప్రజల డిమాండ్ మేరకు గత ఏడాది మంజూరు చేశారు. అయితే స్థలం ఏర్పాటులో జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఈ ఏడాది సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కౌటాలలో సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తైతే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉంటుందని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

అడ్డంకిగా మారిన అనుమతులు..విద్యుత్ సమస్యలతో ఇక్కట్లు పడుతున్న ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు మూడేళ్ల క్రితం పెంచికలపేట సబ్‌స్టేషన్ నుంచి బెజ్జూరుకు విద్యుత్ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేయగా అటవీ అనుమతులు లేక పనులు ముందుకు సాగడం లేదు. పెంచికలపేట నుంచి బెజ్జూరుకు విద్యుత్‌సరఫరా చేసేందుకు రోడ్డు వెంట విద్యుత్‌స్తంభాలు వేయగా అటవీ అధికారులు అనుమతులు లేవంటూ పనులను అడ్డుకున్నారు. దీంతో మళ్లీ సమస్య ముందు కొచ్చింది. ఈ మార్గంలో విద్యుత్‌లైన్ వేసినా పూర్తిస్థాయిలో పనులు కాలేదు. పెంచికలపేట మీదుగా లైన్ వేసినా బెజ్జూరుకు విద్యుత్ సమస్య తలెత్తదని మండల ప్రజలు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న తమ కష్టాలు తీర్చాలని మండల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఇబ్బందులు తీర్చాలి..– టి నీలేష్, బెజ్జూరు

మండలంలో విద్యుత్ కోతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పర్థితి నెలకొంది. గంటల తరబడి విత్యుత్‌కు అంతరాయం ఏర్పడుతున్న ందున ప్రజలు అవస్థలు పడుతున్నారు.

# నిధులు వెనక్కి.. సమస్యలు మొదటికి..

పాల్వంచ : ఇదీ పాల్వంచ మండలం ఉల్వనూరు పీహెచ్‌సీలో ఇన్వర్టర్లు. ఇవి మరమ్మతులకు గురయ్యాయి. రూ.2 వేలు వెచ్చించి చిన్నపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తాయి. కానీ నిధుల కొరతతో వీటన్నింటిని పట్టించుకోవడం మానేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చీపురు కొనుగోలు చేయడానికీ సమస్యే. కనీసం ఫ్యాను మరమ్మతుకూ నెలలు గడపాల్సిన దుస్థితి. జిల్లాలో 5 యూపీహెచ్‌సీలు, ఒక జిల్లా ఆసుపత్రి, ఒక ఏరియా ఆసుపత్రి, 4 సీహెచ్‌సీలు, 29 పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీకి ఆసుపత్రి అభివృద్ధి నిధులు (హెచ్.డీ.ఎస్.), అన్‌టైడ్ నిధులు ప్రతి ఏటా రూ.87 వేల చొప్పున నిధులు విడుదలయ్యేవి. కరోనా కారణంగా రెండేళ్ల నుంచి ఆ నిధులు సైతం రావట్లేదు. పోనీ.. అంతకు ముందు విడుదలైన డబ్బుల్ని సద్వినియోగం చేసుకున్నారా అంటే అదీ లేదు. ఫలితంగా జిల్లాలోని ఆస్పత్రులకు సంబంధించిన నిధుల్ని ప్రభుత్వం మూణ్నెల్ల క్రితమే వెనక్కు తీసుకుంది. కానీ తీర్మానాలు చేసి అందజేస్తే కావాల్సిన నిధులు అందిస్తామన్నది జిల్లా అధికారుల భరోసా.

ఇదీ.. సంగతి..జిల్లా కేంద్రం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు బ్యాంకుల ఖాతాల్లో రెండేళ్ల క్రితం వరకు మొత్తం రూ.1,24,31,724 నిధులు ఉన్నాయి. వాటిని వినియోగించుకోకపోవడం వల్ల మూణ్నెల్ల క్రితం ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. ఆ నిధుల్లో ఆసుపత్రి అభివృద్ధి నిధులు (హెచ్.డి.ఎస్.) రూ.22,30,455, అన్‌టైడ్



(నాన్ హెచ్‌డీఎస్) 1,02,01,269 ఉన్నాయి. సమస్యలున్నా వైద్యాధికారులు తమ ఆస్పత్రులకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో నిల్వలను వినియోగించకపోవడం గమనార్హం. నిధుల ఖర్చు ప్రక్రియతో పాటు బిల్లులు, ఆడిట్, ఏమైనా తప్పులుదొర్లితే శాఖాపరమైన చర్యలు తప్పవన్న ధోరణే వాటిని వదిలేయడానికి కారణమనే వాదన వినిపిస్తోంది.

ఇలా వినియోగించవచ్చు

హెచ్‌డీఎస్ నిధులతో పీహెచ్‌సీలో వసతులు సమకూర్చుకోవచ్చు. మరమ్మతులు చేయించుకోవచ్చు. అత్యవసర వైద్యానికి మందులు కొనుగోలు చేయొచ్చు. కానీ ఇందుకోసం సమావేశం నిర్వహించాలి. హెచ్‌డీఎస్ కమిటీలో జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీటీ ఎంపీడీవో, ఎమ్మార్వో, డిప్యూటీ డీఎంహెచ్‌వో, స్థానిక వైద్యుడు తదితరులుంటారు. తీర్మానం జిల్లా అధికారులకు పంపించాలి. అక్కడ ఆమోదం లభిస్తే నిధులొస్తాయి. వైద్యుడు తొలుత ఖర్చు పెడితే ఆ తర్వాత ఉన్నతాధికారులు చెల్లిస్తారు. ఈ క్రమంలో కొంత కోత పడే అవకాశం ఉండటంతో ఎవరూ ముందస్తుగా వ్యయం చేయడానికి సాహసించట్లేదు. ఒక్కో పీహెచ్‌సీలో కనీసం రూ.10 వేల నుంచి రూ.30 వేలు అవసరం ఉండటంతో చాలా మంది వెనుకంజ వేస్తున్నారు. ఉపకేంద్రాలలో గర్భిణులకు పరీక్షలు చేయడానికి కనీసం సామగ్రి ఉండటంలేదు. అన్‌టైడ్ నిధులు వెనక్కి వెళ్లడంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం లేకుండా పోయిందీ.ఎంహెచ్‌వో దయానంద స్వామి ఏమన్నారంటే.. 'నిధులు ప్రభుత్వం తిరిగి తీసుకున్న మాట వాస్తవమే. కానీ ఎవరైనా ఆస్పత్రి సిబ్బంది తీర్మానం చేసి పంపితే నిధులు వెంటనే మంజూరు చేస్తాం'.

వేధించే సమస్యలెన్నో... పాల్వంచ మండలం ఉల్వనూరు, జగన్నాథపురంలోని పీహెచ్‌సీలలో ఇన్వర్టర్లు, ఆర్వో ప్లాంటు పనిచేయట్లేదు. జగన్నాథపురంలో భవనం కురిసి ఫ్యాన్లు కాలిపోయాయి. కంప్యూటర్ పనిచేయడం లేదు. కిన్నెరసాని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలకు గేట్లు లేవు. రేగళ్లలో సోలార్ సమస్యలు ఉన్నాయి. వీటిని డబ్బుల్లేక పనిచేయట్లేదు. ఆళ్లపల్లిలో ఆర్వోప్లాంట్ పనిచేయట్లేదు. బాటిళ్లు తెప్పించి రోగులకు అందిస్తున్నారు. ఇటీవల వైరింగ్ పనులు చేయించారు. ఇందుకోసం వైద్యసిబ్బంది నిధులు వెచ్చించినట్లు తెలుస్తోంది. ములకలపల్లి మండలం మంగపేట ఆస్పత్రిలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. కిచెన్‌షెడ్డు అధ్వానంగా ఉండటంతో కూల్చారు. తాగునీటి సమస్య కూడా ఉంది. స్థానిక వైద్యులు కొన్ని పనులకు సొంత డబ్బులు వెచ్చించారు.చర్ల మండలం కొయ్యూరులో పీహెచ్‌సీకి ప్రహరీ లేదు.పినపాక పీహెచ్‌సీ 24 గంటల ఆసుపత్రి. ఏడాదికి 100 కాన్పులు చేస్తారు. ఇక్కడ తాగునీటి సమస్య ఉంది. మరుగుదొడ్లు లేవు. పాత బిల్డింగ్ కురుస్తోంది.

# వద్దంటున్నా..వచ్చేస్తున్నాయ్!

మెదక్ :రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగరానికి ఆనుకొని జిన్నారం మండలంలో పలు గుట్టలు ఉన్నాయి. ఫలితంగా ఇప్పటికే ఖాజీపల్లి, మాదారం, సోలక్‌పల్లి ప్రాంతాల్లో కంకర క్వారీలు, క్రషర్ మిషన్లు ఏర్పడ్డాయి. సుమారు 20 వరకు ఈ ప్రాంతంలోనే నిర్వహిస్తున్నారు. తాజాగా మరిన్ని ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ప్రకటనతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉన్న వాటితో అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నామని, కొత్తవి ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని పలు సందర్భాల్లో అధికారులకు వినతి పత్రాలు అందజేసి నిరసన తెలిపారు. ఓ వైపు ప్రజలు వద్దంటుంటే.. ప్రభుత్వం క్వారీల ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహిస్తుండటం పట్ల ఆందోళన చెందుతున్నారు. తాజాగా పలు గ్రామాల ప్రజలు జిల్లా పాలనాధికారి శరత్‌ను కలిసి గోడు వ్యక్తం చేసిన నేపథ్యంలో కథనం.

ఇక్కడే ఎందుకు ఇక్కట్లుపారిశ్రామిక ప్రాంతమైన జిన్నారం మండలంలో కంకర క్వారీలు, క్రషర్ల కారణంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యజమానులు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారీతిన వ్యవహరిస్తుండటమే ఇందుకు కారణం. ప్రధానంగా అధిక సామర్థ్యంతో పేలుళ్లు, కేటాయించిన క్వారీకి మించి తవ్వకాలు, పైసా పన్ను చెల్లించకుండా కొన్ని క్వారీల నుంచి సరకు వెళ్లటం, ఒకే వేబిల్లుపై అనేక ట్రిప్పుల కంకర తరలించడం, క్రషర్ల వల్ల తెల్లటి రాతి పొడి గ్రామాలపై వ్యాపించడం లాంటి ఇబ్బందులున్నాయి. క్రషర్ల కాలుష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. రహదారులు ధ్వంసమవుతున్నాయి. దీంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఖాజీపల్లి, మాదారం ప్రాంతాల్లో రైతులు వ్యవసాయం చేయడం మానుకోగా పశువులు తగ్గిపోయాయి. పేలుళ్ల వల్ల కొత్త ఇళ్లకూ బీటలు ఏర్పడుతున్నాయి. విద్యుత్ తీగలు తెగిపడటంతో పాటు.. భూకంప తీవ్రతను తలపించేలా పేలుళ్లు ఉంటున్నాయి. దీంతో పరిసర గ్రామాల ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు.

పంచాయతీల ఆదాయానికి గండిప్రభుత్వ నిబంధనల ప్రకారం క్వారీల వల్ల స్థానిక సంస్థలకు కొంత ఆదాయం సమకూరాలి. సంబంధిత యాజమాన్యాలు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లిస్తే అందులో కొంత శాతం గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు రావాలి. ఒక్క ఖాజీపల్లి పంచాయతీకే రూ.4.5 కోట్ల సీనరేజీ రావాల్సి ఉంది. ఇదే పరిస్థితి మాదారం, రాళ్లకత్వలోనూ చోటు చేసుకుంది. ఇప్పటికే పైసా ఆదాయం లేని క్వారీల వల్ల అనేక రకాల ఇబ్బంది పడుతున్నామని, కొత్తవి ఏర్పాటు చేయవద్దని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిరసనలు.. తీర్మానాలు జులై నెల 22న జిన్నారం మండలం మాదారం, ఖాజీపల్లిలో కంకర క్వారీల ఏర్పాటుకు పర్యావరణ అనుమతుల కోసం పీసీబీ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు మూకుమ్మడిగా వ్యతిరేకించారు.

# ప్రోత్సాహకానికి ఎదురుచూపులే.!



మహబూబాబాద్ : కేసీఆర్ కిట్టు పేరుతో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం కోసం లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. నిబంధనల ప్రకారం విడతల వారీగా అందాల్సినవి సమయానికి రాకపోవడంతో లబ్ధిదారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సర్కారు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం కేసీఆర్‌కిట్టును అమల్లోకి తీసుకొచ్చింది. అప్పటి నుంచి జిల్లాలోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో, జిల్లా ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగింది. కిట్టుతో పాటు మగ బిడ్డ పుడితే రూ.12 వేలు, ఆడ బిడ్డ పుడితే రూ.13 వేల ప్రోత్సాహకాన్ని ఇస్తోంది. గర్భం దాల్చిన నాటి నుంచి పుట్టిన బిడ్డకు తొమ్మిది నెలల వయసు వచ్చే వరకు నాలుగు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేస్తారు. ఈ ప్రక్రియ సకాలంలో జరగక లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడం లేదు.

37,188 మంది ఎదురుచూపులు: జిల్లాలో సుమారు ఏడాదిన్నర నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో ప్రోత్సాహక సాయం జమ కావడం లేదు. వైద్యాధికారులు తెలిపిన లెక్కల ప్రకారం జిల్లాలో 37,188 మంది అర్హులు నాలుగు విడతల్లో సాయం అందాల్సిన వారున్నారు. వీరందిరికి సుమారు రూ.10.58 కోట్లు జమ కావాల్సి ఉంది. సర్కారు ప్రోత్సాహక సాయం తమ ఖాతాల్లో ఎప్పుడు జమ అవుతుందోనని వీరంతా ఎదురుచూస్తున్నారు.

నాలుగు విడతల్లో : ఈ పథకంలో లబ్ధిదారులకు నాలుగు విడతల్లో ఆర్థిక సాయాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. సర్కారు దవాఖానాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు ప్రసవస్తేనే ఆర్థిక సాయం అందిస్తారు. గర్భం దాల్చిన ఐదు నెలల లోపు సర్కారు దవాఖానాల్లోని వైద్యుల వద్ద కనీసం రెండు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. గర్భం దాల్చినట్లు స్థానిక ఏఎన్ఎం, అంగన్‌వాడీల్లోనూ తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత వారి ఖాతాల్లో రూ. 3 వేలు జమ చేస్తారు. ప్రసవం అయిన తర్వాత ఆడబిడ్డ పుడితే రూ. 5 వేలు, మగ బిడ్డ పుడితే రూ. 4 వేలు అందిస్తారు. శిశువుకు మూడున్నర నెలల్లో ఇచ్చే వ్యాధినిరోధక టీకాలు ఇప్పించిన అనంతరం రూ. 2 వేలు, తొమ్మిది నెలల్లో ఇచ్చే టీకా ఇప్పించిన తర్వాత మిగిలిన రూ.3 వేలను ఖాతాల్లో ఇలా విడతల వారీగా జమ చేస్తారు.

మూడు నెలలు గడిచినా జమ కాలేదు

– అయిత స్వరూప, గర్భిణి, నెల్లికుదురు

నెల్లికుదురు: ఏఎన్ఎం వద్ద గర్భం దాల్చినట్లు వివరాలు నమోదు చేయించుకుని మూడు నెలలు కావొస్తుంది. ఇప్పటి వరకు ప్రోత్సాహకం మొదటి విడత నగదు జమ కాలేదు. చెల్లిస్తే పోషకాహారం తీసుకోవడానికి ఉపయోగపడుతుంది.

జిల్లాలో సాయం అందాల్సిన గర్భిణులు/బాలింతలు

| విడతలు | సాయం పొందాల్సిన వారు | బకాయిలు (రూ.కోట్లలో) |
| --- | --- | --- |
| 1వ | 10,016 | 3.00 |
| 2వ | 5,612 | 2.24 |
| 3వ | 11,120 | 2.22 |
| 4వ | 10,440 | 3.12 |

# నగరంపైనా భద్రతా కవచం



మహబూబాబాద్ :ఆధునిక సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు మహా నగరపాలక సంస్థ అడుగులేస్తోంది. ఆకర్షణీయ నగరం(స్మార్ట్ సిటీ) పథకం ద్వారా సుమారు రూ.90 కోట్లతో సమీకృత నిఘా నిర్వహణ కేంద్రం(ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్) ఏర్పాటు చేస్తున్నారు. బల్దియా నూతన కౌన్సిల్ హాల్ భవనంలో తాత్కాలికంగా అందుబాటులోకి తెచ్చారు. కమిషనర్ ఛాంబర్ భవనం రెండో అంతస్తులో శాశ్వతంగా ఈ కేంద్రం పనులు మొదలయ్యాయి. దేశ వ్యాప్తంగా స్మార్ట్ సిటీ పథకం కింద ఎంపికైన 100 నగరాల్లో తప్పని సరిగా ఏర్పాటు చేయాలని కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ సూచించింది. మే 7 న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ బల్దియాలో ఈ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. తక్షణ సేవల కోసం కొత్త కౌన్సిల్ హాల్ మొదటి అంతస్తులో తాత్కాలికంగా అందుబాటులోకి తెచ్చారు. నాలుగు ఎల్ఈడీ తెరలు, నాలుగు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఏసీలు, ఆడియో సిస్టమ్, కుర్చీలు ఏర్పాటు చేశారు. రెండు, మూడు వారాలుగా కొన్ని సేవలను కమిషనర్ ప్రావీణ్య, వింగ్ అధికారులు పరిశీలిస్తున్నారు. బల్దియా వాహనాలకు ఏర్పాటు చేసిన వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్, జీపీఆర్ఎస్ సిస్టమ్, వరంగల్ నగరంలో ట్రాఫిక్ తదితర సేవలు పర్యవేక్షిస్తున్నారు. మూడు, నాలుగు నెలల్లో పూర్తిస్థాయిలో ఈ కేంద్రం సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులంటున్నారు.

సేవలు ఇలా.. వరంగల్ పోలీసు కమిషనరేట్ సెంటర్‌లోఉన్న నిఘా వ్యవస్థకు అనుసంధానంగా ఈకేంద్రం పనిచేస్తుంది. 14 అంశాల్లో ఆధునిక సేవలు అందుబాటులోకి తెస్తారు. దీని ద్వారా వరంగల్ నగర పరిధిలో ఏం జరుగుతుందో పరిశీలించే వీలుంటుంది. వాతావరణం, భారీ వర్షాలు తదితరాలపై ముందస్తు హెచ్చరికలు తెలిసే వీలుంటుంది.

లి నగరంపై నిఘా

లిమెరుగైన రాకపోకల వ్యవస్థకు ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంటు సిస్టం

లి 10 ప్రాంతాల్లో ఎర్ర బుగ్గ అతిక్రమణ గుర్తించే సెన్సార్లు

లి 10 ప్రాంతాల్లో వాహనాల వేగం గుర్తించే సెన్సార్లు

లి ఒక ప్రాంతంలో వ్యతిరేక దిశలో నడిచే వాహనాన్ని గుర్తించే సెన్సార్లు

లి ఇ-చలానా పంపించే ఏర్పాట్లు

లి 10 ప్రాంతాల్లో వాతావరణ సమాచారాన్ని గుర్తించే సెన్సార్లు

లి 10 ప్రాంతాల్లో అస్థిర(వేరియబుల్) సమాచారం పంపే ఏర్పాట్లు

లి హోస్టింగ్ స్టేట్ డేటా సెంటర్

లి జీఐఎస్

లి ఇ-గవర్నెన్స్

లి సమీకృత వాతావరణ సమాచారానికి ఐఎండీతో అనుసంధానం

లి ఐసీటీ బేస్డ్ ఘనవ్యర్థాల నిర్వహణ విధానం

లి సెంట్రలైజ్డ్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్(సీసీఎంఎస్) వీధి దీపాలు

లి వరంగల్ మహా నగరపాలక సంస్థకు సంబంధించిన పరిపాలన, క్షేత్రస్థాయి పనులు, తాగునీటి సరఫరా, లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు తదితరాలను ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తారు.

# యంత్రాలు పనిచేయక పరేషన్



ఖమ్మం : జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో ఇటీవల అమర్చిన ఇ పోస్ యంత్రాల పనితీరు నత్తను తలపిస్తున్నాయి. 4జి సిగ్నల్స్ ఆధారంగా వేగంగా యంత్రాలు పనిచేస్తాయని విజన్ టెక్ సంస్థ నిర్వాహకులు అమర్చారు. కానీ యంత్రాలు సరిగా పనిచేయక రేషన్ దుకాణాల ఎదుట కార్డుదారులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు నెలలో కార్డుదారులకు 15 కిలోలు చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలోని 748 రేషన్ దుకాణాల ద్వారా 4,16,812 కార్డులపై 11,68,535 మందికి 17,600 మె.ట. బియ్యం కేటాయించారు. ఈనెల 5 నుంచి పంపిణీ ప్రారంభించగా 19న ముగుస్తున్నట్లు డీలర్లు చెపుతున్నారు. కానీ గురువారం వరకు జిల్లాలో కేవలం 68 శాతం మాత్రమే బియ్యం పంపిణీ జరిగింది. చాలా మంది కార్డు దారులు రేషన్ దుకాణాల వద్ద నిరీక్షించి తిరిగి పోతున్నారు. దీంతో తమ రోజువారీ కూలీ పనులు కోల్పోతున్నట్లు పలువురు వాపోతున్నారు. దీంతో కార్డు దారులు, రేషన్ డీలర్లకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంటోంది.

పనితీరు ఇలా..

ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం మేరకు గత జులై నుంచి విజన్ టెక్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాల్లో ఇ పోస్ యంత్రాలు అమర్చింది. జియో 4 జి సిమ్ ఇ పోస్ యంత్రాల్లో అమర్చారు. బ్లూటూత్ డివైస్ ఆధారంగా 4జి సిగ్నల్స్‌తో యంత్రం పనిచేస్తుంది. దీనికి అనుసంధానంగానే ఎలక్ట్రానిక్ తూకం యంత్రం పనిచేస్తుంది. ఇ పోస్ యంత్రంలో కార్డు దారుడి వేలిముద్ర నమోదు చేయగానే డేటా బేస్ ఆధారంగా ఎంత మంది సభ్యులున్నారు...ఎన్ని కిలోలు జారీ చేయాలనేది యంత్రంలోనే సెకన్లలో నమోదై అనుమతి ఇస్తుంది. ఈ మేరకు ఎలక్ట్రానిక్ తూకం యంత్రంపై బియ్యం ఉంచాలి. ఇవ్వాల్సిన బియ్యం కచ్చితంగా ఉంటేనే యంత్రం అంగీకరిస్తుంది. పది గ్రాములు ఎక్కువ, తక్కువ ఉన్నా నిరాకరిస్తుంది. ఈ ట్రాంజాక్షన్ సకాలంలో అనుమతికాకుండా ఫెయిల్ అయితే మళ్లీ కార్డుదారుడి వివరాలు మొదటి నుంచి నమోదు చేయాల్సి ఉంటుంది. ఇదే సమయంలో కొందరి కార్డుదారుల వేలిముద్రలు యంత్రం స్వీకరించకుంటే ఐరిష్ పరికరం ద్వారా కార్డుదారుడి కనుపాపలను గుర్తించే ప్రక్రియ చేపడతారు. కార్డులో ఒకరిద్దరుంటేనే ఓటీపీ ద్వారా అనుమతి లభిస్తుంది. ఇ పోస్ యంత్రానికి 4జి సిగ్నల్స్ అందేలా ఒక యాంటిన్నా ఏర్పాటు చేయాల్సి ఉంది. అయినా సిగ్నల్స్ సరిగా అందక యంత్రాలు మొరాయిస్తున్నాయి. ఒక్కో కార్డు ట్రాంజాక్షన్ పూర్తికావటానికి 15 నుంచి 20 నిమిషాల సమయం పడుతోందని పలువురు డీలర్లు వాపోతున్నారు. దీంతో చాలా మంది డీలర్లు ఇ పోస్ యంత్రంతో సంబంధం లేకుండా ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు ఉపయోగిస్తున్నారు. సాంకేతిక కారణాలతో యంత్రాల పనితీరు మందగించి కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఇ పోస్ యంత్రాల పనితీరులో ఏర్పడిన సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తున్నారు. విజన్ టెక్ సంస్థ నిర్వాహకులు నాలుగు రోజులు క్రితం అప్‌గ్రేడ్ చేశారు. మరో నాలుగు రోజుల్లో మిగతా సమస్యలు తీరుతాయి. బ్లూటూత్ సమస్య పరిశీలిస్తున్నారు. బియ్యం పంపిణీ గడువు పొడిగించే అవకాశం ఉంది.– రాజేందర్, డీఎస్వో, ఖమ్మం

# అంతటా అవినీతి మారని సిబ్బంది రీతి

మెదక్ : వైద్యశాఖలో విధులు నిర్వహించిన ఓ తల్లి మరణానంతరం రావాల్సిన పీఎఫ్, సరెండర్ సెలవుల డబ్బుల కోసం ఆమె కుమారుడు అధికారుల చుట్టూ తిరిగాడు. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ ఉద్యోగి షౌకత్‌అలీ అతడి నుంచి రూ.30 వేలు లంచం డిమాండ్ చేయగా, చివరకు రూ.15 వేలకు ఒప్పందం కుదిరింది. సదరు వ్యక్తి అనిశా అధికారులను ఆశ్రయించగా.. 2019 జులై 23న పట్టుకున్నారు. మెదక్ కేంద్రంగా జిల్లా ఏర్పడిన తర్వాత ఇది తొలి అనిశా దాడి.

రూ.1.12 కోట్ల అవినీతి వ్యవహారంలో అదనపు పాలనాధికారి గడ్డం నగేశ్ 2020 సెప్టెంబరు 9న అనిశా అధికారులకు దొరికాడు. 112 ఎకరాల రిజిస్ట్రేషన్ విషయంలో నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇచ్చేందుకు రూ.40 లక్షలు తీసుకుని.. ఐదెకారాలు తన బినామీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించేలా ఒప్పందం చేసుకున్నాడు. దీనితో సంబంధం ఉన్న అప్పటి నర్సాపూర్ ఆర్డీవో అరుణారెడ్డి, చిలప్‌చెడ్ తహసీల్దార్ అబ్దుల్ సత్తార్, జూనియర్ సహాయకుడు వసీం అహ్మద్‌లను అరెస్ట్ చేశారు.

తాజాగా చేగుంట నాయబ్ తహసీల్దారు చంద్రశేఖర్ అనిశాకు పట్టుబడ్డాడు. మండల పరిధి రాంపూర్ శివారులో ఉన్న 33 గుంటలను ఫౌతీ చేసేందుకు, మరో ఎకరా భూమిని బాధితుడి పేరిట ధరణిలో నమోదు చేసేందుకు రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. రూ.4.50 లక్షలకు ఒప్పందం కుదరగా, గురువారం రూ.2.70 లక్షలను బాధితుడు మధ్యవర్తికి ఇస్తుండగా, అనిశా అధికారులు పట్టుకున్నారు. నాయబ్ తహసీల్దారును అదుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి చిరునామాగా మారాయి. చేతులు తడపనిదే పని పూర్తి కావడం లేదన్న ఆరోపణలున్నాయి. ప్రతి పనికి ఎంతో కొంత ముట్టజెప్పాల్సిందే. లేదంటే దస్త్రాలు ముందుకు కదలడం లేదు. దీంతో బాధితుల్లో కొందరు ఎంతో కొంత నగదు ఇస్తుండగా, మరికొందరు అనిశాను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ శాఖల అధికారులు అడపాదడపా ఈ ఉచ్చులో చిక్కుతున్నారు. గురువారం చేగుంట తహసీల్దారు కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడి ఘటన ఆయా శాఖల ఉద్యోగులను ఉలిక్కిపడేలా చేసింది. జిల్లా ఆవిర్భావ అనంతరం ఇది మూడో ఘటన. సాధారణంగా రైతులకు అందించే పట్టాదారు పాసుపుస్తకాల వరకు సిబ్బంది స్థాయికి తగ్గట్లు డబ్బులు తీసుకునేందుకు అలవాటు పడ్డారు.

ఏయే శాఖల్లో..

జిల్లాలో ప్రధానంగా రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డింగ్, ఇంజినీరింగ్, పోలీసు, సబ్‌రిజిస్ట్రార్, మున్సిపల్, వైద్య, రవాణా, పౌరసరఫరాలు, ఎక్సైజ్, ఖజానా శాఖల్లో అవినీతి పేరుకుపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూలో ఇది కాసింత ఎక్కువే. ధరణి కార్యక్రమం అమలవుతున్నా, ఈ శాఖలో మార్పురావడంలేదని బాధితులు వాపోతున్నారు. భూమిని సర్వే చేయాలన్నా, ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసినా డిమాండ్ చేస్తున్నారు.

స్థిరాస్తి వ్యాపారం ఊపందుకోవడంతో..

జిల్లాలోని మెదక్, రామాయంపేట, తూప్రాన్, మనోహరాబాద్, నర్సాపూర్, చేగుంట, కౌడిపల్లి, శివ్వంపేట ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరుగా నడుస్తోంది. ఇక్కడ వ్యవసాయ భూములను నాలాగా మార్చేందుకు తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాల్లో సిబ్బంది మొదలుకుని ఉన్నతాధికారుల వరకు పెద్దమొత్తంలో డబ్బు ముట్టజెప్పనిదే పని పూర్తికావడం లేదని ఎంతోమంది ఆరోపిస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగాల్లో కొందరు అధికారులకు బిల్లు మొత్తంలో 2 నుంచి 3 శాతం చెల్లించకుంటే దస్త్రం కదిలే పరిస్థితి లేదని గుత్తేదారులు వాపోతున్నారు. భూములకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారికి వరుస క్రమంలో కాకుండా ముట్టజెప్పిన వారికే తొలి ప్రాధాన్యం.

రక్షణ కల్పించేవారే..

సమాజానికి అండగా ఉంటామనే భరోసా నిచ్చే పోలీస్‌శాఖలో సైతం ఇదే తంతు నడుస్తోంది. జిల్లా ఏర్పడిన తర్వాత పెద్ద నోట్ల రద్దు సమయంలో మనోహరాబాద్ మండల కేంద్రంలో పనిచేసిన ఓ ఎస్సై నోట్లమార్పిడికి వచ్చిన ముఠా సభ్యులపై దాడి చేయించి వారి వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసులో ఎస్సైని బాధ్యుడిగా చేస్తు ఉన్నతాధికారులు అతన్ని సస్పెండ్ చేసిన సంగతి విదితమే. 2020 ఫిబ్రవరిలో మెదక్ గ్రామీణ ఠాణాలో పనిచేసిన ఓ ఎస్సైపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి.

మున్సిపాలిటీల్లోజి

పురపాలికల్లో ఇంటి నిర్మాణాలకు, ఆస్తిలో పేరు మార్పిడి, దుకాణదారులకు వ్యాపార లైసెన్సులు మంజూరు, గడువు పొడిగింపు..ప్రతి పనికి సిబ్బందికి అమ్యామ్యాలు ఇవ్వాల్సిందే. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇల్లు, స్థలాల రిజిస్ట్రేషన్‌కు దళారులే కొంత ధర నిర్ణయించి యజమానుల వద్ద ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఒక రోజులో జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి వచ్చిన డబ్బులను అధికారి మొదలు కింది స్థాయి సిబ్బంది వరకు తీసుకుంటారనే విమర్శలు ఉన్నాయి. ఎక్సైజ్‌శాఖలో కల్లు డిపోలకు లైసెన్స్‌ల గడువు పొడిగింపు, గొలుసు దుకాణాలు, బార్లు, వైన్స్‌ల సంబంధించి అధికారులకు ప్రతి నెలా మామూళ్లు చెల్లించాల్సిందే. రవాణాశాఖలో లైసెన్సుల జారీ, భారీ వాహనాలకు ఆర్సీ మంజూరు, విద్యాలయాల బస్సులకు అనుమతి కోసం అధికారులు, సిబ్బంది చేతులు తడపాల్సిందే.

## అనిశా వలలో నాయబ్ తహసీల్దారు

మెదక్ : చేగుంట నాయబ్ తహసీల్దారు చంద్రశేఖర్ అనిశా వలకు చిక్కాడు. మెదక్ అనిశా డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో దాడి చేసి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. డీఎస్పీ తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన కొత్త రఘునాథరెడ్డికి చేగుంట మండలం రాంపూర్‌లో 122 సర్వే నంబరులో ఎకరం భూమి ఉంది. ధరణిలో నమోదు కాలేదు. 33 గుంటల భూమి ఫౌతి చేయించుకునేందుకు, ఎకరం భూమిని ధరణిలో నమోదు చేయించేందుకు తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ పనులకు రూ.5 లక్షల లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ.4.50 లక్షలకు ఒప్పందం కుదిరింది. బాధితుడు అనిశా అధికారులను ఆశ్రయించారు. నాయబ్‌తహసీల్దారు సూచించిన మేరకు మొదటి దఫా ఇవ్వాలనుకున్న రూ.2.50 లక్షలు, ప్రైవేటు వ్యక్తి అనిల్‌కుమార్‌కు రూ.20 వేలు ఇవ్వగానే మాటు వేసిన అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అధికారిని అదుపులోకి తీసుకుని విచారించగా లంచం తీసుకున్నట్లు ఒప్పుకోవడంతో అరెస్టు చేశారు.

మెదక్‌లో సోదాలు

అనిశాకు చిక్కిన చేగుంట నాయబ్ తహసీల్దారు చంద్రశేఖర్‌కు చెందిన జిల్లా కేంద్రం మెదక్‌లోని ఇంట్లో సోదాలు చేపట్టారు. స్థానిక సినీమ్యాక్స్ థియేటర్ వద్ద ఉన్న ఆయన ఇంట్లో అనిశా ఇన్‌స్పెక్టర్లు నగేష్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. సోదాలు కొనసాగిన సమయంలో విలేకరులను అనుమతించలేదు. సోదాల్లో రూ.10 వేలు లభించినట్లు అనిశా సీఐ వెంకట రాజాగౌడ్ తెలిపారు.

# నట్టేటా ముంచడమే బాబు పాలసీ.. అవన్నీ దత్తపుత్రుడి పేటెంట్: సీఎం జగన్




పార్వతీపురం మన్యం: ప్రజలకు ఇంత మంచి చేస్తుంటే.. చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని, అబద్ధాలు.. మోసాలతో మళ్లీ ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తున్నాడని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్న అమ్మ ఒడి పథకం నిధుల విడుదల కార్యక్రమంలో గభాంగా.. కురుపాం బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. చంద్రబాబుతో పాటు జనసేనాని పవన్ కల్యాణ్‌పైనా మండిపడ్డారు. తన 45 ఏళ్ల రాజకీయంలో చంద్రబాబు ఏనాడూ మంచి గురించి ఆలోచించలేదు. టీడీపీని టీ అంటే తినుకో.. డీ అంటే దండుకో.. పీ అంటే పంచుకోగా మార్చేశారు. దోచుకున్న సొమ్ముతో వాళ్లు బొజ్జలు పెంచుకున్నారని ఎద్దేశా చేశారాయన. మన రాష్ట్రంలో మంచిచేయొద్దని చెప్పే నాలుగు కోతులు ఉన్నాయి. మంచి అనోద్దు.. మంచి వినోద్దు..మంచి చేయొద్దు అన్నదే వారి విధానం. నమ్మించి ప్రజలను నట్టేటా ముంచడమే వాళ్లకు తెలిసిన నీతి. రాష్ట్రంలో మంచి జరుగుతుంటే భరించలేకపోతున్నారు. వాళ్లకు కడుపులో మంట, ఈర్ష్యతో వాళ్లకు కళ్లు మూసుకుపోయాయి. దత్తపుత్రుడు 2014లోనూ చంద్రబాబుకు మద్దతు ఇచ్చాడు. మరి ఆ తర్వాత చంద్రబాబు చేసిన మోసాన్ని ఎందుకు నిలదీయలేదు. ఆ దత్తపుత్రుడు.. మామూలుగా మాట్లాడడు. ఆ ప్యాకేజీ స్టార్ వారాహి అనే ఓ లారీ ఎక్కి ఊగిపోతూ తనకు నచ్చనివారిని.. చెప్పుతో కొడతానంటాడు. తాట తీస్తానంటాడు. ఇష్టానుసారం మాట్లాడుతున్నాడు. ఆ మనిషి నోటికి అదుపు లేదు.. నిలకడా లేదు. వారిలా నలుగురిని పెళ్లి చేసుకుని భార్యను మార్చలేం. దత్తపుత్రుడిలా తొడలు కొట్టలేం.. పూనకం వచ్చినట్లు ఊగిపోతూ బూతులు తిట్టలేం. అవన్నీ వారికి చెందిన పేటెంట్. దుష్టచతుష్టయం సమాజాన్ని చీల్చుతోంది. కానీ, మన పునాదులు సామాజిక న్యాయంలో ఉన్నాయి. అందుకే పనికి మాలిని పంచ్ డైలాగులు ఉండవ్. బలమైన, పటిష్టమైన పునాదుల మీద నిలబడ్డాం. పౌర సేవలు, సంక్షేమ పథకాల అమలులో మన పునాదులు ఉన్నాయి. పేదల కష్టాల నుంచి మన పునాదులు పుట్టాయి. మన పునాదులు ఓదార్పు యాత్ర నుంచి పుట్టాయి. వాళ్ల మాదిరిగా వెన్నుపోటు, అబద్ధాలపై మన పునాదులు పుట్టలేదు. రాష్ట్రంలో రాక్షసులతో మనం యుద్ధం చేస్తున్నాం. యుద్ధంలో వారి మాదిరిగా మనకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 లేవు. వారి మాదిరిగా మనకు దత్తపుత్రుడు లేడు. అబద్ధాలను పదే పదే చెప్పి భ్రమ కలిగించే మీడియా మనకు లేదు. మీ బిడ్డ పొత్తుల కోసం ఏరోజూ పాకులాడలేదు. రాష్ట్రంలో రాక్షసులతో యుద్ధం చేస్తున్నాం. మీ బిడ్డ తోడేళ్లను నమ్ముకోలేదు.. దత్తపుత్రుడిని నమ్ముకోలేదు. జరగ బోయే కురుక్షేత్రంలో మీ బిడ్డకు మీరే అండ. మీ బిడ్డకు అండగా ఉన్నది ఆ భగవంతుడు.. ప్రజలు మాత్రమే. మీకు మంచి చేశాను అనిపిస్తేనే ఈ యుద్ధంలో మీరే నాకు అండగా నిలవాలి అని కోరారాయన.




# కళ తప్పిన బులియన్ మార్కెట్

అమరావతి : అంతర్జాతీయంగా ఉన్న ప్రతికూల పరిస్థితులతో గత పది రోజులుగా బంగారం ధరలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. గత నాలుగు నెలలుగా 24 క్యారెట్లు పది గ్రాములు బంగారం ధర రూ.63,500 వరకు ఎగబాకింది. గత పది రోజులుగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం రూ.60,300కు దిగివచ్చింది. ధరలు తగ్గినా అమ్మకాలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని బులియన్ మార్కెట్ కళ తప్పుతోంది. ఆర్థిక మాంద్యం, బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచడం, ఉత్పత్తి పెరగడం తదితర కారణాలతో బంగారంపై పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. ఇన్‌సైడ్ ట్రేడింగ్ మాత్రమే ఎక్కువగా సాగుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో బంగారం వ్యాపారానికి నరసాపురం పేరుగాంచింది. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 900 దుకాణాలు ఉండగా నరసాపురంలోనే 90 వరకు ఉన్నాయి. సాధారణ రోజుల్లో నెలకు సరాసరి రూ.200 కోట్లు వ్యాపారం జరుగుతుందని అంచనా. ఆ పరిస్థితి ఇటీవల కాలంలో కానరావడం లేదని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఆషాఢ మాసం, ముహూర్తాలు లేకపోవడం, ఆక్వా, వ్యవసాయ రంగాల్లో నష్టాలు తదితర కారణాలతో బంగారం కొనుగోళ్ల శాతం తగ్గింది. బులియన్ మార్కెట్ ప్రభావం ఇతర రంగాలపైనా పడింది. గతంలో జిల్లాతోపాటు తూర్పు, కృష్ణా జిల్లాలు, తెలంగాణ నుంచి బంగారం కొనుగోలు చేసేందుకు వచ్చేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గింది. విక్రయాలు తగ్గడంతో గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది నరసాపురం సర్కిల్ పరిధిలో ప్రభుత్వానికి వచ్చే జీఎస్టీ ఆదాయం కూడా తగ్గింది. 'బంగారం ధరలు కొంత మేర తగ్గినా విక్రయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులతో వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. తప్పనిసరి అయితేనే కొంటున్నారు. ఎక్కువ మంది పాత బంగారం తాకట్టు, విక్రయించడమే కనిపిస్తోంది' అని నరసాపురం బంగారు వర్తకుల సంఘ అధ్యక్షుడు వినోద్‌కుమార్ జైన్ తెలిపారు.

# వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం చంద్రబాబు కసరత్తు..




అమరావతి: రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కసరత్తు మొదలుపెట్టారు. అన్ని నియోజకవర్గాలకు ఇన్చార్జులను నియమించేందుకు ప్లాన్ చేస్తున్నారు. నేతల గ్రాఫ్‌పై సమీక్షలు నిర్వహిస్తున్నారు. కొన్ని స్థానాల్లో నెలకొన్న ప్రతిష్టంభనకు ముగింపు పలకాలని చంద్రబాబు నిర్ణయించారు. ఓ వైపు అసెంబ్లీ ఇంచార్జులతో రెండో దఫా రివ్యూలు... మరోవైపు ఆయా స్థానాల్లో ఇంచార్జుల నియామకాన్ని చంద్రబాబు వేగవంతం చేశారు. ఇప్పటికే 43 అసెంబ్లీ ఇంచార్జులతో రెండో దఫా సమీక్షలు ముగిసాయి. ఇంచార్జుల నియామకంపై కొన్ని స్థానాల్లో నెలకొన్న ప్రతిష్టంభనకు ముగింపు పలుకుతూ నిర్ణయాలు తీసుకున్నారు. సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి కన్నా లక్ష్మీ నారాయణను ఇంచార్జిగా నియమిస్తూ కొద్ది రోజుల క్రితం నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జీడీ నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జిగా వీఎం థామస్, పూతలపట్టుకు కలికిరి మురళీ మోహన్‌ను నియమించారు. వర్గ పోరు ఉన్న స్థానాలపై చంద్రబాబు ఫోకస్ పెట్టారు. గోపాలపురం నియోజవకర్గంలో పార్టీ నేతల మధ్య విభేదాలకు ముగింపు పలకనున్నారు. గోపాలపురం ఇంచార్జ్ వెంకటరాజు, పార్టీ నేత బాపిరాజులను వచ్చి కలవమని పిలుపిచ్చారు. మరోవైపు పార్టీలో చేరికలపైనా దృష్టి పెట్టారు.

కాగా గురువారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు టీడీపీలో చేరనున్నారు. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంపై ప్రజల్లోకి వెళ్లేందుకు చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వచ్చే నెల మొదటి లేదా రెండో వారం నుంచి భవిష్యత్‌కు గ్యారెంటీపై జిల్లాల్లో చంద్రబాబు పర్యటనలకు సిద్ధమవుతున్నారు. యువగళం పాదయాత్ర ఒకవైపు.... మరోవైపు భవిష్యత్‌కు గ్యారెంటీపై చంద్రబాబు ప్రచార యాత్రలు ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# అగ్రిగోల్డ్ బాధితుల ఆర్తనాదాలు సీఎం జగన్ చెవికి చేరడం లేదా?

Agri Gold

విజయవాడ: అగ్రిగోల్డ్ బాధితుల ఆర్తనాదాలు సీఎం జగన్ చెవికి చేరడం లేదా అని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రశ్నించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... ఆరు మాసాల్లో ఇరవై లక్షల మందికి రూ.3986 కోట్లు వడ్డీతో సహా చెల్లిస్తామని జగన్ హామీ ఇచ్చారని.. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అయినా ఇంతవరకు స్పందన లేదని విమర్శించారు. కేవలం రూ.906 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. అగ్రిగోల్డ్ బాధితులు అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. చంద్రబాబు నాడు మూడు లక్షలు ఇస్తానంటే.. జగన్ పది లక్షలు పూలల్లో పెట్టి ఇస్తానన్నారని గుర్తుచేశారు. మరి జగన్‌కు నేటి వరకు పూలు దొరకలేదా.. డబ్బులు రాలేదా చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు బాధితులను ఆదుకునే ఉద్దేశం జగన్‌కు ఉందా అనే అనుమానం కలుగుతోందన్నారు. ఈనెల 20న బాధితులంతా సమావేశమై ఆగష్టు 15న డెడ్ లైన్ పెట్టారని తెలిపారు. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా అయినా జగన్ బాధితులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులకు ఇవ్వాల్సిన డబ్బులు వెంటనే ఇచ్చి.. మాట నిలబెట్టుకోవాలన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు నలభై వేల కోట్లు ఉన్నాయని చైర్మన్ తమ్ముడు చెబుతున్నారని.. మరి ఇంత ఆస్తులు ఉంటే... రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బాధితులకు డబ్బులు చెల్లించడం లేదని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీల వర్షం కురిపించి.. ఇప్పుడు మౌనం ఎందుకు వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ అగ్రిగోల్డ్ యాజమాన్యం పక్షమా, బాధితుల పక్షమా తేల్చుకోవాలన్నారు. జగన్ స్పందించి మృతుల కుటుంబాలకు పది లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలన్నారు. ఆగష్టు 15 నాటికి బాధితులను ఆదుకోకపోతే ఆగష్టు 30న విజయవాడను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇంతకాలం ఎదురు చూశాం.. ఇక మా ఓర్పు, సహనం నశించాయన్నారు. ఈలోపు వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులకు విజ్ఞాపన పత్రాలు అందిస్తామని చెప్పారు. అన్ని జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు పూర్తి చేసి కార్యాచరణపై చర్చిస్తామని తెలిపారు. 40 లక్షల ఓటర్లకు సంబంధించి విషయంలో ఎందుకు న్యాయం చేయడం లేదో జగన్ చెప్పాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

# పేద పిల్లలతో అక్షరాలు దిద్దించే అక్షయపాత్ర 'అమ్మఒడి'

## కురుపాం బహిరంగ సభలో వైయస్ఆర్ సీపీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



పార్వతీపురం మన్యం జిల్లా: చిన్నప్పుడు చరిత్రలో చాలా విప్లవాల గురించి చదువుకున్నాం కానీ, చదువుల విప్లవం ఎలా ఉంటుందో వైయస్ జగన్ ప్రభుత్వంలో కళ్లారా చూస్తున్నామని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గతంలో కార్పొరేట్ స్కూళ్ల ముందు, కాన్వెంట్ స్కూళ్ల ముందు హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించేవని, జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలల ముందు హౌస్‌ఫుల్ బోర్డులు పెడుతున్నారని, గొప్ప మార్పుకు ఇదొక నిదర్శనమని చెప్పారు. రాతలు రాసే బ్రహ్మదేవుడు అమ్మను సృష్టిస్తే.. పేదల తలరాతలను మార్చే అమ్మ ఒడిని మన జగనన్న సృష్టించారన్నారు. వరుసగా నాల్గవ ఏడాది జగనన్న అమ్మ ఒడి పథకం నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసేందుకు కురుపాం నియోజకవర్గానికి వచ్చిన సీఎం వైయస్ జగన్‌కు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కృతజ్ఞతలు తెలిపారు. కురుపాంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. "అమ్మ ఒడి సృష్టికర్త, విద్యా దీవెన ఆవిష్కర్త, నాడు–నేడు రూపకర్త, విద్యారంగ సంస్కర్త, పేదల రాతలు మార్చే ప్రజానేత ముఖ్యమంత్రి వైయస్ జగన్‌కు కురుపాం నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు. అడిగిన వెంటనే ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన పార్వతీపురం మన్యం జిల్లాను ఏర్పాటు చేసిన సీఎం వైయస్ జగన్‌కు జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు. నాల్గవ విడత అమ్మ ఒడి పథకం నిధులు విడదల చేసేందుకు సీఎం వైయస్ జగన్ కురుపాం నియోజకవర్గానికి రావడం చాలా సంతోషం. ఆంధ్రప్రదేశ్ గడ్డ మీద పుట్టిన ప్రతి బిడ్డ, గుడిలాంటి బడిలో ఉండాలనే లక్ష్యంతో తీసుకువచ్చిన పథకం జగనన్న అమ్మ ఒడి. దేశాన్ని పరిపాలించిన ప్రధానులు, రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రులు, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు, పాఠాలు చదివిన విద్యార్థులు ఎవరూ కనీవిని ఎరుగని గొప్ప ఆలోచన అమ్మ ఒడి పథకం. మన రాతలు రాసే బ్రహ్మదేవుడు అమ్మను సృష్టిస్తే.. మన జగనన్న పేదల తలరాతలను మార్చే అమ్మ ఒడిని సృష్టించారు. రాష్ట్రంలో సుమారు 42.60 లక్షల తల్లులకు వారి పిల్లలను పనికి పంపకుండా బడికి పంపాలనే గొప్ప ఉద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఒక కుటుంబం పేదరికం నుంచి బయటపడాలంటే అందుకు చదువు ఒక్కటే మార్గమని నమ్మిన నాయకుడు సీఎం వైయస్ జగన్. అందుకే ప్రతి పేద కుటుంబంలోని పిల్లలకూ చదువులు అందిస్తున్నారు. అమ్మను మించిన దైవం లేదు, అన్నను మించిన ధైర్యం లేదు, అమ్మ ఒడి పథకాన్ని మించిన పథకమే లేదని ప్రతి విద్యార్థి చెప్పుకుంటున్నారు. ఒక దీపం గదికి వెలుగునిస్తుంది.. చదువుల దీపం పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతుందని సీఎం వైయస్ జగన్ చెబుతుంటారు. అందుకనే అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, గోరుముద్ద, సీబీఎస్ఈ సిలబస్, ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ క్లాస్‌రూమ్స్, బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, నాడు–నేడుతో 9రకాల సదుపాయాలను కల్పిస్తున్నారు.

# అమరావతిలో 47వేల గృహాలకు జూలై 8న శంకుస్థాపన: అజయ్‌జైన్



అమరావతి: సీఆర్‌డీఏ పరిధిలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన నిరుపేదల సొంతింటి కల సాకారం దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. సీఆర్‌డీఏ పరిధిలో 50,793 మంది అక్కచెల్లెమ్మలకు 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఇంటి స్థలాలను ఇప్పటికే ఉచితంగా పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 47వేల గృహాలకు జూలై 8న శంకుస్థాపన చేయనున్నట్టు గృహనిర్మాణ శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ తెలిపారు. ఈ సందర్భంగా అజయ్ జైన్ మీడియాతో మాట్లాడుతూ.. 'గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో 50వేల మంది నిరుపేదలకు మే 26వ తేదీన సీఎం జగన్ చేతులమీదుగా ఇళ్ల పట్టాలిచ్చాం. కేంద్రం తొలిదఫాగా 47వేల ఇళ్లను మంజూరు చేసింది. రెండో దశలో మరో 3వేల ఇళ్లు మంజూరవుతాయి.

ఇప్పటికే ల్యాండ్ లెవెలింగ్ కోసం సీఆర్‌డీఏకి రూ.30కోట్లు ఇచ్చాం. ఎల్లుండి గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో సమావేశం జరుగనుంది. తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై నిర్ణయాలు తీసుకుంటాం. లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల జారీ సహా మ్యాపింగ్, జియో ట్యాగింగ్, షేర్‌వాల్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణాలు చేపడతాం. దశలవారీగా ఆరు నుంచి 9 నెలల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం' అని స్పష్టం చేశారు.


# ఉద్యోగుల సంఘం నేత సూర్యనారాయణకు హైకోర్టులో ఊరట




అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణకు హైకోర్టులో ఊరట లభించింది. కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను న్యాయస్థానం కొట్టేసింది. దీంతో ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్ వేసుకునేందుకు ఆయనకు స్వేచ్ఛ లభించింది. బెయిల్ అంశాన్ని జులై 7వ తేదీలోపు తేల్చాలని ఏసీబీ కోర్టుకు ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. అలాగే వచ్చేనెల 7వ తేదీ వరకూ సూర్యనారాయణను అరెస్టు చెయొద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యనారాయణ తరపున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపించారు. సూర్యనారాయణపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోదయ్యాయి.

వాణిజ్య పన్నుల శాఖలో అక్రమాలపై కేసులో నమోదు కావడంతో ఆయన అజ్ఞాతంలో ఉన్నారని తెలుస్తోంది. ఇందుకోసం ముందస్తు బెయిల్ కోసం ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు.

# జ్వరంతో బాధపడుతున్న పవన్.. వారాహి యాత్రకు బ్రేక్..



ఏలూరు : జనసేన అధినేత పవన్ కల్యాణ్ గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఆయన నేడు, రేపు వారాహి యాత్రకు బ్రేక్ తీసుకున్నారు. ప్రస్తుతం పవన్ భీమవరంలో బస చేశారు. విశ్రాంతి నిమిత్తం వారాహి యాత్రకు ఆయన బ్రేక్ ఇచ్చారు. భీమవరంలో ఈ నెల 30వ తేదిన జనసేన బహిరంగ సభ నిర్వహించనున్నారు.

బహిరంగ సభ ఏర్పాట్లపై మాత్రం నాయకులతో చర్చించే అవకాశం ఉంది. పవన్ కల్యాణ్ ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆయన అభిమానులు పలు దేవాలయాల్లో పూజలు చేశారు.

# రూ.16 లక్షల కోట్ల కొవిడ్ రుణాలు స్వాహా..!

కొవిడ్ సమయంలో అమెరికాలో చిరు వ్యాపార సంస్థలను ఆదుకోవడానికి ఇచ్చిన 1.2 ట్రిలియన్ డాలర్ల రుణాల్లో చాలా భాగం పక్కదారి పట్టాయని ఎస్‌బీఏ (స్మాల్ బిజినెస్ అడ్మిన్‌స్ట్రేషన్) ఇన్‌స్పెక్టర్ జనరల్ నివేదిక పేర్కొంది. ప్రభుత్వం మొత్తం రెండు విడతలుగా రిలీజ్ చేసిన ఈ నిధుల్లో 200 బిలియన్ డాలర్ల ( రూ.16లక్షల కోట్ల) మేరకు అవినీతి చోటు చేసుకొందని వెల్లడించింది. తప్పుడు క్లెయిమ్‌ల ద్వారా వీటిని దోచుకొన్నట్లు గుర్తించారు. కొవిడ్ సమయంలో చిరు వ్యాపారాలను కాపాడేందుకు అమెరికాలో 'పే చెక్ ప్రొటెక్షన్ ప్రోగ్రాం' (పీపీపీ), ది ఎకనామిక్ ఇంజూరి డిజాస్టర్ లోన్స్ (ఈఐడీఎల్) కార్యక్రమాలను చేపట్టారు. ఇందుకోసం 1.2 ట్రిలియన్ డాలర్లను వెచ్చించారు. వీటిల్లో కనీసం 17శాతం పక్కదారి పట్టాయని తేల్చారు. ముఖ్యంగా ఈఐడీఎల్ కార్యక్రమంలో అత్యధికంగా 33శాతానికి సమానమైన 136 బిలియన్ డాలర్ల మోసాలు జరగ్గా.. ఇక పీపీపీ కార్యక్రమంలో మరో 64 బిలియన్ డాలర్ల వరకు లెక్కతప్పాయి. ఈ కార్యక్రమాల కింద 2.21 కోట్ల రుణాలు ఇవ్వగా.. వీటిల్లో 45 లక్షల రుణాలు అక్రమార్కుల చేతికి వెళ్లాయని వెల్లడించారు.

"కొవిడ్ సమయంలో వీలైనంత తొందరగా సొమ్మును లబ్ధిదారులకు చేర్చే క్రమంలో ఎస్‌బీఏ నిబంధనలు సరళీకరించింది. నిజమైన లబ్ధిదారులకే సొమ్ము అందుతుందని భరోసాగా ఉంది. మరోవైపు ఆర్థిక సంక్షోభ సమయంలో తేలిగ్గా సొమ్ము లభిస్తుండటంతో మోసగాళ్లు పెద్దఎత్తున ఈ పథకం కింద డబ్బు పొందారు" అని ఎస్‌బీఏ ఐజీ ఆ నివేదికలో పొందు పర్చారు. దీంతో ఆ తర్వాత పలు ఫెడరల్ ఏజెన్సీలు రంగంలోకి దిగి కనీసం 30 బిలియన్ డాలర్ల మొత్తాన్ని సీజ్ చేశాయని పేర్కొంది. ఒక్క మే నెలలోనే 803 మందిని అరెస్టు చేయగా 529 మందికి శిక్ష పడిందని పేర్కొంది. ఎస్‌బీఏ ఐజీ వేల కొద్దీ కేసులను దర్యాప్తు చేస్తోందని పేర్కొంది.

# రాష్ట్రంలో లక్షకోట్ల అవినీతి : బొండా ఉమా

విజయవాడ: సమగ్ర భూ సర్వే పథకం ముసుగులో రాష్ట్రంలో లక్షకోట్ల అవినీతి జరిగిందని, జే గ్యాంగ్ తమ భూ దోపిడీ కోసం 22ఏను ఆయుధంగా మార్చుకుందని టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ శాశ్వత భూ హక్కు పేరుతో ప్రజల భూముల్ని జగన్ శాశ్వతంగా వారికి దూరంచేస్తున్నారని, దొంగ సర్వేలతో జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే 2లక్షల ఎకరాల్ని 22ఏ జాబితాలో చేర్పించారని ఆరోపించారు. అధికారుల్ని భూ యజమానులు, సాగుదారుల ఇళ్లకు పంపించి, 22ఏ జాబితా పేరు చెప్పి, సెటిల్ మెంట్లపేరుతో భయపెట్టి, కారుచౌకగా వాటిని కాజేస్తున్నారన్నారు. వివాదాలులేని భూముల్ని 22ఏ జాబితాలో చేర్పించి, ఇష్టానుసారం వాటిని తొలగిస్తూ జగన్ అండ్ కో యథేచ్ఛగా భూ దోపిడీకి పాల్పడుతున్నారని బొండా ఉమా విమర్శించారు. తమకు నచ్చినభూమి కనిపిస్తే చాలు దాన్ని దక్కించుకునేవరకు అధికారపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు నిద్రపోవడంలేదన్నారు. జగన్ భూ దోపిడీ దెబ్బకు సొంత పార్టీ ఎంపీ కుటుంబమే కిడ్నాప్‌కు గురైందన్నారు. ప్రభుత్వానికి భయపడిన విశాఖపట్నం ఎంపీ ఆఖరికి రాష్ట్రం విడిచిపోవడానికి సిద్ధమయ్యారన్నారు.

పెనమలూరులో ఎన్ఆర్ఐ శ్రీనివాసరావు భూమిని కాజేయడానికి అతన్ని కిడ్నాప్ చేయించడానికి సిద్ధమయ్యారని, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న 22ఏ జాబితా అవకతవకలపై, వైసీపీ నేతల భూ దోపిడీపై, సమగ్రదర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే జగన్ అండ్ కో ఇష్టానుసారం సాగించిన భూ దోపిడీ నిగ్గు తేలుస్తామన్నారు. భూముల్ని కబ్జా చేసిన వారిని, సహకరించిన అధికారుల్ని కఠినంగా శిక్షించి, భూముల్ని కోల్పోయినవారికి న్యాయంచేస్తామని బొండా ఉమామహేశ్వరరావు అన్నారు.

## ఇది నా జీవితం..ఆ టైంలో విపరీతమైన ట్రోల్స్!


ముందు తమిళ సినిమాల్లో నటించి అక్కడ నేషనల్ అవార్డు కూడా అందుకున్న ప్రియమణి ఆ తర్వాత తెలుగు తెరకు పరిచయమై ఎన్నో సినిమాల్లో నటించింది. తెలుగులో తనకు స్టార్ ఇమేజ్ రాకపోయినా సరే తనకంటూ ఒక సెపరేట్ ఇమేజ్ ఏర్పరచుకుంది ప్రియమణి. ఎన్.టి.ఆర్ బాలకృష్ణ వెంకటేష్ నాగార్జున లాంటి స్టార్స్ తో నటించిన ప్రియమణి నటనలో తన మార్క్ చూపిస్తూ వచ్చింది. పెళ్లి తర్వాత కూడా కెరీర్ గ్రాఫ్ ఎక్కడ పడిపోకుండా చూసుకుంటూ వస్తుంది ప్రియమణి. అయితే లేటెస్ట్ గా తన పై వచ్చిన బాడీ షేమింగ్ కామెంట్స్ ట్రోల్స్ పై స్పందించింది ప్రియమణి. బాడీ షేమింగ్ ట్రోల్స్ ని తాను పెద్దగా పట్టించుకోలేదని తన కలర్ లుక్స్ పై చాలా సార్లు ట్రోల్స్ చేశారని కాకపోతే వాటిని తాను పెద్దగా పట్టించుకోలేదని అన్నారు. అయితే తను ముస్తఫా ని ప్రేమించి పెళ్లాడినప్పుడు మాత్రం నెటిజన్ల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొన్నానని అన్నారు ప్రియమణి.



తన ఎంగేజ్మెంట్ ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసినప్పుడు నువ్వు ఓ ముస్లిం వ్యక్తిని ఎందుకు పెళ్లిచేసుకున్నావ్ అంటూ చాలా దారుణంగా కామెంట్స్ చేశారని.. అయితే అలా కామెంట్ చేసిన వారందరికీ తన ఆన్సర్ ఒక్కటే అంటుంది ప్రియమణి. ఇది తన జీవితం.. ఎవరితో జీవితాన్ని పంచుకోవాలి అన్నది పూర్తిగా తన ఇష్టపూర్వకంగా చేస్తుందట. ట్రోల్స్ కు అనవసరమన అటెన్షన్ ఇచ్చి వాటి వల్ల తర్వాత ఇబ్బంది పడటం తనకు ఇష్టం లేదని అంటుంది ప్రియమణి. అసలు అలాంటి ట్రోల్స్ ని తాను పట్టించుకోనని తన పని తాను చేసుకుంటూ వెళ్తానని అంటుంది అమ్మడు. ఆన్ లైన్ ట్రోలింగ్ పై ప్రియమణి చేసిన కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. కన్నడ అమ్మాయే అయినా తెలుగు తమిళ మలయాళ హిందీ భాషల్లో సినిమాలు చేసింది ప్రియమణి. హీరోయిన్ గా ఆఫర్లు లేని టైం లో ఎలాంటి పాత్ర వచ్చినా చేస్తూ కెరీర్ సాగిస్తుంది ప్రియమణి. రీసెంట్ గా చాలా సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ చేస్తూ వస్తున్న ప్రియమణి నెగిటివ్ రోల్స్ కి సై అనేస్తుంది. కస్టడీ సినిమాలో ఆమె అలాంటి పాత్రతోనే మెప్పించింది. ప్రస్తుతం అట్లీ డైరెక్షన్ లో షారుఖ్ ఖాన్ నటిస్తున్న జవాన్ సినిమాలో కూడా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తుంది ప్రియమణి. తనకు ఇచ్చిన పాత్రకు పూర్తి స్థాయిలో న్యాయం చేయగల నటీమణుల్లో ప్రియమణి ఒకరు. అందుకే ఆమెకు ఇప్పటికీ తనకు తగిన పాత్రలు వస్తున్నాయి.

## కొత్త జంటల లవ్ కెమిస్ట్రీ కాసులు కురిపించింది

నాయకానాయికల మధ్య లవ్ కెమిస్ట్రీ సరిగా కుదిరితే.. మంచి ప్రేమకథ రొమాన్స్ కామెడీ సమకుదిరితే ఒక సాధారణ బడ్జెట్ సినిమా అయినా విజయం సాధిండం కష్టమేమీ కాదని నిరూపణ అవుతోంది. ఇటీవలి కాలంలో బాలీవుడ్ కష్ట కాలంలో ఉన్నప్పుడు వచ్చిన ఓ రెండు రొమాంటిక్ కామెడీ చిత్రాలకు దక్కిన ఆదరణ ఇందుకు ఎగ్జాంపుల్. ఇవి రెండూ చక్కని విజయాలు అందుకున్నాయి. రణబీర్- శ్రద్ధా కపూర్ జంటగా లవ్ రంజన్ తెరకెక్కించిన 'తు ఝూతి మైన్ మక్కార్' సైలెంట్ హిట్ కొట్టింది. ఈ సినిమా పరిమిత బడ్జెట్ తో తెరకెక్కి అందమైన మ్యూజికల్ హిట్ సినిమాగా నిలిచింది. ఈ చిత్రంలో రణబీర్ - శ్రద్ధా నడుమ రొమాన్స్ కెమిస్ట్రీ ఒక రేంజులో వర్కవుటవ్వడమే ఈ విజయానికి కారణం. చకపుల్ గోల్స్ అంటూ రణబీర్- శ్రద్ధా జంట అల్లరి యూత్ కి బాగా నచ్చింది. ఈ టైటిల్ లానే ఈ చిత్రం ప్రేక్షకులకు చాలా సరదాగా ట్రీటివ్వటమే కాకుండా



2023లో ప్రేమ శృంగారంపై సరికొత్త నిర్వచనం చెప్పిన సినిమాగా పేరు తెచ్చుకుంది. ఇప్పుడు విక్కీ కౌశల్ - సారా అలీ ఖాన్ జంటగా నటించిన తాజా చిత్రం 'జరా హాట్కే జరా బచ్కే' టైటిల్ ఎంత ఛమత్కారంగా ఉందో సినిమా కూడా అంతే క్లీన్ హిట్ సాధించింది. పరిమిత బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా 85 కోట్ల నికర వసూళ్లతో ప్రయోజనకరమైన ఫలితాన్ని అందుకుంది. వందల కోట్లతో తెరకెక్కిస్తున్న అగ్ర హీరోల సినిమాల వసూళ్లతో పోలిస్తే చాలా ఉత్తమం అని ఈ రెండు సినిమాలు నిరూపించాయి. ఇకపోతే జరా హాట్కే జరా బచ్చే లో కొత్త జంట లవ్ కెమిస్ట్రీ ఒక రేంజులో వర్కవుటైందని తాజాగా రివీలైన ఫోటో చెబుతోంది. విక్కీ- సారా జంట నడుమ రొమాన్స్ హత్తుకునే లెవల్లో వర్కవుటైందని ఈ ఫోటో చెప్పకనే చెబుతోంది. చిన్న మధ్యతరహా బడ్జెట్ సినిమాలు కూడా బాగా ఆడినప్పుడే పరిశ్రమకు మనుగడ ఉంటుంది. జరా హాట్కే జరా బచ్కే మీడియం బడ్జెట్ తో తెరకెక్కిన రియల్ రొమాంటిక్ కామెడీ. ఈ చిత్రం సాధించిన విజయం సినీ పరిశ్రమకు పెద్ద ఊపునిచ్చింది. అసాధారణ బడ్జెట్లతో భారీ పాన్ ఇండియా సినిమాలు తీస్తేనే జనం థియేటర్లకు రారు. మంచి కంటెంట్ కాన్సెప్ట్ ఉన్న మధ్యస్థ బడ్జెట్ సినిమాల్ని థియేటర్లలో ఆదరిస్తారనడానికి ఈ సినిమాలు ఉదాహరణ. ఈ ఏడాది లో 'తు ఝూతి మైన్ మక్కార్' - 'జరా హాట్కే జరా బచ్కే' చిత్రాలు సైలెంట్ హిట్లు కొట్టడం బాలీవుడ్ కి కొంతలో కొంత ఊరట. చాలా చిన్న సినిమాలు ఓటీటీలపై ఆధారపడి తీస్తున్నారు. అందుకు భిన్నంగా మంచి కంటెంట్ ఉన్న సినిమాల్ని పెద్ద తెరపైనే రిలీజ్ చేస్తే చక్కని రిజల్ట్ దక్కుతుందని కూడా నిరూపణ అవుతోంది.




## ప్లాస్టిక్ బార్బీ డాల్స్.. పడిందిగా బిగ్ పంచ్!



బలమైన శాశ్వతమైన స్నేహానుబంధాన్ని కొనసాగిస్తున్న ఈ హాట్ పింక్ బార్బీ లు ఎవరై ఉంటారు? గెస్ .. హూ దే ఆర్? వీళు ఎవరు? ఇందులో ఒకరు దిశా పటనీ.. మరొకరు మౌని రాయ్. షోకేస్ నుంచి ఊడిపడిన అందమైన బార్బీ బొమ్మల్లా దిశా-మౌని ఎంతో క్యూట్ గా కనిపిస్తున్నారు కదూ? ఈ బొమ్మలు ఎంత ఖరీదైనవి అయినా కొనేందు కు కోటీశ్వరులు వెంటపడినా ఇవి చిక్కని దొరకని విలాసవంతమైన బార్బీలు. సెక్సీ పింక్ షార్ట్ డ్రెస్ లో దిశా - మౌని జతగా కెమెరాకు ఫోజులివ్వగా ఈ ఫోటో అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. స్ట్రాపీ డ్రెస్ లో టై-అప్ డీటెయిలింగ్ నెక్ లైన్ కి తగ్గట్టుగా బ్యూటిఫుల్ డిజైనర్ హ్యాండ్ బ్యాగ్ తో దిశా స్టైలింగ్ ని పూర్తి చేయగా... మౌని స్ట్రాపీ హీల్స్ తో స్పెషల్ గా కనిపించింది. అలా అందంగా కెమెరా కు పోజులిస్తూ అంతే బ్యూటిఫుల్ గా ఆ ఇద్దరూ స్మైలిస్తున్నారు. ఈ ఫోటోల కు నెటిజనుల నుండి అనేక స్పందనలు వచ్చాయి. వీటి లో కొన్ని పాజిటివ్.. చాలా నెగెటివ్ కామెట్లు ఉన్నాయి. కొందరు వారి స్నేహానుబంధాన్ని ప్రశంసించగా.. మరికొందరు 'ప్లాస్టిక్ బేబీస్' అని కూడా కామెంట్ చేసారు. ఒక నెటిజన్ 'ప్లాస్టిక్ బార్బీ డాల్స్' అని రాశారు. మరొకరు.. మౌనీ నా ఆల్ టైమ్ ఫేవరెట్ ప్లాస్టిక్ క్వీన్... కొన్నిసార్లు తీవ్రమైన వేడి వాతావరణం లో ఆమె శరీర భాగాలు కరిగిపోవచ్చని భయపడతాను! అంటూ ఘాటుగా వ్యాఖ్యానించాడు. ఇంతకీ ఆమె(మౌని)తో ఉన్న ఇతర వస్తువు ఎవరు? కచ్చితంగా మౌని వలె అదే డాక్టర్ తో కత్తి కింద పదును (సర్జరీని) చూసింది.. అంటూ ఆ ఇద్దరినీ ప్లాస్టిక్ సర్జరీల క్వీన్స్ అని పరోక్షంగా విమర్శించాడో నెటిజన్. అమ్మాయిలు అందాన్ని కోల్పోయారు... నగ్నత్వం ఆధునికత్వం! అంటూ మరొకరు నిరాశగా వ్యాఖ్యానించారు.

బార్బీ అందాలు మైమరిపిస్తున్నాయని పలువురు నెటిజనులు పాజిటివ్ గా వ్యాఖ్యానించారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే దిశా పటాని చివరిగా ఏక్ విలన్ రిటర్న్స్ లో కనిపించింది. ప్రస్తుతం ప్రాజెక్ట్ K లో ప్రభాస్- దీపికా పదుకొనేతో కలిసి పని చేస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్రా సరసన 'యోధ'లోను నటిస్తోంది. సిరుత్తై శివ దర్శకత్వం వహిస్తున్న సూర్య 42తో దిశా తమిళం లోకి అడుగుపెట్టనుంది. బ్రహ్మాస్త్ర లో చివరి సారిగా కనిపించిన మౌని.. తదుపరి పాలక్ తివారీ- సన్నీ సింగ్ లతో కలిసి 'ది వర్జిన్ ట్రీ'లో కనిపించనుంది.

## గుడ్ ఫ్రెండ్స్ గ్యాప్ తర్వాత కలిస్తే అంతేనా?





విజయ్ దేవరకొండ- రష్మిక మందన్న రిలేషన్ గురించి రకరకాల పుకార్లు షికార్ చేస్తున్న సంగతి తెలిసిందే. నిజానికి ఆ ఇద్దరూ మంచి స్నేహితులు మాత్రమేనని ప్రకటించినా దానిని అభిమానులు పట్టించుకునే మూడ్ లో లేరు. ఈ అందమైన జంట రహస్య డేట్ లకు వెళుతోందంటూ ఒక సెక్షన్ అభిమానులు ప్రచారం చేస్తున్నారు. తాజాగా మరోసారి డేట్ ను ఆస్వాధించిన ఈ జంటపై రకరకాలుగా పుకార్లు షికార్ చేస్తున్నాయి. ఆ ఇద్దరు తారలు ఇటీవల నగరంలో డేట్ ని ఆనందిస్తున్న ఫోటోలు కనిపించడంతో మరోసారి ప్రచారం ఊపందుకుంది. అయితే రష్మిక- విజయ్ కుటుంబ సభ్యులు స్నేహితులు కూడా ఈ పార్టీలో ఉన్నారు. దీంతో ఇది కేవలం కుటుంబ సభ్యులతో సెలబ్రేషన్ అని అర్థం చేసుకోవాలి. రష్మిక- విజయ్ నడుమ చక్కని స్నేహ సంబంధాలు ఉన్న మాట వాస్తవం. విజయ్ కుటుంబంతో కలిసి పోయి రష్మిక ఎంతో డిగ్నిఫైడ్ గా నడుచుకుంటారు. ఇప్పుడు కూడా రష్మిక - విజయ్ ఒకరికొకరు తమ స్నేహితులతో కొంత నాణ్యమైన సమయాన్ని ఆస్వాధిస్తున్న వీడియో ఇంటర్నెట్ లో హల్ చల్ చేస్తోంది. వీడియోలో విజయ్ అందరితో చాట్ చేస్తున్నప్పుడు రష్మిక మరొక మహిళ డ్యాన్స్ చేస్తూ అల్లరిగా కనిపించింది.

రష్మిక - విజయ్ తొలిసారిగా 2018లో విడుదలైన గీత గోవిందం చిత్రంలో నటించారు. ఈ చిత్రం షూటింగ్ సమయంలో ఇద్దరూ ప్రేమలో పడ్డారని ప్రచారమైంది. 2019లో ఇద్దరూ డియర్ కామ్రేడ్‌లో మరోసారి స్క్రీన్ ను షేర్ చేసుకున్నారు. తరువాత 2022లో రష్మిక- విజయ్ ఒకరికొకరు నెలల తేడాతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టారు. అదే క్రమంలో ఈ జంటపై రకరకాల పుకార్లు షికార్ చేసాయి. కానీ తమ మధ్య ఉన్నది మంచి స్నేహం మాత్రమేనని ఆ ఇద్దరూ క్లారిటీనిచ్చారు. వాస్తవానికి ఇద్దరూ కలిసి 2023 నూతన సంవత్సరాన్ని దుబాయ్ లో సెలబ్రేట్ చేసుకున్నారు. ఫిబ్రవరిలో దుబాయ్ లో విజయ్ అతడి కుటుంబంతో కలిసి వెకేషన్ ఆస్వాధిస్తుండగా అక్కడ రష్మిక మందన స్పెషల్ గా కనిపించింది. ప్రతిసారీ కుటుంబంతో కలిసి సెలబ్రేషన్స్ లో రష్మిక కనిపిస్తోంది. అయితే మీడియా ప్రచారం వేరొకలా టర్న్ తీసుకుంటోంది.

## భగవంత్ కేసరి.. శ్రీ లీల సర్ ప్రైజ్..!

నందమూరి బాలకృష్ణ అనీల్ రావిపుడి క్రేజీ కాంబినేషన్ లో వస్తున్న సినిమా భగవంత్ కేసరి. ఈ సినిమాను షైన్ స్క్రీన్ బ్యానర్ లో హరీష్ పెద్ది సాహు గారపాటి నిర్మిస్తున్నారు. సినిమాకు థమన్ మ్యూజిక్ అందిస్తుండగా రీసెంట్ గా రిలీజైన భగవంత్ కేసరి టీజర్ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేసింది. సినిమాలో బాలయ్య లుక్ క్యారెక్టరైజేషన్ అంతా కొత్తగా ఉంటాయని తెలుస్తుంది. ముఖ్యంగా భగవంత్ కేసరి సినిమాలో శ్రీ లీల పాత్ర మెయిన్ హైలెట్ గా నిలుస్తుందని అంటున్నారు. పెళ్లి సందడి ధమాకా ఈ రెండు సినిమాలతో శ్రీ లీల తెలుగులో సూపర్ క్రేజ్ తెచ్చుకోగా ఆమె డ్యాన్స్ చలాకీతనం ఆడియన్స్ కి తెగ నచ్చేసింది. అదే ఆమెకు వరుస



అవకాశాలు వచ్చేలా చేస్తుంది. టాలీవుడ్ లో ఇప్పుడు అమ్మడు వరుస స్టార్ ఛాన్స్ లు అందుకుంటుంది. మహేష్ పవన్ లాంటి స్టార్స్ తో జత కడుతుంది. అయితే వీటిలో భగవంత్ కేసరి సినిమాలో శ్రీ లీల పాత్ర సర్ ప్రైజ్ చేస్తుందని టాక్. సినిమాలో ఆమెది కీలకమైన పాత్ర కాగా శ్రీ లీల పాత్ర చుట్టూ కథ ట్విస్ట్ లు ఉంటాయని తెలుస్తుంది. ఈ పాత్రను అనీల్ రావిపుడి చాలా బాగా డిజైన్ చేశారని అంటున్నారు. అందుకే శ్రీ లీల పాత్ర గురించి ఎలాంటి హింట్ బయటకు రాకుండా చాలా సీక్రెట్ గా ఉంచుతున్నారట. భగవంత్ కేసరి సినిమా శ్రీ లీల లోని మరో యాంగిల్ ని చూపిస్తుందని అంటున్నారు. సినిమా తర్వాత శ్రీ లీల రేంజ్ మరింత పెరుగుతుందని టాక్.

బాలయ్య సినిమాలో మరో పాత్ర హైలెట్ అంటే ఆ తర్వాత దశ తిరిగినట్టే. భగవంత్ కేసరి లో శ్రీ లీల తన పెర్ఫార్మెన్స్ తో మెప్పిస్తుందని అంటున్నారు. శ్రీ లీల మాత్రమే కాదు ఈ సినిమాలో కాజల్ పాత్ర కూడా కొత్తగా ఉంటుందని అంటున్నారు. ఇదివరకు కాజల్ కమర్షియల్ సినిమాలు చేయగా బాలయ్య భగవంత్ కేసరి సినిమాలో ఆమె పాత్ర కూడా డిఫరెంట్ గా ఉండబోతుందని తెలుస్తుంది. భగవంత్ కేసరి దసరా రిలీజ్ కన్ఫర్మ్ అయినట్టే. ఈ సినిమాతో బాలయ్య హ్యాట్రిక్ హిట్ కొట్టాలని చూస్తున్నారు. సినిమాలో బాలయ్య మార్క్ మాస్ మేనియాతో పాటుగా అనీల్ రావిపుడి మార్క్ ఎంటర్టైన్ మెంట్ కూడా ఉంటుందని తెలుస్తుంది.

## దహాద్ సిరీస్ హిట్టు పడ్డాక సోనాక్షిలో కొత్త జోష్

సోనాక్షి సిన్హా సరదా సముద్ర విహారం ఇప్పుడు అభిమానుల్లో విస్తృతంగా చర్చకు వచ్చింది. పాపులర్ ఐల్యాండ్ సీషెల్స్ (ఆఫ్రికా) లో సాహసోపేతమైన పర్యటనకు విచ్చేయాల్సిందిగా తన అభిమానులను టెంప్ట్ చేస్తూ ఓ వీడియోని సోనాక్షి షేర్ చేసింది. సోనాక్షి సిన్హా తన నెయిల్ బ్రాండ్ సోజీని ప్రమోట్ చేయడానికి తన బృందంతో కలిసి సీషెల్స్ కు బయలుదేరిందని సమాచారం. పనిలో పనిగా సీషెల్స్ కి బోలెడంత ప్రమోషన్ చేసింది. ఈ ప్రయాణంలో సోనాక్షి దూకుడు ఆనందం చూస్తుంటే మునుపెన్నడూ లేని జోష్ ఇప్పుడు తన బాడీ లాంగ్వేజ్ లో కనిపిస్తోందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. సోనాక్షి సిన్హా ఇటీవలి వెబ్ షో దహాద్ విజయంతో చాలా ఆనందంగా దూసుకుపోతోంది. ఈ సిరీస్ ఆద్యంతం రఫ్ కాప్ పాత్రలో సోనాక్షి అద్భుతంగా నటించింది. ఇంతలోనే తన గోళ్ల రంగు బ్రాండ్ ను ప్రచారం చేయడంలో బిజీ అయిపోయింది. ముఖ్యంగా తన నెయిల్ పాలిష్ బ్రాండ్ సోజీని ప్రమోట్ చేయడంలో బిజీగా ఉంది. ఇటీవలే సీషెల్స్ కు వెళ్లి అక్కడ టూరిజానికి ప్రచారం



చేయడమే గాక తన నెయిల్ పాలిష్ బ్రాండ్ ప్రచారంతోను డబుల్ ధమాకా ట్రీట్ ని ప్లాన్ చేయడం ఆసక్తికరం. ఓ అందమైన కొల్లాబ్ పోస్ట్ లో ఆమె బీచ్ దేశంలోని సుందరమైన ప్రదేశాలను అన్వేషిస్తూ కనిపించింది. ఈస్ట్ ఆఫ్రికన్ దేశాన్ని అన్వేషిస్తున్నప్పుడు తన సోషల్ మీడియా ఫాలోవర్ లను టీజ్ చేస్తూ కనిపించింది. అందమైన ఆహ్లాదకరమైన బీచ్ లకు పేర్గాంచిన సీషెల్స్ లో సోనాక్షి సిన్హా తన వేసవిని గడపడానికి వెళ్లింది. అక్కడ నిర్మలమైన జలాలను అన్వేషించడం తన బృందంతో కలిసి సాహస క్రీడలకు ప్రయత్నించడం ఈ వీడియోలో కనిపిస్తోంది. ఆదివారం నాడు సోనాక్షి ఇన్స్టాగ్రామ్లో తాను గడిపిన అన్ని వినోదాల ఫోటోలను షేర్ చేసింది. సీషెల్స్ క్లుప్తంగా 3 అని క్యాప్షన్ ఇచ్చింది. దీనికి అభిమానులు స్పందిస్తూ లవ్లీ -బ్యూటిఫుల్ అంటూ కాంప్లిమెంట్లు ఇచ్చారు. అయితే తన నెయిల్ బ్రాండ్ ను ప్రమోట్ చేయడానికి సీషెల్స్ కు వెళ్లిన సోనాకు ఇది అంత ఆనందాన్ని కలిగించే యాత్ర కాదు. వాస్తవానికి సోనాక్షి విలేకరుల సమావేశానికి హాజరై ఆ దేశంలో తన ఉత్పత్తి సోజీని ప్రారంభించింది. తన బేబీ ఎంటర్ ప్రెన్యూర్ వెంచర్ ను ముందుకు తీసుకెళ్లడంతో పాటు దహాద్ నటిగా సోనాక్షి సిన్హా తన తదుపరి ప్రాజెక్ట్ ల గురించి మాట్లాడింది. నికితా రాయ్ -ది బుక్ ఆఫ్ డార్క్నెస్ తో పాటు బడే మియాన్ చోటే మియాన్ లోను నటిస్తోంది. ఇందులో అక్షయ్ కుమార్ - టైగర్ ష్రాఫ్ కథానాయకులుగా నటిస్తున్నారు.




హైదరాబాద్: కమ్మ, వెలమ సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం భూములు కేటాయించడంపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించింది. కులాల వారీగా భూముల కేటాయింపును ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఇలా కేటాయించడం కూడా ఓ విధమైన కబ్జానే అని వ్యాఖ్యానించింది. ఆ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 2కి వాయిదా వేసింది.

**బలమైన కుల సంఘాలకు భూములు ఇవ్వడం ఎందుకు? :** కమ్మ, వెలమ సంఘాలకు 5 ఎకరాల చొప్పున భూములు కేటాయిస్తూ 2021 లో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిల్‌పై సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. భూముల కేటాయింపుపై ప్రభుత్వం జారీ చేసిన ఈ జీవో.. సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా ఉందని చెప్పింది. అణగారిన వర్గాలకు భూములు ఇస్తే అర్థం చేసుకోవచ్చని.. బలమైన కులసంఘాలకు భూములు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించింది. సాయిసింధు ఫౌండేషన్‌కు భూకేటాయింపు రద్దు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా హైకోర్టు గుర్తుచేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు స్టే కొనసాగుతుందని స్పష్టం చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు కమ్మ సంఘానికి ఉన్నత న్యాయస్థానం అనుమతించింది.

## తెలంగాణలో మరో పెద్ద కంపెనీ పెట్టుబడి.. ట్విటర్‌లో మంత్రి కేటీఆర్ వెల్లడి



హైదరాబాద్: తెలంగాణలో మరో పెద్ద కంపెనీ పెట్టుబడి పెట్టబోతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ అయిన 'TCL Global' తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ముందుగా రూ.225 కోట్ల పెట్టుబడితో 'TCL Global' తన యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నది. దాంతో రాష్ట్రంలో 500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభ్యంకానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ అయిన 'TCL Global'ను తెలంగాణ రాష్ట్రానికి ఆహ్వానిస్తుండటం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ కంపెనీ ఏర్పాటు చేయబోతున్న నూతన ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో వాషింగ్ మెషిన్లను ఉత్పత్తి చేయనున్నారు. భవిష్యత్తులో రిఫ్రిజిరేటర్లను కూడా ఉత్పత్తి చేసే ప్రణాళికతో కంపెనీ ఉన్నది' అని మంత్రి ట్విటర్‌లో పేర్కొన్నారు. 'ముందుగా 'TCL Global' సంస్థ రూ.225 కోట్లతో యూనిట్‌ను ప్రారంభించనున్నారు. దాంతో రాష్ట్రంలోని 500 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. భవిష్యత్తులో కంపెనీని మరింత విస్తరించే అవకాశాలున్నాయి. 'TCL Global' కంపెనీతో కలిసి జాయింట్ వెంచర్ ప్రారంభించనున్న రెసోజెట్ సంస్థకు అభినందనలు' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## కంటి పరీక్షల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానిది ఆల్ టైం రికార్డ్: మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్: సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు.. అంతటి ముఖ్యమైన కళ్లు సరిగ్గా కనిపించకపోవడం వల్ల ఎంతో మంది ఇబ్బంది పడుతుంటారని మంత్రి హరీశ్ రావు అన్నారు. స్కూల్‌కు వెళ్లే విద్యార్థి నుంచి, పండుముసలి వరకు కంటి సమస్యలతో బాధపడుతుంటారని చెప్పారు. చిన్న సమస్యే కదా అని వదిలేస్తూ.. కాలం గడుపుతుంటారని, చివరకు అది పెద్ద సమస్యకు దారి తీస్తుందన్నారు. దీన్ని దృష్టిలోఉంచుకొని సీఎం కేసీఆర్ కంటివెలుగు అనే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, విజయవంతంగా అమలు చేశారని వెల్లడించారు. హైదరాబాద్‌లోని సరోజినీదేవి కంటి దవాఖానలో ఫ్యాకో మెషీన్లను మంత్రి మహమూద్ అలీతో కలిసి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కాటరాక్ట్ సర్జరీల నిర్వహణలో ఈ అత్యాధునిక యంత్రాలు ఎంతో సహాయం చేస్తాయని తెలిపారు. అల్ట్రాసౌండ్ పరిజ్ఞానంతో పనిచేసే వీటి ద్వారా సర్జరీలు సులభంగా, వేగంగా చేసేందుకు అవకాశం లభిస్తుందని, సర్జరీ తర్వాత రోగులు కూడా తొందరగా కోలుకుంటారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12 ఫ్యాకో యంత్రాలను ఏర్పాటు చేశామని, వీటన్నింటినీ ఇప్పుడు ఒకేసారి ప్రారంభించుకున్నామని వెల్లడించారు. సరోజినీదేవి కంటి ఆసుపత్రిలో కూడా రెండు మెషిన్లు ఏర్పాటు చేశామన్నారు. మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో, మహబూబ్‌గర్, వరంగల్, నిజామాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, కరీంనగర్, వికారాబాద్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలో ఒక్కో యంత్రం అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఒక్కో ఫ్యాకో యంత్రం ఖరీదు రూ.28.85 లక్షలు అనీ, మొత్తంగా 12 యంత్రాలకు కలిపి ప్రభుత్వం రూ.3.46 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. ప్రైవేటులో రూ.30 నుంచి రూ.40 వేలు అయ్యే సర్జరీ పేదలకు ఉచితంగా అందనుంది. సర్జరీ నిర్వహించడానికి వైద్య




సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి సమస్యలు గుర్తించిన వారికి ఈ ఫ్యాకో మిషన్ల ద్వారా అవసరమైన చికిత్స అందనుంది. అంధత్వ రహిత తెలంగాణ సాధన కోసం ప్రారంభించిన కంటి వెలుగు.. రెండు దఫాల్లో విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఎవరూ అడగకముందే, ఇంటి పెద్దకొడుకుగా ఆలోచించిన కేసీఆర్ ప్రజల కంటి సమస్యలను దూరం చేసేందుకు ఈగొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'గ్రామాలకు వైద్య సిబ్బంది వచ్చి.. ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అద్దాలు అందించే కార్యక్రమం ప్రపంచంలో తెలంగాణలో మినహా మరెక్కడా లేదు. 100 పని దినాల్లో కోటి 62 లక్షల మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో దృష్టి లోపంఉన్న 40.59 లక్షల మందికి అంటే 25.1 శాతం మందికి అద్దాలు పంపిణీ చేశారు. అందులో 22.51 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు అందించాం. 18.08 లక్షల ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ కూడా ఉచితంగా పంపిణీ చేశాం. ఇంత పెద్ద మొత్తంలో కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు, మందులు పంపిణీ చేసిన ఘనత బీఆర్ఎస్‌కుకు తప్ప ప్రపంచంలో మరే ప్రభుత్వానికి లేదు. కంటి పరీక్షల్లో తమది ఆల్ టైం రికార్డ్' అని మంత్రి హరీశ్ రావు చెప్పారు.

## మరో 2000 కోట్ల అప్పు తీసుకున్న తెలంగాణ




హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2000 కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం నిర్వహించిన ఈ–వేలంలో సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టి ఈ రుణాన్ని సేకరించింది. 22 ఏళ్ల కాల పరిమితి, 7.40 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు, 28 ఏళ్ల కాల పరిమితి, 7.39 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు... మొత్తం 2000 కోట్లను అప్పుగా తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ కూడా రూ. 2000 కోట్ల అప్పు తీసుకుంది. దేశంలోని 12 రాష్ట్రాలు రూ.22,450 కోట్ల అప్పులు తీసుకున్నాయి.

## తెలంగాణలో రెండు కొత్త మండలాల ఏర్పాటు.. ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూశాఖ

రాష్ట్రంలో కొత్తగా మరో రెండు మండలాలు ఏర్పాటుకానున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలంగా ఏర్పాటైంది. ఈ మేరకు కొత్తపల్లి గోరి మండలాన్ని ఏర్పాటు చేస్తూ రెవెన్యూశాఖ బుధవారం తుది నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్తపల్లి గోరి మండలం ఏర్పాటుకు గత జనవరిలో ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రజల నుంచి అభ్యంతరాలు, వినతులు స్వీకరించి.. వాటిని పరిశీలించి తుది నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 11 మండలాలు, 241 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్త మండలం ఏర్పాటుతో మండలాల సంఖ్య 12కు చేరనున్నది.

**రంగారెడ్డిలో ఇర్విన్ మండలం ఏర్పాటుకు ప్రతిపాదన :** కొత్తగా రంగారెడ్డి జిల్లాలో ఇర్విన్ మండల ఏర్పాటుకు రెవెన్యూశాఖ ప్రతిపాదించింది. మాడ్గుల్ మండలం నుంచి తొమ్మిది గ్రామాలతో ఇర్విన్ మండలం ఏర్పాటుకు ప్రతిపాదిస్తూ రెవెన్యూశాఖ ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఏవైనా అభ్యంతరాలు, వినతులు ఉంటే పది రోజుల్లో సమర్పించాలని సూచించింది. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో 27 మండలాలున్నాయి.

అలాగే 12 మున్సిపాలిటీలు, మూడు నగరపాలక సంస్థలున్నాయి. ఇర్విన్ మండల ఏర్పాటుతో మండలాల సంఖ్య 28కి చేరనున్నది. అలాగే హనుమకొండ జిల్లాలోని రెండు గ్రామాల బదలాయింపునకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అయ్యింది. హనుమకొండ జిల్లా వేలేరు మండలం కన్నారం గ్రామాన్ని సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలానికి బదిలీ చేసింది. అలాగే వేలేరు మండలం ఎర్రబల్లె గ్రామాన్ని అదే జిల్లాలోని భీమదేవరపల్లి మండలానికి బదలాయించింది. అభ్యంతరాలు, వినతులకు పక్షం రోజుల గడువు ఇస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.




## ఈటల భద్రతపై మంత్రి కేటీఆర్ ఫోకస్..

హైదరాబాద్ : తాజాగా బీజేపీ చేరికల కమిటీ ఛైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్.. ఇటు మంత్రి కేటీఆర్ ఒకరిపై మరొకరు ఎక్కడలేని ప్రేమ కురిపించుకుంటున్నారు. ఈటల ఇలా తనకు ప్రాణహాని ఉందని అన్నారో లేదో.. అలా మంత్రి కేటీఆర్ ఆయన భద్రతపై ఆరా తీశారు. రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్‌కు ఫోన్ చేశారు. ఈటల భద్రతపై సీనియర్ ఐపీఎస్‌తో వెరిఫై చేయించాలని డీజీపీకి కేటీఆర్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం సెక్యురిటీ పెంపు వార్తల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరుపునే సెక్యూరిటీ ఇవ్వాలని కేటీఆర్ సూచించారు. తనను చంపేందుకు కుట్ర జరుగుతోందన్న ఈటల మాటల నేపథ్యంలో భద్రత పెంపుపై డీజీపీ సమీక్ష చేయనున్నారు. ఈటల సైతం స్వరం మార్చారు. గతంలో మాదిరిగా కేసీఆర్‌పై కత్తులు, మిరియాలు నూరడం లేదు. తాజాగా తనకు బీఆర్ఎస్‌తో ఎలాంటి ప్రాబ్లమ్ లేదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌పై కేసీఆర్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత పంచాయతీ లేదని.. బీఆర్ఎస్ నుంచి తనను వెళ్ళగొట్టినప్పుడు మంత్రి కేటీఆర్ సహా.. సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు కూడా బాధపడి ఉంటారని చెప్పుకొచ్చారు. మరి ఇంతకీ ఆయనను బీఆర్ఎస్ నుంచి వెళ్లగొట్టింది ఎవరు? ఎవరో వెళ్లగొడితే ఈయన మూటా ముల్లె సర్దేసుకుని బయటకు వచ్చారా? అనేది ఆసక్తికరం. మొత్తానికి అటు బీఆర్ఎస్ కానీ.. ఇటు ఈటల కానీ ఒకరిపై మరొకరు ఒక సాఫ్ట్ కార్నర్‌లో నడుచుకోవడమనేది ఆసక్తికరంగానూ.. రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగానూ మారింది.

## సర్పంచ్ నవ్యకు సపోర్ట్‌గా అత్త, ఆడపడుచు..

### రాజయ్య వేధింపులపై కేసీఆర్, కేటీఆర్ ఎందుకు పట్టించుకోవడం లేదని ఫైర్

వరంగల్ : స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే రాజయ్య, జానకిపురం సర్పంచ్ నవ్య ఎపిసోడ్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సర్పంచ్ నవ్యకు మద్దతుగా ఆమె అత్త, ఆడపడుచు నిలవడం ఆసక్తికరంగా మారింది. ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో నవ్య అత్త, ఆడపడుచు మాట్లాడారు. ఎమ్మెల్యే రాజయ్యతో తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని తెలిపారు. తన కోడలు ఏ తప్పు చేయలేదన్నారు. తన కోడలిని ఎమ్మెల్యే రాజయ్య, ఆయన అనుచరులు వేధిస్తున్నారని నవ్య అత్త తెలిపారు. తన కోడలు, కొడుకు గ్రామ అభివృద్ధి కోసం ఒంటిపై బంగారం సహా, పొలం కూడా అమ్మారని నవ్య అత్త తెలిపారు. గ్రామానికి నిధులు ఇవ్వకుండా ఎమ్మెల్యే వేధించారన్నారు. విధిలేని పరిస్థితుల్లోనే తన కోడలు రోడ్డుపైకి వచ్చిందన్నారు. ఎమ్మెల్యే రాజయ్య వేధింపులపై కేసీఆర్, కేటీఆర్ ఎందుకు పట్టించుకోవడం లేదని నవ్య అత్త ఫైర్ అయ్యారు. తన ఆత్మగౌరవాన్ని చంపుకుని ఓ మహిళా సర్పంచ్ బయటకు వచ్చిందంటే



ఎవరూ స్పందించరా? అని నిలదీశారు. నిజానిజాలు తెలుసుకోవాలని.. తమ ఆరోపణల్లో వాస్తవాలు లేకుంటే తమను శిక్షించాలని నవ్య ఆడపడుచు అన్నారు. ఎమ్మెల్యే మనుషులు తమ కుటుంబంలో చిచ్చు పెట్టారన్నారు. కేసీఆర్, కేటీఆర్ తమకు న్యాయం చేయాలని నవ్య ఆడపడుచుకోరారు.

## క్లిష్ట సమయంలో దేశాన్ని కాపాడిన తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు: ముఖ్యమంత్రి కేసీఆర్



హైదరాబాద్: క్లిష్ట సమయంలో దేశాన్ని కాపాడిన తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. నాడు పీవీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలాలే నేడు దేశ ప్రజల అనుభవంలోకి వచ్చాయని చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతి సందర్భంగా ఆయన సేవలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. పలు సంస్కరణలతో భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడారని తెలిపారు. పీవీ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని వెల్లడించారు. తెలంగాణ ఠీవీ.. మన పీవీ అని చెప్పారు. పీవీ స్ఫూర్తితో దేశాభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని సీఎం కేసీఆర్ అన్నారు.

## మాజీ ప్రధాని పీవీ 102వ జయంతి.. జ్ఞానభూమి వద్ద నివాళులర్పించిన మంత్రులు, ఎమ్మెల్సీ వాణిదేవి

హైదరాబాద్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీవీ జ్ఞానభూమి వద్ద ఆయన కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ వాణిదేవితోపాటు మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్ నాయక్ పుష్పాంజలి ఘటించారు.

పీవీ ఘాట్ వద్ద సర్వమత ప్రార్థనలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణల జాతిపిత పీవీ నరసింహారావు అని అన్నారు. దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి పీవీ అని, సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కిచ్చిన గొప్ప నాయకుడని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ తగినరీతిలో గౌరవిస్తుందని వెల్లడించారు. పీవీ సేవలకు గుర్తింపుగా



కేంద్ర ప్రభుత్వం మాజీ ప్రధానికి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు పీవీ స్ఫూర్తిదాయకమని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. దేశానికి ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి మార్గదర్శకంగా నిలిచారని చెప్పారు.

## ఈ జిల్లాల్లో రెండు రోజులు వర్షాలు.. ఎల్లో అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ..!

రాష్ట్రంలో రాగల రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. ఉత్తర ఒడిశా, దక్షిణ ఝార?ండ్, ఉత్తర ఛత్తీసగఢ్ పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతుందని, దాంతోపాటు నైరుతి రుతుపవనాలు సైతం చురుగ్గా ఉన్నాయని తెలిపింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. బుధవారం నుంచి గురువారం వరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. గురువారం నుంచి శుక్రవారం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో నిర్మల్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, కరీంనగర్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది.

## బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావాలి : మంత్రి ఎర్రబెల్లి

కొడకండ్ల(జనగామ) : అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావాలని రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కోరారు. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. కరువు కాటకాలతో విలవిలలాడిన కొడకండ్ల ప్రస్తుతం అభివృద్ధితో కళకళలాడుతున్నదన్నారు. సమైక్య పాలనలో రైతులు, కూలీలు ఇతర ప్రాంతాలకు వలస పోయారని , సీఎం కేసీఆర్ చొరవతో జరిగిన అభివృద్ధిని చూసి వాపస్ వస్తున్నారని పేర్కొన్నారు. వచ్చిన వారంతా వ్యవసాయం, ఇతర పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని వెల్లడించారు. వ్యవసాయం దండుగ కాదు పండుగగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే నని స్పష్టం చేశారు. చేనేత కార్మికుల కోసం, ఆ వృత్తి మీద ఆధార పడి జీవిస్తున్న అనేక మందికి ఉపాధి కలిగే విధంగా కొడకండ్ల లో మినీ టెక్స్‌టైల్ పార్క్ ను మంత్రి కేటీఆర్‌తో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి పాలకుర్తి నియోజకవర్గంలోనే కుట్టు శిక్షణ చేపట్టానని తెలిపారు. అనంతరం శివరాత్రి ఇద్దయ్య స్మారకార్థం వారి కుటుంబం కొడకండ్ల గ్రామ పంచాయతీ కి డెడ్ బాడీ ఫ్రీజర్ ను మంత్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శివలింగయ్య, అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com